# భగవద్గీత - ఒక పరిశీలన

## డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్



294.592409
... భగవ
198

అనువాదం :

**మాటూరి వెంకట రమణ**

# భగవద్గీత - ఒక పరిశీలన

మూలం :

డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్

అనువాదం :

మాటూరి వెంకటరమణ

ప్రచురణ :

జై భీమ్ సాంస్కృతిక సమితి

విశాఖపట్టణం

భగవద్గీత - ఒక పరిశీలన

ప్రచురణ :
జై భీమ్ సాంస్కృతిక సమితి
విశాఖపట్టణం

ప్రథమ ముద్రణ
ఏప్రిల్ - 14, 1996

కాపీలు - 1000
వెల రూ. 10/-

ప్రతులకు :
నవోదయ బుక్ హౌస్
ఆర్యసమాజ్ ఎదురుగా
కాచిగుడా, హైదరాబాదు

మైత్రిబుక్ హౌస్
మసీదు వీధి - విజయవాడ

జి. నవీన్
క్వార్టర్ ఎఫ్/229
బి.హెచ్.పి.వి. టౌన్ షిప్
విశాఖపట్టణం

రచయిత చిరునామా :
యం.వి. రమణ
39-23-12/2,
వంశీనగర్, మాధవధార
విశాఖపట్టణం - 530 007
ఫోన్ నెం : 559286

294.592409
ఆంధ్ర - భగవ
14348
81198
హైదరాబాద్-500 044

# వి న్న ప ం

అంబేడ్కర్ రచనలు ప్రసంగాలు మూడవ సంపుటిలో వెలువడిన, భాగవద్గీత మీద వ్యాసాలు, (ప్రతి విప్లవానికి - తాత్విక సమర్ధన, కృష్ణుడు అయనగీత, 13వ అధ్యాయం) శ్రీ యం.వి. రమణగారు అనువదించారు. అంబేడ్కర్ దృష్టిలో, భారతదేశంలో బౌద్ధ ధర్మ ఆవిర్భావం ఒక విప్లవాత్మక సంఘటన. ఆ మహోన్నత సాంఘిక విప్లవోద్యమాన్ని అణచివేయడానికి చేసిన ప్రయత్నమే బ్రాహ్మణ మత తిరుగుబాటు. ఇది భారతదేశ చరిత్రలో ప్రతివిప్లవచర్య (Counter Revolution). ఈ ప్రతి విప్లవచర్యను, తాత్వికంగా సమర్థించుకోడానికే భగవద్గీతను రచించడం జరిగింది అనేది అంబేడ్కర్ అభిప్రాయం. ఈ సందర్భంగా భగవద్గీతకు గల చారిత్రక నేపథ్యాన్ని మీకందించడానికి ప్రయత్నించారు శ్రీ రమణగారు. ఎంతో విషయ పరిజ్ఞానంతో ఆయన రాసిన సుదీర్ఘ ఉపోద్ఘాతం కూడ చాల వివరణాత్మకంగా వివేకవంతంగా ఉంది. అంబేడ్కర్ పరిశోధనా ఫలితంగా వెలువడిన వ్యాసంలోని విషయం చాల క్లిష్టమయినది. అయినా సరే అందరూ తప్పని సరిగా చదువదగినది. అందరూ చదువుకునే విధంగా శ్రీ రమణ గారి అనువాదం చాల సరళంగా ఉంది. అంబేడ్కర్ రాసిన మూల వ్యాసం అసంపూర్ణం. అయినా ఆ భాగ యధాతధ అనువాదాన్ని ఈ చిన్న పుస్తకంలో అందిస్తున్నాం. బహుజనులందరూ, బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆలోచనా విధానంలో భాగస్వాములు కావాలన్నది మా ఆకాంక్ష. అందుకే, మా యీ చిన్న ప్రయత్నం.

జి. నవీన్

జై భీమ్ సాంస్కృతిక సమితి

విశాఖపట్టణం

# ఉపోద్ఘాతం

భగవద్గీత గురించి తెలియని భారతీయుడుండడు. హిందువుల సామాజిక జీవనం పై ఎంతో ప్రభావాన్ని చూపిన ఒక ప్రామాణిక గ్రంథంగా గుర్తింపు పొందింది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో కూడ గీతనుండి హిందుత్వాన్ని రగిల్చి స్ఫూర్తిని కలిగించారు ఆనాటి దేశభక్తులు. స్వాతంత్ర్యానంతర కాలంలో ఆధునిక భారతంలో, మతద్వేషాన్ని పెంచడానికి కూడ అదే గీతను వాడుకుంటున్నారు సాంప్రదాయవాదులు.

ఎలాంటి సన్నివేశాన్నయినా సమర్థించుకోడానికి సరిపోయే శ్లోకాలు గీతలో ఉన్నాయి. గీతలో యిలా ఉంది అంటేచాలు, దానికి తిరుగు లేదు. అంతటి ప్రాచుర్యాన్ని సంతరించుకున్నది గీత. మహాభారత యుద్ధ భూమిలో, అర్జునుడు తన బంధు మిత్రులను గురువులను చూసి యుద్ధంచేయడానికి నిరాకరించి నైరాశ్యంతో వెనుకంజవేస్తాడు.

''నిమిత్తాని చ పశ్యామ విపరీతానికేశవ
న చశ్రేయో ను పశ్యామి హత్వాస్వజన మాహవే''
(గీత 1-31)

కృష్ణా! యుద్ధం చేయడానికి ఎన్నో అపశకునములు కనిపిస్తున్నవి. యుద్ధంలో బంధు జనాన్ని చంపిన తర్వాత కలిగే లాభమేమిటో తెలియడంలేదు.

''స్వజనం హి కథం హత్వా సుఖిన స్స్యామ మాధవ''
(గీత 1-37)

కృష్ణా! మన బంధువులను మనమే చంపి ఏమి సుఖాన్ని పొందుతాం. బంధువర్గాన్ని చంపి 'రక్తసిక్తమైన రాజ్యాధికారంతో సంక్రమించిన భోగ భాగ్యాలు నేను అనుభవించలేను' అని విషాదయోగంలో పడిన అర్జునుణ్ని సమరానికి సన్నద్ధుణ్ణి చేయడానికి యుద్ధ భూమిలో కృష్ణుడుచేసిన ఉపదేశమే భగవద్గీత. ఆ ఉపదేశం వేదాల ఉపనిషత్తుల సారం. దానినే పద్దెనిమిది అధ్యాయాలుగా విభజించి గ్రంథస్తంచేసారు.

కృష్ణుడుకీ అర్జునుడుకీ యుద్ధ భూమిలో జరిగిన సంభాషణను సంజయుడు దృతరాష్ట్రునికి నివేదిస్తాడు.

''నీకర్తవ్యం నిర్దేశించినట్లయితే, నీసోదరులనయినా సరే ఎలాంటి మమకారం చూపకుండా చంపు. చంపితే రాజభోగం, చస్తే స్వర్గభోగం లభిస్తుంది. అర్జునా! నామాటవిని పోరాటం ప్రారంభించు. నాపై విశ్వాసం ఉంచినంతకాలం నీకు ఎలాంటి

పాపాలు అంటవు''. ఇవి అర్జునుడితో కృష్ణుడు అన్నమాటలు. ఈ మాటలు భగవంతుడే స్వయంగా చెప్పాడని అన్నారు. అందుకే వాటికి అంతప్రత్యేకత. కృష్ణుడి మాటలతో సందిగ్దంలో పడ్డ అర్జుననికి, కృష్ణుడు నోరు తెరచి పదునాలుగు భువనాలను చూపించాడు. తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. శత్రుబలగాన్నంతా తానెప్పుడో సంహరించానని, నీవు శత్రుసంహారానికి నిమిత్త మాత్రుడవు మాత్రమే ననీ అంటాడు. అంతే, అర్జునుడి హత్యాకాండ ప్రారంభవుయింది. రాజ్యాధికారం కోసం, సింహాసనాలను చిక్కించుకోవడంకోసం తలలు నరుక్కున్న తండ్రులు, తనయులు ఎంతమందిలేరు? అన్న దమ్ములెందరులేరు? భారతదేశ చరిత్రపుటలు తిరగేస్తే అలాంటి ఘట్టాలెన్నో మనకు కనిపిస్తాయి. అలాగే కౌరవ సంతతిని తమ బలగాలతో సహా సోదరుల చేతనే సమూలంగా నాశనం చేయించిన కథనమే గీతలోని విషయం. అయితేయిక్కడ యుద్ధం పేరుతో, హత్యాకాండ జరిపించిన కృష్ణుణ్ని ఆరాధ్య దైవంగా చిత్రించడంలోనే వుంది విశేషం.

సంజయుడు ధృతరాష్ట్రునికిలా చెప్పాడని జనమేజయునికి వ్యాసుడుచెప్పాడు. వ్యాసుడు ఇలా చెప్పాడని నైమిశారణ్యంలో ఉగ్రశ్రవుడనే సూతుడు (కవి, గాయకుడు) తన చుట్టూ చేరిన ఋషులతో చెప్పాడు. ఒకరినుండి మరొకరికి వినిపించిన యీ (గీత) గాథలోని ప్రామాణికత గూర్చి ఆనాడెవరూ పట్టించుకోలేదు. ఒక కాల్పనిక గాథకు భగవన్నామంతగిలించి, దానికి ఒక తాత్విక తానూ పరమార్థాన్నీ జోడించి ఒక ప్రత్యేకతను సంతరించిపెట్టారు గీతాకారులు. ఆ విధంగా, వారి వర్గప్రయోజనాన్ని కాపాడుకున్నారు. అదిభక్తి ఉద్యమకాలం. అందుచేత మనుషుల్ని మానసిక బానిసలుగా తయారు చేయడానికి భగవద్గీతను చక్కగా వాడుకోవడం జరిగింది.

''సాక్షాత్తు శ్రీ కృష్ణ పరమాత్ముడే మానవాళికి అందించిన ఉపదేశం. అందుచేత అది బ్రహ్మజ్ఞాన విరాజితమైనది. సర్వవేద సంపూర్ణసారం. ఉపనిషత్ సిద్ధాంతసారం. విశ్వవాఙ్మయమున ఇంతటి గ్రంథరాజము మరొకటి లేదు'' అని శ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు, తమ గీతామకరందం ఉపోద్ఘాతంలోనే చెప్పారు. గీతను, అధ్యయనం చేయని, విశ్వసించని, జన్మ జన్మయే కాదు అన్నంత భ్రమను భక్తి విశ్వాసాలను కల్పించారు. హిందూ మత గ్రంథాల్లో, కర్మకాండల్లో, ఆచారవ్యవహారాల్లో గీత ప్రభావం కనిపిస్తుంది. నాట్యాల్లో, నాటకాలలో, చిత్రకళల్లో, శిల్పకళల్లో సంగీతంలో సాహిత్యంలో, పల్లెపదాల్లో జోలపాటల్లో ఎక్కడవీలయితే అక్కడ సకల కళారూపాల్లోనూ, గీతాతత్వాన్ని కృష్ణభక్తినీ గుప్పించారు. పండితులు మొదలు పామరుల వరకూ కృష్ణతత్వంలో గీతామృతంలో మునిగితేలే విధంగా గీతామహత్యాన్ని కొనియాడారు. భక్తి భావంతోనే ఆగిపోకుండా, కృష్ణుణ్ణి అనేక కోణాల్లో చూపించారు. కృష్ణుడు ఎనమండుగురు భార్యల తోనేకాక

పదహారువేల మంది గోపికలతో సాగించిన శృంగార కేళీ విలాసాలను గూడ గ్రంథస్తంచేశారు. అది రక్తి కాదు భగవంతుడిని, భక్తితో పొందేతాదాత్మ్యం అన్నారు. భక్తజయదేవుడు కూడ కృష్ణుణ్ని యీ విధంగానే ఊహించాడు. కృష్ణుణ్ని పురుషునిగా తనను స్త్రీగా (భక్తునిగా) ఊహించుకొని, వారి మధ్య జరిగిన విశృంఖలశృంగారాన్నీ అద్భుత ప్రణయసన్నివేశాల్నీ వర్ణిస్తూ బూతు అని అనకుండా గీత గోవిందాన్ని రచించాడు. గీత గోవిందంలో, ఎంత వెదకినా కనిపించేది రక్తే. అందులో శ్లోకాలన్నీ అచ్చ తెలుగులోకి తర్జుమా చేసి, జనాలకందిస్తే వేరే సెక్సుపుస్తకాల జోలికి పోకుండా, వాటినే చదువుకుంటారు. అయితే దాన్ని తన్మయంలో ఆధ్యాత్మిక తత్వంతో రాయబడిన, భక్తి పూరిత గ్రంథంగానే చెబుతారు. త్యాగయ్య, క్షేత్రయ్య అన్నమయ్య మొదలైన వాగ్గేయకారులు, యీ భక్తి భావంతోనే భగవంతుణ్ని సంగీత పరంగా కీర్తించి, ఆ కీర్తనలను ప్రజలకందించారు. భక్తి భావం మాట ఎలా వున్నా వారి సంగీత మాధుర్యానికి తలలు వంచని వారుండరు. అక్షరజ్ఞానంలేని పల్లెటూరి తల్లులు గూడ, పాడుకునే విధంగా లాలిపాటల్లో, జోలపాటల్లో గూడ ''కృష్ణతత్వాన్ని'' రంగరించి పోసారు.

''జోఅచ్యుతానంద, జోజోముకుందా...'' పిల్లల్ని నిదురపుచ్చడానికి, తల్లులందరూ, పాడుకునే జోలపాటయిది. ఇది పద్నాలుగో శతాబ్దంలో అన్నమయ్య రాసిన భక్తి కీర్తన. ఆ కీర్తన పాడుకుంటూ, నిదురపోయే తన చిన్నారి ముఖంలో, కృష్ణుడ్ని చూసుకుంటూ మురిసిపోతుంది ఆ తల్లి. సంగీతంలోగల, మాధుర్యాన్నిగాని అన్నమయ్యను గాని ప్రశ్నించడం కాదు. సంగీతపరంగా ''కృష్ణత్వం'' పల్లెప్రజానీకంలోకి ఎంతగా చొచ్చుకు పోయిందో తెలుపడానికి యి దొకచిన్న ఉదాహరణ మాత్రమే.

ఇటీవల కాలంలో, మధురగాయకుడు ఘంటసాల కూడ భగవద్గీతలోని శ్లోకాలను తాత్పర్య సహితంగా, అతిశ్రావ్యంగా గానం చేసారు. వాటిని, గంట గంటకూ, యింట యింటనూ, వినడానికి వీలుగా, టేప్‌చేసి వేలాది కేసెట్లను విడుదల చేశారు వ్యాపారవేత్తలు. గీతలోని, శ్లోకాల, వాటి అర్థాల మాట అటుంచి ఘంటసాల గానంలోని మాధుర్యానికి పరవశించని వారుండరు. ఈ విధంగా గీత అందరి నోళ్ళలోనూ నానేవిధంగా ప్రచారం చేసారు. క్రీ॥శ సుమారు తొమ్మిదోశతాబ్దం నుంచి భగవద్గీతను, ప్రముఖ పారాయణ గ్రంధంగా తయారు చేసారు. ఇటీవల కాలంలో దీనికి మరీ విపరీతమైన ప్రాచుర్యాన్ని కల్పించారు. మహాత్మాగాంధీ వ్యక్తిగతంగా వినియోగించిన భగవద్గీత ప్రతిని లండన్‌లో జరిగిన ఒక వేలం పాటలో పదిన్నరలక్షలకు కొనుగోలు చేసాడు ఒక గుజరాతువ్యాపారి. అమూల్యమైన ఆగీతాప్రతిని, భారత ప్రభుత్వానికి అందజేస్తాడట. ('ఈనాడు' వార్త 2-11-95) విదేశాల్లో గూడ, గీతాభక్తులు ఏ స్థాయిలో ప్రచారం చేస్తున్నారో, యీ వార్తను

చూస్తే తెలుస్తుంది. మన దేశంలో, గీతాతత్వ ప్రచార సంస్థలు కొల్లలు ఊరూరా తిరిగి, భగవద్గీతలోని కృష్ణతత్వం మీద అద్భుతమైన ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తూ వేలాది ప్రజానీకాన్ని కృష్ణ భక్తులుగా తయారు చేస్తున్న, స్వాముల వారినెందరినో చూస్తున్నాం.

ఇంతభారీ ఎత్తున గీతా ప్రచారం ఎందుకుజరుగుతున్నట్టు? గీతకు అంతప్రాధాన్యత ఎందుకు? హిందూ సమాజాన్ని ఇంతగా ప్రభావితం చేస్తున్న ఈ గీత అసలు ఎప్పుడు రచింపబడ్డది? గీతాచార్యుడైన కృష్ణుడెవరు? మహాభారతంలో భగవద్గీతను ఒక అంతర్భాగంగా ఎందుకు చేర్చినట్టు? మహాభారత యుద్ధం నిజంగా జరిగిందా? జరిగితే, ఏ స్థాయిలో, ఎప్పుడు జరిగింది? గీతలో బోధించిన తత్వం ఏమిటి? సమాజంలో వ్యక్తులందరి సమిష్టి (అన్ని వర్గాలు - కులాలు) ప్రయోజనాలను, గీతకాపాడుతుందా? గీతాతత్వంలో గల ప్రామాణికతను, హేతుతత్వంతో, శాస్త్రీయ దృక్పథంతో, చారిత్రక ఆధారాలతో, విశ్లేషించి చూస్తేనే గాని, అందులోని అసలు విషయాలు అవగతం కావు. మారుతున్న సమాజంలో పాతవిషయాలను, క్రొత్త కోణాల్లోంచి, పరిశీలించడం గూడ ఒక సామాజిక అవసరమే.

## గీతరచనా కాలమేది?

భగవద్గీత భారతంలో ఒక భాగం కాబట్టి, భారతరచనా కాలం ఏదో, గీతరచనాకాలం గూడ అదేనంటారు సంప్రదాయ పండితులు. అయితే భారతం ఎప్పుడు రచింపబడింది? ఇది వెంటనే తలెత్తే ప్రశ్న. ఆ కాలాన్ని ఇంతవరకూ సప్రమాణంగా నిర్దిష్టంగా చెప్పిన వైనంలేదు. చారిత్రక వాస్తవాలకంటె, సనాతన తత్వానికే ప్రాధాన్యత ఏర్పడిపోయింది. అందుచేత చారిత్రక సత్యాలు మరుగున పడిపోతున్నయి. స్థూలంగా చాలమంది, భారతం రామాయణానికి తర్వాత, బుద్ధుడుకి పూర్వం అంటే, క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దంలో రచింపబడిన గ్రంథమని అన్నారు. బౌద్ధం గురించి మహాభారతంలో ప్రస్తావన లేని కారణంగా భారతం బౌద్ధానికి పూర్వపురచనే అన్నది ఒక అభిప్రాయం ఉంది. అయితే చారిత్రక దృష్టితో చూస్తే యీ అభిప్రాయం సరియైనది కాదనిపిస్తుంది ఎందుచేతనంటే భారతంలో కొన్ని చోట్ల ''బుద్ధ'' మరియు ''ప్రతిబుద్ధ'', ''ఎడుక'' అనే పదాలు కనబడుతున్నయి. ''ఎడుక'' అనే మాటను పాళీ భాషలో ''డగోబా'' అంటారు. సంస్కృతంలో స్థూపం అనే పదానికి సమాంతర పదమిది ఈ పదాలు భారతంలో వాడబడినయి. ఈ పదాలన్నీ బౌద్ధ సంస్కృతికి చెందినవి. దీనిని బట్టి ఈ మహేతిహాసం, బౌద్ధం భారత దేశంలో ఒక ప్రధాన మతంగా నిలదొక్కుకున్న తర్వాతనే రూపుదిద్దు కున్న గ్రంథమని తెలుస్తుంది. అనేక మంది చారిత్రక పరిశోధకులు బౌద్ధం ఆవిర్భవించిన తర్వాతనే భారతంలోని అనేక భాగాలు, రూపు దిద్దుకున్నాయని అభిప్రాయ పడ్డారు.

ఈ సందర్భంగా ఒక ప్రధాన విషయాన్ని గుర్తించాలి. వాస్తవంగా, వ్యాసుడు రాసిన భారత కథ పేరు 'జయము'. దీనినే 'జయ సంహిత' అన్నారు. ఇది కేవలం 8,800 శ్లోకాల గ్రంథం. వ్యాసుని శిష్యుడు వైశంపాయనుడు, ఈ కథనే జనమేజయునికి చెప్పినపుడు అది 24 వేల శ్లోకాల గ్రంథమయింది. వైశంపాయనుడు చెప్పినపుడు విన్నరో మహర్షిణి కుమారుడు ఉగ్రశ్రవసుడు యీ కథనే నైమిశారణ్యంలో శౌనకాది మహామునులకు చెప్పినపుడు అది 88వేల శ్లోకాల గ్రంథంగా పెరిగింది. ఈ గ్రంథమే మన తెలుగు కవి నన్నయ కాలం (క్రీ॥శ॥ 1020-1060) నాటికి 1,00,705 శ్లోకాల గ్రంథంగా పెరిగింది. అయితే ఆధునిక యుగంలో ఒక అర్ధశతాబ్దం క్రితం పూనాబండార్కర్ ఓరియంటల్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ వారు మద్రాసువావిళ్ళ సంస్థవారు ప్రచురించిన మహాభారత ప్రతుల్లో లక్షా ఇరవై వేలకు మించిన శ్లోకాలున్నాయి. ఈ పెరుగుదల ఒకనాడు జరిగింది కాదు. ఒకరి చేతి మీద జరిగింది కాదు. ఈ చారిత్రక వాస్తవం భారతంలోని భాగమైన భగవద్గీతకు కూడ వర్తిస్తుంది.

గీతరచనాకాలాన్ని పరిశీలించినపుడు అందులో ప్రస్తావించిన 'బ్రహ్మసూత్రాల' ప్రస్తావన గూడ పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. భగవద్గీత పదమూడో అధ్యాయం అయిదో శ్లోకంలో బ్రహ్మసూత్రాల ప్రస్తావనకనిపిస్తుంది.

''ఋషి భిర్బహుదా గీతం చన్దో భిర్వి విధైః పృథక్
బ్రహ్మసూత్ర పదైశ్చవ హేతు మర్భిర్వినిశ్చితైః
(గీత 13-5)

★క్షేత్రక్షేత్రజ్ఞుల స్వరూపనిర్ణయాలు మహర్షులచేత వేదాలచేత అనేక రకాలుగా నిరూపించబడ్డాయి. ఇదంతా బ్రహ్మసూత్రాల సారం. అనుమానానికి అవకాశం లేని విధంగా బ్రహ్మసూత్రాల ప్రస్తావన గీతలో ఉన్నది. ఈ గీతాశ్లోకంలో బాదరాయుని బ్రహ్మసూత్రాలను ప్రస్తావించిన కారణంగా భగవద్గీత తప్పకుండా బౌద్ధానికి అనంతర గ్రంథమేనని అంటారు ప్రముఖ పండితుడు ఆచార్య బీమాన్ బిహారి మజుందార్ ఎందుకంటే బ్రహ్మసూత్రాల్లో ద్వితీయాధ్యాయం, ద్వితీయ భాగంలో 18 నుండి 32 వరకూ ఉన్న సూత్రాలు బౌద్ధంలోని శూన్య వాదాన్ని క్షణిక వాదాన్ని ఖండించాయిగాబట్టి అందుచేత గీత బౌద్ధంతర్వాతదే అని చెప్పడానికి ఈ ఆధారం చాలు అంటారు మజుందార్ గీత రచనాకాలం గూర్చి డాక్టర్ అంబేడ్కర్ యిలా అన్నారు. ''బాలాదిత్యమహారాజ

★క్షేత్రక్షేత్రజ్ఞులవివరణ : క్షేత్రమనగా కేవలం దేహం మాత్రమే కాదు. కంటికి కనబడని పంచభూతా (మనసు, బుద్ధి, ఇంద్రియాలు, మూల ప్రకృతి మొదలైనవి) సముదాయం. క్షేత్రజ్ఞుడనగా ప్రతిశరీరంలో ఉండే ఆత్మ. సర్వ భూతములయందు నెలకొన్ని ఉన్న పరమాత్ముడు.

కాలంలో భగవద్గీత రచన సాగిందని ప్రొఫెసర్ కొశాంబి దృఢాభిప్రాయం. ఆంధ్ర వంశరాజులను ఓడించిన గుప్తవంశానికి చెందినవాడు బాలాదిత్యుడు. క్రీ.శ. 467లో బాలాదిత్యుడు సింహాసనాన్ని అధిష్టించాడు. కోశాంబి గీతరచనకు సంబంధించి, అంత తరువాత కాలాన్ని చెప్పడానికి రెండు కారణాలున్నాయి. క్రీ.శ. 788 వ సంవత్సరంలో జన్మించి క్రీ.శ.820 వ సంవత్సరంలో మరణించిన శంకరాచార్యులు, భగవద్గీతకు భాష్యాన్ని రచించేవరకూ, గీతవెల్లడి కాని సంకలనమే. శంకరాచార్యుని కాలానికి 50 సంవత్సరాలముందే శాంత రక్షితుడు రచించిన తత్వ సంగ్రహంలో భగవద్గీత ప్రస్తావన ఎక్కడాలేదు. ఆయన చెప్పిన రెండో కారణం యిది. వసు బంధువు విజ్ఞాన వాద సిద్ధాంత ప్రవర్తకుడు. వసు బంధ విజ్ఞానవాద విమర్శ బ్రహ్మ సూత్రభాష్యంలో ఉంది గీతలో బ్రహ్మసూత్ర భాష్య ప్రస్తావన ఉంది. కాబట్టి భగవద్గీత వసుబంధు బ్రహ్మసూత్ర భాష్యాలకు తర్వాతది. గుప్తరాజయిన బాలాదిత్యుని గురువు వసుబంధువు. కాబట్టి బాలాదిత్యుని పరిపాలనలో కాని అతని అనంతర కాలంలో కాని భగవద్గీత రచన జరిగి ఉండాలి.''

బౌద్ధం తరువాతనే గీత అంటే ఖచ్చితంగా ఎప్పుడు అనే విషయంలో పరిశోధకుల్లో ఏకాభిప్రాయం కనబడ్డంలేదు. ఈ సందర్భంగా ప్రముఖ పరిశోధకులు పాశ్యాత పండితుల అభిప్రాయలు ఇలా ఉన్నాయి.

1. డగ్లస్ పి.హిల్ : గీత అంతర్గతసాక్షాలను బట్టి అది క్రీస్తుపూర్వం రెండవ శతాబ్దికి చెందిన రచన అన్నారు.

2. వీలర్ : గీత బ్రాహ్మణయుగంలోను తదనంతర కాలంలోను కూర్చబడిన గ్రంథం అంటాడు.

3. ప్రొఫెసర్ గార్బే : వాస్తవగీత క్రీ.పూ. 200 సంవత్సరాల ప్రాంతంలోను ఇప్పుడు లభిస్తున్న (రూపాంతరం చెందిన) గీత క్రీ.శ.200 సంవత్సరాల ప్రాంతంలోను, కూర్చబడిన దంటాడు.

4. కె.టి.తెలంగ్ : ఏది ఏమయినా, గీత క్రీ.పూ. మూడవ శతాబ్దం కంటె పూర్వ రచన అనటానికి అవకాశం లేదంటాడు. ఆతర్వాత గూడ, అనేక కాలల్లో గీత, మార్పులకు చేర్పులకు లోనయినదంటాడు.

5. ఆర్.జి.భండార్కర్ గీత కనీసం క్రీ.పూ. నాలుగవ శతాబ్దానికి పూర్వమే రచింపబడి వుండాలంటాడు. అయితే, ఆ తర్వాత, అనేక మార్పులు చేసివుంటారని గూడ అన్నాడు.

6. గీత మీద, మహరాష్ట్ర పండితుడైన గజానన సత్ఖైర్ నలభై సంవత్సరాలు

పరిశోధనచేశాడు. ''గీతాముఖ్య విచార్'' అనే గ్రంథాన్ని, ''క్రిస్టఫర్ రియల్ గీత'' అనే రెండు గ్రంథాలను ప్రచురించాడు. అందులో గీతను రచించిన వారు ముగ్గురన్నాడు. మొదటి రచయిత క్రీ.పూ. 6వ శతాబ్దంలో గీతను కూర్చాడనీ, రెండవ రచయిత, ఒక శతాబ్దం తర్వాత గీతకు కొన్ని అధ్యాయాలు చేర్చాడనీ, ఆ తరువాత మూడవ రచయిత మరో రెండు శతాబ్దాల తర్వాత అంటే క్రీ.పూ. మూడవ శతాబ్దంలో, నేటి రూపంలో ఉన్న గీతను తయారు చేసాడనీ అన్నారు. ఈ విధంగా గీతను భిన్న రచయితలు, వివిధ కాలాల్లో కూర్చడం వల్ల భాషలో, భావాల్లో తేడాలు వచ్చాయన్నాడు. ప్రక్షిప్తాలు చోటు చేసుకున్నాయన్నాడు. ఏ చారిత్రక కారణాలవల్ల ఏ ఏ దర్శనాలను, ఎలాచర్చించడం జరిగింది అన్న విషయం మీద ఇంకా యితర వకాలిక సమస్యలపైన కూలంకషంగా పరిశీలించి ఖైర్ గ్రంథస్తం చేసిన అభిప్రాయాలిలా వున్నాయి. ''నాలుగు వందల సంవత్సరాల మధ్యకాలంలో, ముగ్గురు రచయితలు చేసిన రచన గాబట్టి గీతలో అనేక వైరుధ్యాలు కనిపిస్తాయి. ఈ గీతాచార్యులు, ఎవరి కోసం ఈ రచన చేసారో కూడా ఆయా అధ్యాయాలు పరిశీలిస్తే స్పష్టంగా తెలుస్తుంది. ప్రథమ ఆచార్యుడు తన రచనను ముఖ్యంగా ఉన్నత వర్గాలకోసం ఉద్దేశించాడు. మేధావులకోసమే రాశాడు. పండితులు, తత్త్వ దర్శినులు, మునులు, బుధులు, మొదలైన వారి కోసం రాసాడు. వీరి దృక్పథంలో మార్పు తీసుకురావడమే, ప్రథమాచార్యుని లక్ష్యం. ద్వితీయాచార్యుడు తాత్వికులకోసమే గీతారచన చేశాడని చెప్పవచ్చు. తృతీయా చార్యుడు మాత్రం ఆర్తులకోసం జిజ్ఞాసులకోసం రాసాడు, అన్యదేవతాభక్తులను, తన దైవం వైపు మళ్ళించి గీతా భక్తులను చేసే ఉద్దేశంతో రాసాడు. స్త్రీలు, వైశ్యులు, శూద్రులు మొదలైన వారిని దృష్టిలో పెట్టుకొని రాసాడు. సామాన్య ప్రజలను విస్మరించకుండా, వాళ్ళ మోక్షం కోసం తన మతప్రచారాన్ని గూర్చి రాసాడు. కాలమేదయినా, కృష్ణ తత్వానికి జనాలను మళ్ళించడమే ప్రధానధ్యేయం''.

7. ఖైర్ అభిప్రాయానికి సన్నిహితంగా డి.డి. కోశాంబీ ''గీతలో ఉపయోగింపబడిన సంస్కృత భాషారూపాల ఆధారంగా గీత క్రీ.శ.150-350 సంవత్సరాల కాలానికి చెందిన దని చెప్పవచ్చు. దీనిలో వ్యక్తమయిన సిద్ధాంతాలు మాత్రం, అంతకు ముందు కాలం నాటివే. ఆసిద్ధాంతాలను సంగ్రహించే, గీత రూపుదిద్దుకుంది. భక్తి భావాన్ని మాత్రం సరికొత్త పద్ధతిలో ఉపయోగించుకుంది'' అన్నాడు.

8. ప్రొఫెసర్ ఎస్.బి. దేశాయి, గీతారచన ఉజ్జాయింపుగా క్రీ॥శ। ఒకటవ శతాబ్దంనుండి క్రీ॥శ 250 సంవత్సరాల కాలంలో జరిగిందంటాడు.

9. ప్రముఖ పరిశోధకురాలు చరిత్రకారిణి అయిన రొమిలాథాపర్ గూడ, బౌద్ధంతర్వాతనే క్రీస్తు శక ప్రారంభకాలంలోనే గీతావిర్భావం జరిగిందన్నారు. మొత్తం మీద పైన పేర్కొన్న పండితుల అభిప్రాయాల ప్రకారం, బౌద్ధం తర్వాతనే ఈ నాటి రూపంలోకి గీత వచ్చిందనేది కాదనలేని వాస్తవం.

ఈ గీత రచనా కాలాన్ని నాటి చరిత్రక పరిస్థితులను అన్వయించుకుంటే, గీతను అసలు ఎందుకు రచించాలిసిన ఆవశ్యకత ఏర్పడిందో కూడ తెలుస్తుంది

## గీతారచన ఎందుకోసం?

మనిషి మరణానంతరం స్వర్గానికెళ్ళాలి. అక్కడ మోక్షం లభించాలి. ఆ మోక్షసాధనకు ఉపనిషత్తులుచూపించిన ఏకైక మార్గం జ్ఞానమార్గం. జ్ఞానమార్గం అంటే వేదాలను అధ్యయనం చేయడం, తపస్సుద్వారా, ఆత్మపరమాత్మల ఏకత్వాన్ని సాధించడం. అయితే ఉపనిషత్-ఋషులు ఈ జ్ఞాన మార్గాల్ని బ్రాహ్మణ క్షత్రియులకు మాత్రమే పరిమితం చేసారు. ఎందుకంటే వేదాలను చదివే అర్హత వారికి మాత్రమే ఉంది గాబట్టి ''శూద్రులు వేదాలు చదివితే, కళ్ళు పీకెయ్యాలనీ, వింటే చెవుల్లో సీసాన్ని కరగబెట్టి పోయాలనీ'' అన్నారు (చూడుః మనుస్మృతి) అందుచేత, శుద్రులకు వేదమూలేదు. జ్ఞానమార్గమూ లేదు. మోక్షమూ లేదు. అవివారికి నిషేధాలు. వారు, దాసవృత్తిలోనే జీవించి మరణించాలన్నారు. అంతవరకే వారికి రాసిపెట్టివుంది అదేవారి కర్మ ఆవిధంగా దాసవృత్తిలో జీవిస్తే మరుజన్మలో వారు అగ్రవర్ణంలో జన్మించగలరనే ఆశను కలిగించారు. కర్మసిద్ధాంతంలోని మర్మంయిదే.

పురోహితవర్గం, ఒకవైపు కర్మకాండల పేరుతో జంతుబలులు నిర్వహించేవారు. మరోవైపు ఉపనిషత్తులు బోధించిన జ్ఞాన మార్గాన్ని అధ్యయనం చేసేవారు. ఆత్మ, పరమాత్మ, కర్మ, మాయ, అంటూ ఆధ్యాత్మికతను బోధించేవారు. ఆకాలంలో శూద్రులపట్ల అగ్రవర్ణాలవారు అత్యంత క్రూరంగావుండేవారు. ఋషులు, తమవ్యక్తిగత, ఫలితాల సాధనకోసం, యజ్ఞం పేరుతో వందల సంఖ్యలో జంతువులను వధించేవారు. హింసవారి జీవన విధానమయి పోయింది. ప్రేమ కరుణ అనే పదాలు వారికి పట్టనే లేదు. యజ్ఞాలు, క్రతువులపేరుతో, సమాజంలో, ఆధిక్యతను నిలుపు కోవడమే ప్రధానం వారికి. ఇలాంటి వాతావరణం, నెలకొని ఉన్న సమాజంలోనే, బుద్ధుడు జన్మించాడు. వేదాలను, ఉపనిషత్తులను అధ్యయనం చేసాడు. సమాజంలో గల వ్యక్తుల జీవిత అనుభవాలను, సుఖదుఃఖాలను, విశ్లేషించాడు. తనకు జ్ఞానోదయమయింతర్వాత, ''సమాశ్రేయస్సు అంటే, బహుజనుల శ్రేయస్సు'' అన్నాడు. అంతే గాని ఒకవ్యక్తి యొక్క ఒక వర్గం యొక్క

శ్రేయస్సు కాదన్నాడు. ఉపనిషత్ బ్రాహ్మణ పెత్తనానికి, వేదప్రామాణికతకు, మూలాధారం బ్రహ్మభావన ఆత్మ, పరమాత్మల భావన. ఈ మూలాధారాలను ప్రశ్నించాడు. బుద్ధుడు. వర్ణవ్యవస్థను, హింసను, నిరసించాడు. కరుణ ప్రజ్ఞ, అహింస భావాలను, ప్రబోధించాడు. యజ్ఞయాగాదులను నిరసించాడంటే, అవన్నీ పశువుల్ని గుర్రాల్ని పెద్ద ఎత్తున బలియిచ్చే క్రతువులు కావడమే కారణం. పశుపాలన వ్యవస్థలో ఏదో ఒకటి రెండు జంతువుల్ని బలియివ్వడం కాదు. వందల సంఖ్యలో గోవుల్ని మేకల్ని వధించడం జరిగేది. వ్యవసాయం, వ్యాపారాల పై ఆధారపడి జీవించే సమాజంలో అంతభారీ ఎత్తున జరిగే జంతుబలులు, అమానుషమేకాదు, అనాగరికం, ఆర్థికంగా నష్టదాయకం కూడ అని ప్రబోధించాడు బుద్ధుడు. ఉపనిషత్ సామాజికవ్యవస్థలో గల వర్ణాధిక్యత మీద, బౌద్ధం మరో రకంగా కూడ దాడిచేసింది. అదేమిటంటే సంఘంలో సమానత్వాన్ని సాధించడం. బౌద్ధ సంఘంలో ప్రతివ్యక్తి కులబేధాల్లేకుండా సమాన హోదాలో చేరవచ్చు. సంఘంలో సమతాభావమే ప్రధానం. ఉపనిషత్ వ్యవస్థలో ఆ సౌకర్యంలేదు. ఇందులో పుట్టుకతో వర్ణం ఏర్పడుతుంది. వర్ణ పరిధిని దాటి పోలేరు. అంటే, వైశ్య శూద్రులు, బ్రాహ్మణ క్షత్రియుల్తో ఏనాటికీ సమానం కాలేరు. ఉపనిషత్ వ్యవస్థకూ, బౌద్ధ సంఘానికీ యింత తేడా ఉన్నందువలన, బుద్ధుడు బోధించిన సమత, మమతలవైపే ప్రజలు ఆకర్షితులయ్యారు. బౌద్ధానికి ఆనాటి రాజుల ఆదరణ గూడ లభించింది. బౌద్ధం తెచ్చిన యీ సాంఘిక విప్లవకారణంగా ఉపనిషత్ మతం, తిరిగి తొలి రూపంలో జీవించలేక పోయింది.

ఆ కాలంలోనే యవనుల, కుషాణుల, శకుల దాడులు గూడ జరిగాయి. పెద్ద ఎత్తున ఈ తెగలు, భారత దేశంలో ప్రవేశించాయి. ఇక్కడ వున్న వర్ణవ్యవస్థను ఈవలసలు, దాడులు అల్లకల్లోలంచేసాయి. వీరందరూ, బ్రాహ్మణ క్షత్రియ వర్గాలలో సర్దుకున్నారు. రక్త సమ్మిశ్రణ కూడ జరిగింది. ఈ విధంగా వర్ణ సంకరం భారీ ఎత్తున జరిగింది. ఈ మార్పు వైదిక వ్యవస్థకు గొడ్డలి పెట్టు అయింది. దీన్ని నివారించడానికే 'స్మృతులు' పుట్టుకొచ్చాయి. అప్పటికి నెలకొని ఉన్న బౌద్ధ సంస్కృతిని పడగొట్టి మరుగున పడి పోయిన ఉపనిషత్ సంస్కృతిని పునరుద్ధరించాలను కుంది నాటి పురోహిత వర్గం. బౌద్ధ సంస్కృతిలో, ఏయే అంశాలను చూసి ప్రజలు ఆకర్షితులయ్యారో ఆయా అంశాలనూ, ఆతత్వాన్నీ వారు సొంతం చేసుకోవాలనుకున్నారు. అది ఆనాటి పురోహిత వర్గానికి, తప్పనిసరి పరిస్థితి అయింది. బహుజన శ్రేయస్సు దుఃఖనివారణకు మార్గాలు, మానవుణ్ణి సత్ప్రవర్తన వైపు నడిపించే, అష్టాంగ మార్గాలు, అందులోకొన్ని. వీటిని, కాపీచేస్తూ వారిసామాజిక పెత్తనానికి అవసరమయ్యే వర్ణ వ్యవస్థను దేవుడి పేరుతో బ్రాహ్మణవర్గం పునరుద్ధరించారు. పురాణాలు, స్మృతులూ పుట్టుకు రావడం అందులో ఒక భాగమే. వర్ణవ్యవస్థ పునరుద్ధరణ గీతావిర్భావంతోనే జరిగిందని తెలుస్తుంది. దానిప్రధాన ఉద్దేశం

కుల వ్యవస్థను పరిరక్షించడమే. ఫ్యూడల్ సంఘాన్ని సుస్థిరంచేయడమే. వర్ణ వ్యవస్థ పతన మవడం అంటే పురోహిత వర్గం స్థాపించిన ధర్మం పతనం కావడమే. ధర్మ సంస్థాపనకోసమే, గీతను సృష్టించడం జరిగింది. ఇంకొంచెంతరచిచూస్తే, కృష్ణ ఉవాచలోని అంతర్యాన్ని గుర్తించగలం.

''యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్''
(గీత 4-7)

''పరిత్రాణాయసాధూనాం వినాశాయ చదుష్కృతామ్
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే''
(గీత 4-8)

''ధర్మం క్షీణించినపుడు అధర్మం పెరుగుతున్నపుడు నేను అవతరిస్తూనే ఉంటాను. (నన్ను నేను సృష్టించుకుంటాను). సజ్జనులను రక్షించుకోడానికి, దుర్మార్గులను శిక్షించడానికి ధర్మస్థాపనచేస్తూనే ఉంటాను''. అంటాడు కృష్ణుడు. ఇందులో గీతా కారుడు ధర్మస్థాపన అని చెయితున్నా సరే అది ఒక వాస్తవ పరిస్థితిని గూడ తెలియజేస్తుంది. బౌద్ధ ప్రభావం కారణం గానూ, శక, కుషాణుల దండయాత్రల వల్లా చతుర్వర్ణ వ్యవస్థలో ఏర్పడిన కల్లోలమే గీతాకారుని దృష్టిలో అ ధర్మం. చాతుర్వర్ణ మనే ధర్మాన్ని స్థాపించడానికే కృష్ణుడు అవతరించాడు. ధర్మస్థాపనఅంటేయిదే. చాతుర్వర్ణ వ్యవస్థ దైవదత్తమనీ, గీత నిర్ద్వందంగానే పునరుద్ఘాటించింది. దేవుడి పేరుచెప్పి జనాలను మభ్య పెట్టడం సులువన్న సంగతి గీతాకారుడు గ్రహించాడు. అందుకే వర్ణ వ్యవస్థను స్థిరపర్చడంకోసం దేవుణ్ని (కృష్ణుణ్ని) వత్తాసు తెచ్చుకున్నాడు గీతాకారుడు.

''చాతుర్వర్ణం మయాసృష్టం గుణ కర్మవిభాగశః
తస్య కర్తా రమపి మాం విద్ధ కర్తా రమవ్యయమ్''
(గీత 4-13)

'గుణములను బట్టీ ఆయా గుణాలకు సంబంధించిన కర్మలను బట్టి నాలుగు వర్ణాలను నేనే సృష్టించాను' అని అంటాడు గీతాకారుడు. మరో చోట

''కృషి గోరక్షవాణిజ్యం వైశ్యం కర్మస్వభావమ్
పరిచర్యాత్మకం కర్మశూద్ర స్యాపి స్వభావజమ్''
(గీత 18-44)

వ్యవసాయం, గోరక్షణ, వర్తకం, వైశ్యునకు స్వభావ జనితములుగు కర్మలు. సేవలు చేయడం శూద్రుల విధిగా, శూద్రుల స్వాభావిక కర్మలుగా చెప్పాడు గీతాకారుడు.

''స్వకర్మ నిరతసిద్ధిం యధావిన్దతి తచ్ఛృణు'' (గీత 18-45)

స్వకర్మయందు ఆశక్తి గల వాడు జ్ఞానయోగ్యతను పొందగలుగుతాడు. శూద్రుడు సేవ (బానిసవృత్తి) చేస్తూ ఉంటేనే జ్ఞానయోగ్యత కలుగుతుందట. ఎవరికి నిర్దేశించిన విధులువారే నిర్వహించాలి అంటూ శూద్రులను సేవా వృత్తికే పరిమితం చేశారు. ఈ విషయాన్నే మనువు గూడ ''ఏతేషామేవ వర్ణానాం - శుశ్రూషాస్యన సూయయాం'' అంటూ ఎలాంటి అసూయద్వేషాల్లేకుండా మిగిలిన మూడు వర్ణాలకు సేవలు చేయడమే శూద్రుల కర్తవ్యం అంటాడు. స్వధర్మ పాలనలో మరణించినా గౌరవమే అంటూ, శూద్రులు స్వధర్మాన్నే పాలించాలి అన్నారు. పరధర్మ స్వీకరణ పాపం అని ధర్మబోధ చేసారు.

ఈ విధంగా బ్రాహ్మణులకు నిర్దేశించిన ధర్మాల్లోకి శూద్రులు ప్రవేశించ కుండా, నిరోధించాడు గీతాకారుడు. కృష్ణుడు నాలుగు వర్ణాలనూ, గుణకర్మల దృష్ట్యా కదా విభజన చేశాడు. అలా అనుకున్నా సరే, అది గూడ ఒక వర్గ విభజనే కదా! దీనిలో కర్మ శబ్దాన్ని తీసి వేయలేం. గుణ కర్మలే నిజమయితే, అసలు జన్మతః వర్ణ ఎందుకు ఏర్పడాలి? దాస స్వభావం, దాస్యపు అలవాట్లు ఉన్నటువంటి వాళ్ళను శూద్రులుగా పరిగణించ మంటుంది గీత. అంతేగాదు, శూద్రులకు అలాంటి దాసలక్షణాలు ముందునుండే ఉన్నట్టుగా చెబుతుంది. కాబట్టి దాసుడు కాకముందే అతడు శూద్రుడయ్యాడు. అంటే శూద్రులు జన్మతః శూద్రులయ్యారు. అంతేగాని, వారిలో అంతర్గతంగా ఏర్పడిన దాస లక్షణాల వల్ల కాదని తెలుస్తుంది. ఎటు తిప్పి చూసినా, శూద్రుల మీద రుద్దిన దాస్య భావనలు మాత్రం స్థిర పర్చటం కనిపిస్తుంది. అందుకు తగ్గట్టుగానే 'శూద్రులకు పనిపాటా' బ్రాహ్మలకు 'చదువూ సంధ్యా' అనే నానుడి పుట్టు కొచ్చింది. గీత ద్వారా, అగ్రవర్ణాలకు జ్ఞాన మార్గం శూద్రవర్గాలకు, దాస్య విధులు స్థిరపర్చడం జరిగింది. గీత రచన, అందుకే జరిగిందన్న విషయం ఇది చెప్పకనే చెబుతూంది. మౌర్య సామ్రాజ్య పతనానంతరకాలంలో గుప్త రాజుల కాలంలో అంటే బ్రాహ్మణులకు ఆదరణలభించిన కాలంలో గీత రూపు దిద్దు కున్నది, అన్న చరిత్రకారుల అభిప్రాయం లో ఎంతో చారిత్రక వాస్తవం ఉంది.

ఎనిమిదో శతాబ్దంలో శంకరాచార్యుడు ప్రప్రధమంగా గీతకు భాష్యం రాసేంతవరకూ గీతను అంతగా ఎవరూ పట్టించుకోలేదు. అసలు బౌద్ధాన్ని నాశనం చేయడానికే గీతకు భాష్యం రాసి, ఒక ప్రత్యేకతను పవిత్రతనూ సంతరించి పెట్టాడు శంకరుడు. అంతవరకూ, గీతకు ప్రాచుర్యం కలుగలేదు. ఆ తర్వాత రామనుజాచార్యుడు మధ్వాచార్యుడు వల్లభాచార్యుడు వారివారి ప్రత్యేక తత్వ ప్రచారాలకు గీతనే ఆధారంగా వాడుకున్నారు. ఈ నలుగూరూ దక్షిణాదికి చెందిన వారే అయినా గీతను ఆధారంగా చేసుకొని వేర్వేరు

పీఠాలను ఏర్పరుచుకున్నారు. శంకరుడు అద్వైతం, రామానుజుడు విశిష్టాద్వైతం వల్లభుడూ, మధ్వుడూ ద్వైతం, శుద్ధ అద్వైత తత్వాలనూ ప్రచారం చేసారు.

ఆధునిక యుగంలో లోకమాన్య బాలగంగాధర లిలక్ అరబిందఘోష్, బంకించంద్ర చటర్జీ, సర్వేపల్లి రాధాకృష్ణన్ పండితుడు, మహాత్మాగాంధీ మొదలైన ప్రముఖులూ ఎందరో గీత మీద భాష్యాలు రాసారు. గీతాతత్వం మీద వీరందరూ ఎవరికి తోచిన విధంగా వారు అర్థం చేసుకున్న (అనుకూలమైన) రీతిలో భాష్యాలు రాసారు. శంకరాచార్యుడు శైవమలానకీ, రామానుజా చార్యుడు వైష్ణవ మతానికీ గురువులు. హైందవంలోనే భిన్న పీఠాలు స్థాపించి ప్రచారం చేసిన ఈ ఆది గురువులిద్దరికీ మూలం భగవద్గీతే. కళాప్రపూర్ణ భోయి భీమన్న తన ''ఇదిగో, ఇదీ, భగవద్గీత''కు ఉపోద్ఘాతం రాస్తూయిలా అన్నారు ''అహం బ్రహ్మాస్మి'' అంటూ అద్వైతమతాన్ని నెలకొల్పిన బ్రహ్మజ్ఞాని శంకరాచార్యుడు కూడ భగవద్గీతకు తన భాష్యంలో కులాతీతను ప్రతిపాదించలేక పోయాడు. ఇదే విధంగా ప్రతి మతాచార్యుడు గీతను తనమత ప్రచారానికి వాడుకున్నాడే తప్ప, ఏదో ఒక మతానికి పరిమితం చేసాడే తప్ప సర్వ జనామోదకరంగా వ్యాఖ్యానించలేక పోయాడు'' యింకా యిలా అన్నారు. రచన చేయడం చేతనయిన ప్రతి ఒక్కరూ రామాణాన్ని వలెనే భగవద్గీతను కూడ ఇష్టానుసారంగా వ్రాసి పారేశారు. రచయితలకు రామాయణం రంభ. భగవద్గీత ఊర్వశి అయి కూర్చుకున్నాయి. ఈ విధంగా భీమన్నగారు తనదైనశైలిలో భగవద్గీతను గూర్చి వాఖ్యానించారు. హిందువుల్ని రాజకీయంగా మేలుకొలిపి స్వాతంత్ర్య సముపార్జనకు సమాయత్తంచేసిన తిలక్ గూడ గీతనే ఆధారంగా తీసుకున్నాడు. తాను రాసిన ''గీతా రహస్యాలు'' అనే గ్రంధంలో జ్ఞానం కర్మ అనే మాటలకు విస్తృత అర్థాలు కల్పించి సామాన్యులను గూడ ఆకర్షించాడు తిలక్. విద్యుక్త ధర్మ నిర్వహణలో హింస చేసినా తప్పులే దన్నది తిలక్ అభిప్రాయం. ఎలాంటి సందర్భంలో నయినా సరే, హింస కూడదనీ, అహింసా మార్గమే ఆచరణీయమనీ గాంధీజీ వ్యాఖ్య. ఈ విధంగా అహింసావాది అయిన గాంధీకి, హింసావాది అయిన గాడ్సేకి గూడ భగవద్గీతే ఆధార గ్రంథమయింది. న్యాయంగా ఆలోచిస్తే, గీతలోని విషయాలు, తాత్విక భావాలు అందరికీ ఒకే విధంగా అర్థంకావాలి. అందరి భాష్యాలు మూలాన్ని అనుసరించి ఒకేలా ఉండాలి. కాని గీతలోని తాత్వికతను పలువురు పలురకాలుగా అర్థం చేసుకొని భిన్న రీతిలో వాఖ్యానించడం జరిగిందంటే అసలు మూల భావంలోనే నిర్దిష్టతలోపించిందని తెలుస్తుంది. గీతలో హేతు బద్ధమయిన నిర్దిష్టమయిన భావాలు లేకపోవడం వల్లనే పలువురు పలురకాలుగా అర్థం చేసుకోవడం జరిగింది. భిన్న భావాలు ప్రకటించడం గూడ జరిగింది. అందుచేత గీతలోని తాత్వికత ఏమేరకు హేతు బద్ధంగా ఉందనేది పశ్నార్థకమే అవుతుంది.

కేవలం భక్తి శ్రద్ధలతో మాత్రమే ఈ భాష్యాలు రాయడం వలన హేతు రహితంగానే గీతా ప్రచారం జరుగుతూ వచ్చింది. జరుగుతూ వుంది కూడా! హేతు దృక్పథంతో చూస్తే సమాధానం చెప్పలేని ఎన్నో ప్రశ్నలు ఎదురవుతాయన్న కారణం గానే, గీత అధ్యయనానికి భక్తి, విశ్వాసాలు మాత్రమే ప్రధానమన్నారు. విష్ణువు యొక్క ఎనిమిదో అవతారంగా కృష్ణుణ్ని సృష్టించి అతడిపేరు మీదుగానే యీ గీతను సృష్టించి, దానికి దైవత్వం కల్పించడం జరిగింది. గీతను ఉపదేశించినవాడు మానవ మాత్రుడంటే విలువలు వేరుగా ఉంటాయి. సకల చరాచర ప్రపంచాన్ని ఏలే, పరమాత్ముడే గీతోపదేశం చేసాడంటే దానికి తిరుగుండదు. దైవలీలల్ని ప్రశ్నించే దమ్ములుంటాయా ప్రజలకు!

యుద్ధభూమిలో కృష్ణుడు అర్జునునికి ఒంటరిగా బోధించిన పద్దెనిమిది అధ్యాయాలు గల సుదీర్ఘమైన గీతాశ్లోకాలు సొంతం సంజయునికెలా తెలిశాయి? వాళ్ళ సంభాషణ జరుగుతున్నంత సేపు యిరుపక్షాల సైన్యాలూ గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నాయా? ఇలాంటి సందేహాలు గీతను తీయగానే మనకు అనేకం కలుగుతాయి.

మహాభారతంలో కృష్ణ పాత్ర చిత్రణ - గీతలో చిత్రించిన కృష్ణ పాత్ర వేరు వేరుగా ఉన్నాయి. గీతలో కృష్ణుణ్ని అసాధారణ మానవాతీతునిగా, అవతార పురుషునిగా, బహ్మస్వరూపునిగా పావనుడుగా, పరంధామునిగా, విశ్వానికి ప్రతి రూపంగా చిత్రించారు. భారతంలో కృష్ణుణ్ని సామాన్యుడిగా ఎత్తుకుపై ఎత్తులు వేసే ఒక సలహా దారునిగా చిత్రించారు. యుద్ధభూమిలో కృష్ణార్జున సంవాదంలో యుద్ధం చేయాలా అక్కరలేదా అన్నదే ప్రశ్న. అర్జునుణ్ని యుద్ధానికి సన్నదుణ్ని చేయడమే గాకుండా, అదే సమయంలో ఎన్నో ధార్మిక సంగతులు, మత పరమైన సిద్ధాంతాలు గూడ బోధించాడు కృష్ణుడు. నిజానికి, ఆ విషయాలన్నీ అప్పుడు అప్రస్తుతం. యావత్ ప్రజానీకానికి అవసరమైన నైతిక బోధ చేయడానికి మత పరమైన సిద్ధాంతాలు వివరించడానికీ ధార్మిక విషయాలు బోధించడానికి యుద్ధ భూమినే వేదికగా, ఉపయోగించుకోవాలనేది కృష్ణుడి అభిమతం కాదనేది తెలుస్తుంది. ఈ సిద్ధాంత చర్చ, మత ప్రాచుర్యం కోసం తరువాత కాలంలో మూలగ్రంథానికి చేర్చబడినట్టి దని చరిత్రకారుల అభిప్రాయం. అందుచేత మూల భారతాన్ని (జయం) రాసిన వ్యాసుడూ, భగవద్గీతరాసిన వ్యాసుడూ ఒకడే అనుకున్నా లెక్కకు మిక్కిలిగా చేరిన అనేకానేక విషయాలవల్ల వ్యాసుని పేరుతో భగవద్గీతకు భిన్న భిన్న కాలాలలో భిన్న వ్యక్తులచేత, ఫోర్జరీలు జరుపబడ్డాయని నిర్ద్వందంగా చెప్పవచ్చు. ఈ విషయాన్నే అంబేడ్కర్ తన వ్యాసంలో ప్రతిభావంతంగా నిరూపించారు.

అసలు భారతమూ, గీతా, ఏక కాలంలో రాసినవి కూడా కాదు. మహాభారత ఇతిహాసంలో భీష్మపర్వంలోని భాగంగా భగవద్గీత రూపొందింది. గీత భారతంలో

అంతర్భాగం అని చెప్పినాసరే భిన్న సంపాదకులవల్ల గీత అనేక కూర్పులకులోనై మార్పులను సంతరించుకున్న దన్నది చారిత్రకసత్యం. మూలంలోలేని 146 శ్లోకాలు కొత్తగా చేరినవనీ అంటే సుమారు అయిదోవంతు గీతాభాగం, అనంతరకాలంలో మార్చి చేర్చి నట్టివని ప్రొఫెసర్ గార్బ్ అభిప్రాయం. అసలు భారతమే మూడు దపాలుగా మూడు కాలాల్లో రచింపబడ్డ గ్రంథమన్నారు. జయ, భారతం, మహాభారతంగానూ రూపొందాయి. మహాభారతన్నే ఇతిహాసమన్నారు. ఈ నేపధ్యంలో భారతంలో అంతర్భాగమైన గీతను, ప్రత్యేకంగా ప్రామాణిక గ్రంథంగా పవిత్ర గ్రంధంగా ఎలామార్చారు? ఏ సామాజిక ప్రయోజనాన్ని ఆశించి గీతను రచించడం జరిగింది? ఇవి జిజ్ఞాసువుల మెదళ్ళను తొలుస్తున్న ప్రశ్నలు.

## మహాభారత యుద్ధం అసలు జరిగిందా?

కురుపాండవుల యుద్ధ ప్రారంభంలోనే అర్జునుడికి గీతోపదేశం చేయడం జరిగింది. గీతోపదేశం మాట అటుంచి, అసలు యుద్ధం అంటూ ఒకటి జరిగిందా? జరిగితే ఏ స్థాయిలో జరిగింది? అనే మూలప్రశ్నలకు సమాధానాలు తెల్సుకోవాలిసిన అవుసరం ఉంది. 'మహాభారత' శబ్దం సుప్రసిద్ధ సంస్కృత వ్యాకర్త పాణిని రాసిన అష్టాధ్యాయిలో ప్రయోగింపబడింది. భరతులకు సంబంధించి ఎలాంటి గొప్ప విషయమైనా, ఈ మహా భారతశబ్దానికి అన్వయిస్తుంది. దానికి సంబంధించిన, ఒక వీరుడు ఒక నగరం లేక వీటితో పాటు ఒక యుద్ధం - ఒక కావ్యం ఏదయినా కావచ్చు. ఈ అర్థంలో మహాభారతం భరతులకు సంబంధించిన 'మహాకావ్యం' అనటంలో సందేహం లేదు. గ్రీకుల మహాకావ్యాలయిన 'ఇలియడ్' ఒడెస్సీలు అతి పెద్ద గ్రంథాలని చెబుతారు. ఈ రెండింటినీ కలిపినా, వాటికంటె గూడ భారతం ఎనిమిది రెట్లు పెద్దది. కాబట్టి 'మహాభారతం' కావ్యపరంగా గొప్పదే. అందులో సందేహంలేదు. అయితే చారిత్రక దృష్టితో చూస్తే యీ కురుక్షేత్ర యుద్ధం భరతవంశంలో పుట్టిన కౌరవ పాండవుల మధ్య జరిగిన మహాఘోరమైన సంగ్రామం అనడంలోనే పేచీవస్తుంది. అలాంటి ఘోరమైన భారీ సంగ్రామం అసలు జరగనే లేదు అంటే కొందరు సాంప్రదాయపండితులకు కోపం రావచ్చు ఎందుకంటే వారు భక్తి విశ్వాసాలచీకటిలోంచి చారిత్రక వెలుతురులోకి రావడం ఇష్టపడరుగనుక. అయినాసరే కొన్ని చారిత్రక అంశాలను పరిశీలించి పరిగణనలోకి తీసుకుంటే చారిత్రక వాస్తవాలు తెలియకపోవు.

1 వేదావాఙ్మయం ద్వారా మనకి 'కురు' అనే తెగతెలుస్తుందే తప్ప పాండవుల ప్రస్తావన కనిపించదు. భారతం మీద మంచి పరిశోధన చేసిన హాప్కిన్స్ కూడ కనీసం వీళ్ళు (పాండవులు) బ్రాహ్మణుల్లోకాని శూద్రుల్లోకాని కన్పించడం

లేదన్నాడు. ఈ విషయం మీద, మరింత దృష్టి సారించిన మాక్స్‌ముల్లర్ ఇలా అన్నాడు ''వైదికవాఙ్మయానికి కురు భరతులు తెలుసు. కాని పాండవులు తెలియదు. అంతే కాదు పాణిని అష్టాధ్యాయాల్లో కూడ పాండు రాజుకాని పాండవులు కాని ప్రస్తావించబడలేదు. కాని కురుభరతులు మాత్రం తద్ధిత ప్రకరణం (అష్టాద్యాయాల్లో ఒక ప్రకరణం) లో అనేక పర్యాయాలు ప్రస్తావించ బడ్డారు''. కాబట్టి పాణిని కాలానికి అంటే క్రీస్తు పూర్వం అయిదవ శతాబ్దానికి పాండవులను గురించి తెలియదన్న విషయం స్పష్టమవుతుంది.

2. వేదాల్లో ఈ ప్రస్తావన లేదుకనుక, మహాభారత కథకు మూలమైన కురుపాండవుల మధ్య జరిగిన యుద్ధం గురించి వేదరచయితలకు తెలియదనే అనుకోవాలి.

3. వైదిక వాఙ్మయంలో ''కురుక్షేత్రం'' అనే పదం వాడబడింది. కాని, అది ఒక పవిత్ర ప్రదేశంగా పేర్కొనబడిందే తప్ప గొప్ప యుద్ధభూమిగా పేర్కొనబడలేదు.

4. వ్యాస, వైశం పాయనులు తైత్తరీయ ఉపనిషత్తు, ఆరణ్యకాల్లో పేర్కొనబడ్డారు. కాని ఆయా సందర్భాలు వేటిల్లోనూ వీరు భారతానికి తొలికర్తలుగా పేర్కొన బడలేదు.

5. ''కథక సంహితలో'' కురురాజైన ధృతరాష్ట్రుడి ప్రస్తావన ఉంది. కాని అక్కడ కురుక్షేత్ర యుద్ధ సంబందిత విషయం మాత్రం లేదు. కేవలం ధృతరాష్ట్రుడుకీ అతని పురోహితుడికీ మధ్య జరిగిన కర్మకాండల సంబంధమైన కలహమొకటి మాత్రమే ప్రస్తావించబడింది.

6. అధర్వవేదంలో పరీక్షిత్తురాజు ఒకసామ్రాజ్యాధినేత గా కీర్తించబడ్డాడు. పరీక్షిత్తుడంటే అభిమన్యునికుమారుడు. ఇతని కుమారుడు జనమేజయుడు శతపథ బ్రాహ్మణంలో జనమే జయుడు ఆలోకితులకు అనేకానేక విధాలయిన దానాలు చేసినట్లు వర్ణించబడింది. అంతేకాని ఈ రెండు సందార్భాల్లో కూడా వీరు అర్జునుని వారసులుగా పేర్కొనబడలేదు. మహాభారతంలో అర్జునుడు ఇంద్రునికొడుకు అని చెప్పబడింది. కాని శతపథ బ్రాహ్మణంలో అతడే స్వయంగా ఇంద్రుడుగా కీర్తించబడ్డాడు.

7. ఎంతో భారీ ఎత్తున జరిగిందన్న భారత యుద్ధం యొక్క వర్ణనలో అతి శయోక్తులకు లోటు లేదనిపిస్తుంది. యుద్ధంలో 18 అక్షౌహిణుల సంఖ్యగల భటులు పాల్గొన్నట్టు వర్ణించబడింది. ఒక అక్షౌహిణి అంటే 21,870 రథాలు, 21,870 ఏనుగులు, 65610 గుర్రాలు, 109350 కాల్బలం. దీనికి పద్దెనిమి

రెట్లయితే భారతసైన్యం అవుతుంది ఈ రోజుల్లో గూడ అంటే సుమారు రెండు వేల సంవత్సరాల తర్వాత అగ్రరాజ్యాలకు యింతటి సైనికబలం ఉన్నట్లులేదు మరి ఆకాలంలో ఇంత భారీ ఎత్తున సైన్యాలు గుఱ్ఱాలు ఏనుగులు పాల్గొన్నట్టు రాయడంలోని వాస్తవికతను గుర్తించాలి. అసలు ఆనాటి భారతదేశజనాభాను కూడ దృష్టిలో ఉంచుకొని చూస్తే భారత యుద్ధ సైన్యం యొక్క సైజులో ఉన్న వాస్తవికత ఎంతో తెలుస్తుంది కురుక్షేత్రంలో పాల్గొన్న గుఱ్ఱాల సంఖ్య 11 80 980 (65610 x 18) ఆ కాలంలో ఒక దేశంలో యుద్ధ భూమిలో ఒకేసారి అన్ని గుఱ్ఱాలు పాల్గొనడం అసంభవం అని తెలుస్తుంది

8. భారత యుద్ధంలో వాడబడిన పరికరాలు ఇనుముతో చేసినటువంటివి ఇనుము వాడుక మనదేశంలో క్రీ పూ ఆరవ శతాబ్దం తర్వాత కాని ప్రారంభంకాలేదు భారతదేశ ప్రాచీన నాగరికత అయిన సింధు నాగరికత కాలంలో వాడబడ్డ ఆయుధ పరికరాలు కేవలం రాతితోను బాణాలమొనలు కంచు రాగిలోహాలతో చేసినటు వంటివి మరి భారత యుద్ధంలో వర్ణింపబడ్డ అత్యంత ఆధునిక సాంకేతిక యుద్ధ పరికరాలు ఏకాలం నాటివై యుండాలి? యుద్ధభాగరచన ఇనుము బాగా వాడకంలోకి వచ్చిన ఆతర్వాతనే అయివుండాలి అని స్పష్టమవుతుంది

9. మగధ ఆర్యేతర ప్రాంతం వింధ్యకు దక్షిణ ప్రాంతం మగద ప్రాంతీయులు భారత యుద్ధంలో పాల్గొన్నట్టుగా వుంది అయితే అది అ సంభవం ఎందుచేతనంటే, అత్యంత ప్రాచీన కాలంలో రవాణా సాధనాలు సౌఖర్యాలు పరిమితం అందువల్ల అంతభారీ ఎత్తున సైన్యాలు అనేక ప్రాంతాల నుండి కురుక్షేత్ర యుద్ధ భూమికి తరిలి రావడం అసాధ్యం. ఒకవేళ అంత మంది తరలి వచ్చినా భోజనాది వసతులకు అవసరమైన తిండి దినుసుల్ని అక్కడకు చేర్చడం గూడ అసంభవమే అందుచేత ఇంతసైన్యం అంతసైన్యం అని అతిశయోక్తిగా చెప్పినా అది కట్టు కథే అవుతుంది.

10 భారత యుద్ధంలో యవనులు శకులు పహ్లావులు కౌరవుల పక్షాన నిలిచి పోరాడినట్టుగా ఉంది వీరెవ్వరూ, క్రీ పూ 5వ శతాబ్దానికి పూర్వం భారత దేశ చరిత్రలో ప్రముఖ పాత్ర వహించిన ఆధారాలు లేవు

11 ప్రాగ్జ్యోతిష (నేటి అస్సాం) నగరాధిపతి భగవదత్తుడు కురుక్షేత్ర యుద్ధంలో ఎంతో ముఖ్యపాత్ర వహించినట్టు చెప్పారు అది సత్యదూరం ఎందుకంటే అతడి ప్రస్తావన అటు తొలి వేదాల్లో కాని ఇటు మలివేదాల్లో గాని ఎక్కడాలేదు అతడి గురించి క్రీ పూ 5 వనాటి పాణిని గూడ ఎక్కడా ప్రస్తావించలేదు

12 భారత యుద్ధంలో పాల్గొన్నది 18 అక్షౌహిణుల సైన్యం యుద్ధం ముగిసేనాటికి పాండవుల పక్షాన మిగిలిది ఆరుగురు అంటే పద్దెనిమిదిలో మూడవ భాగం. కౌరవుల పక్షాన మిగిలింది ముగ్గురు అంటే పద్దెనిమిదిలో ఆరవభాగం. మహాభారతంలో పర్వాల సంఖ్య గూడ పద్దెనిమిది. గీతలోని అధ్యాయాల సంఖ్య పద్దెనిమిది యుద్ధం జరిగిన కాలం గూడ పద్దెనిమిది రోజులే కురుక్షేత్ర యుద్ధం జరిగిన తర్వాత కృష్ణుడు జీవించిన కాలం 36 సంవత్సరాలు రెండుపద్దెనిమిదులు. ఎందుకో పద్దెనిమిదో సంఖ్యకు ఒక ప్రత్యేకత కల్పించారు ఈ సంఖ్యలను గమనిస్తే ఇవన్నీ ఒక లక్ష్యంతో కల్పించబడినట్లు తెలుస్తుంది సంఖ్యాశాస్త్రంలో నమ్మకమున్న వారెవరో కల్పించిన సంఖ్యలివి

పై సంఘటనల వలన, యుద్ధం జరిగిందనడంలోని వాస్తవికత గురించి, సామాన్యుల్లో సైతం ఎన్నో సందేహాలు కలుగుతాయి. బహుశా ఈ కారణం చేతనేనేమో భారతం బొంకు' అనే నానుడి, ప్రజల నాల్కల మీద నిలిచింది భారతం రామాయణం, మహాకావ్యాలే కావచ్చు గాని చరిత్రక వాస్తవాలు మాత్రం కావు అనేది రూఢి అవుతుంది. మక్స్‌ముల్లర్ హాప్కిన్స్ ఆర్ సి దత్ నార్ల వెంకటేశ్వర రావు మొదలైన ప్రముఖ పరిశోధకులెందరో భారత యుద్ధ యదార్థతను ప్రశ్నించడం జరిగింది వారు లేవనెత్తిన ప్రశ్నలకు హేతుదృక్పథంతో ఇంతవరకు ఎవరూ సమాధానాలు ఇవ్వలేదు. అందుచేత మహాభారత యుద్ధ యధార్థతే ఒక సందేహకంగా నిలుస్తోన్నపుడు దానిలో అంతర్భాగమైన గీతయొక్క వాస్తవికత మాత్రం ప్రశ్నార్థకం కాకపోతుందా? ఇదంతా చారిత్రకంగా అవాస్తం అని చెప్పడానికి యింత కంటె దృష్టాంతాలు ఎమికావాలి? భారతయుద్ధం జరిగిన తీరు మహావీరుల భీకర పోరాటాలు హరికధకులు ఉత్ప్రేక్షించి పాడుతుంటే భక్తిభావంతో తన్మయంగా వినడం పరిపాటి అవి విన్నంతసేపూ ప్రశ్నార్థ కాలుగానీ హేతువాద దృష్టిగానీ ఉండదు. ఉండేవల్లా భక్తీ, విశ్వాసాలు మాత్రమే. యుద్ధ యదార్థత గురించి సరేసరి యుద్ధభూమిలో గీతను ఉపదేశించిన కృష్ణుడి పాత్రమీద గూడ కొల్లలుగా సందేహాలు కలుగుతాయి.

## కృష్ణులెందరు? అందులో గీతాకృష్ణుడు ఎవరు?

అసలు కృష్ణుడెవరు? ఇది మౌలిక ప్రశ్న. భారతం అంతావిన్నాక లేకచదివింతర్వాత, కృష్ణుడెవ్వరన్న ప్రశ్న హాస్యాస్పదంగా ఉండొచ్చు రామాయణంలో గూడ సీత రాముడు కేమవుతుంది? అన్న ప్రశ్నతలెత్తక పోలేదు దానిమీద ఒక పుస్తకాన్నే రాసారు ఆంధ్రసార స్వత పరిశోధకుడైన ఆరుద్ర అలాగే కృష్ణులెందరు? అందులో గీతా కృష్ణుడెవరు? అన్న ప్రశ్న మీద గూడ పలువురు పండితులు పలురకాలుగా సమాధానాలు చెప్పారు

హిందూ మతాన్ని కర్మకాండల్ని భారతీయ సంస్కృతిలో సమస్త జీవితాన్ని ఆలోచనల్నీ ప్రభావితం చేసిన కృష్ణుడు గురించి ఆపాత్ర చిత్రణ గూర్చి తెల్సుకోవాల్సిన అవసరం ఉంది కృష్ణుడితో సమానంగా రాముణ్ని నిలబెట్టినా కృష్ణుడి ముందు ప్రచారంలోగాని ప్రాశస్త్యంలోగాని రాముడు నిలవడు అందుచేత కృష్ణుడుకీ కృష్ణతత్వానికీ అధిక ప్రాధాన్యత లభించింది ఈ ప్రాధాన్యత ఈ దేశానికే కాదు ఇతర దేశాల్లోకి సైతం చొచ్చుకు పోయింది భారతీయులే కాదు క్రీ పూ రెండవ శతాబ్దంలో భారత దేశంలో ప్రవేశించిన బాక్ట్రియన్ గ్రీకులు సైతం కృష్ణుణ్ణి వాసుదేవుడి పేరుతో ఆరాధించారు క్రైస్తవ ప్రపంచంలోకి గూడ ఈ నాడు కృష్ణుడిపేరు చొచ్చుకు పోయింది వ్యాపారపరిభాషలో చెప్పాలంటె కృష్ణతత్వం ఈనాడు భారత దేశ ఎగుమతుల్లో ప్రధానమైన ఎగుమతి మాదక ద్రవ్య సంస్కృతీ ప్రపంచానికి కృష్ణ చైతన్యం చక్కని విముక్తిగా పనిచేస్తున్న దక్కడ ఎంతో మంది యువజంటలు విదేశాలనుండి వచ్చి హరేరామ హరేకృష్ణ భజనల పేరుతో మత్తుపదార్థాలను సేవించడం మనం చూస్తూనే వున్నాం డెట్రాయిట్ లోని ఫోర్డు కుటుంబానికి చెందిన వారసుడొకడు తన కోట్లాది రూపాయల్ని కృష్ణచైతన్య ప్రచారానికి విరాళంగా యిచ్చాడట మరి ఇంతగా ఆదరణ పొందుతున్న కృష్ణుణ్ని సామాన్య దేవుడు అని అనలేంగదా దేవుళ్ళకే దేవుడుగా కొలుస్తూ దేవాది దేవుడన్నారు అలాంటి కృష్ణుడు గురించి కృష్ణుణ్ని సృష్టించిన గాధల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది

## ఎందరో కృష్ణులు!

కృష్ణుడొక్కడే గదా! ఎందరో కృష్ణులు అనడమేంటి అనే సందేహం కలుగకమానదు ముప్పయిమూడు కోట్ల దేవతల్ని సృష్టించిన వారు కృష్ణుల్ని మాత్రం కొందర్ని సృష్టించలేరా మనకు లభిస్తున్న వాఙ్మయ ఆధారాల వల్ల ఎంతో మంది కృష్ణులు కనిపిస్తున్నారు వీళ్ళలో అసలు సిసలైన కృష్ణుడెవరు? నకిలీ కృష్ణుడెవరు? ఈ విషయం నిర్ణయించేముందు మనకు అందుబాటులో ఉన్న ఆధారాలను వెలికి తీద్దాం

1 వేదాల్లో ఇద్దరు కృష్ణులున్నారు మొదటి కృష్ణుడు ఒక ఆర్యఋషి రెండో కృష్ణుడు ఆర్యేతరయోధుడు. ఋగ్వేద కృష్ణునకు విశ్వక అనే కుమారుడు విష్ణుపు అనే మనుమడు ఉన్నారు విష్ణుపుని కొంత కాలం అతనికుటుంబం కోల్పోతుంది అశ్వినీ దేవతలు ఆకుటుంబానికి విష్ణుపుని తిరిగి అందిస్తారు అశ్వినీ దేవతలు చేసిన సహాయాన్ని గుర్తించి వారిని స్తుతిస్తాడు కృష్ణుడు అయితే తర్వాత పురాణకర్తలు ఈ కథను మార్చి చెప్పారు అశ్వినీ దేవతలు నిర్వహించిన పాత్రను కృష్ణుడే నిర్వహించి నట్టు చెప్పారు. ఆ విధంగా కృష్ణుడి ప్రజ్ఞా విశేషాలను ప్రచారం చేసారు కృష్ణుణ్ని అసాధారణ వ్యక్తిగా చిత్రించారు

పురాణాల ప్రకారం కృష్ణుడు సముద్రంలోని ఉరికి అట్టడుగున ఒక రాక్షసుని చేత బందీగా ఉన్న తనగురువు సాందీపని యొక్క కుమారుణ్ని రక్షించి తీసుకొచ్చినట్లు చెప్పారు ఇందులో కృష్ణుని గురుభక్తీ పరాక్రమం అద్భుతంగా వర్ణించ బడ్డాయి ఇక వేదాల్లో చెప్పిన రెండవ కృష్ణుణ్ని యోధుడన్నారు ఇతని అధీనంలో పదివేల మంది సైన్యం ఉంది. ఆర్యుల సర్వోన్నత దేవుడైన ఇంద్రునికీ ఈ కృష్ణుడికీ, అంశుమతి నదీ తీరంలో గొప్ప యుద్ధం జరిగింది ఇంద్రుని చేతిలో కృష్ణుడు అతని సైన్యాలు చావు దెబ్బతిన్నాయి అయినా ఈ వృత్తాంతాన్ని తారుమారు చేసి చెప్పారు విష్ణు పురాణంలో ఓడిన కృష్ణుణ్ని విజేత గానూ గెలిచిన ఇంద్రుణ్ని ఓడినట్టు గానూ చిత్రించారు అయినాసరే బృందావనానికి చెందిన గోపకులు ఇంద్రుణ్ణే పూజించేవారు ఆ పూజల్ని కృష్ణుడు మానిపిస్తాడు తమకు నిజమైన దేవతలు ప్రకృతి, పర్వతాలు అరణ్యాలు, అని వారికి నచ్చచెప్పి నమ్మిస్తాడు దానిని ఇంద్రుడు అవమానంగా భావిస్తాడు తన ఉనికిని తెలియజేయాలనుకుంటాడు తనకు జరిగిన అవమానానికి కోపంతో గోపాలుర పల్లెపై ఎడు రోజులు రాత్రింబవళ్ళు ఎడతెరిపి లేకుండా కుంభవృష్టిని కురిపిస్తాడు అపుడు బాల కృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని పెకిలించి చిటికినవేలితో గొడుగులానిలిచి తన వారినందరినీ రక్షిస్తాడు ఈ విధంగా పురాణకర్తలు అతిశయోక్తులతో కృష్ణుణ్ని అనన్య సామాన్యంగా తీర్చి దిద్దారు బాలుడుగా కృష్ణుడు చేసిన చేష్టలన్నీ అద్భుతాలే ఆ చేష్టలను సమర్థించుకోడానికి ఎన్నో ఐతిహ్యాలు కల్పించారు

2 ఇకమనకి కనిపించే కృష్ణుడు ఉపనిషత్తులలోని కృష్ణుడు. చాందోగ్యోపనిషత్తులో అతడు దేవకీ పుత్రుడుగా కనిపిస్తాడు ఇతణ్ని ఘోర అంగీరసుని శిష్యుడన్నారు కృష్ణుడు ఉపనిషత్తత్వాన్ని ఘోర అంగీరసుని దగ్గరే నేర్చుకున్నట్టు చిత్రించారు కాని పురాణాల ప్రకారం కృష్ణుని గురువు సాందీపని' శంకరాచార్యుడు కృష్ణుడు ఘోర అంగీరసుని శిష్యుడనటానికి కారణం గీతలో కృష్ణుడు చెప్పిన ఉపనిషత్ సారాన్ని సమర్థించు కోడానికే ఉపనిషత్ కృష్ణుడు ఘోర అంగీరసుని శిష్యుడే అయినా యితర ఉపనిషత్ గురువుల దగ్గర కూడ శిష్యరికంచేసాడనీ అన్నారు ఇదంతా గీతలో కృష్ణుడు చెప్పిన తాత్విక విషయాలకు ప్రామాణికతను కల్పించే ప్రయత్నమే లేకుంటే గీత ఉపనిషత్తులకు కేవలం కాపీ అని ఎవరైనా అనవచ్చు అపుడు గీత ప్రాధాన్యత మరుగున పడవచ్చు ఇలాంటిది జరగకుండా జాగ్రత్త పడ్డాడు శంకరుడు వేదాసారం ఉపనిషత్ సారం గీతలో చొప్పించినా సరే గీతకు ఒక ప్రామాణికతను కల్పించి ప్రజల్లో ప్రచారం చేయడమే ధ్యేయం

3 మూడువ కృష్ణుడు మహాభారతంలోను దానికి అనుబంధమైన హరివంశంలోనూ కనిపిస్తాడు కురుపాండవ కుటుంబ కలహాల్లో సంఘర్షణల్లో యుద్ధంలో ఎత్తుకుపై ఎత్తులు వేసే కృష్ణుడూ తాత్వికుడుగా గీతా ప్రవక్తగా యుద్ధభూమిలో కనిపించే కృష్ణుడూ ఒక్కరే అని అనలేం మహాభారతంలో అక్కడక్కడా (అంటే పాండవులతో అతనికున్న సంబంధాలలో మాత్రం) హరివంశంలో అంతటా అవతార మూర్తిగా చిత్రించబడిన కృష్ణుడు గూడ ఒకటిగా కనబడరు మహాభారతం హరివంశం రచింపబడ్డకాలాల మద్య ఉన్న వ్యత్యాసంలో కృష్ణపాత్ర ఎన్నో రకాలుగా మార్పులకు గురైంది త్రిమూర్తుల్లో ఒకరైన విష్ణువుకు ప్రాధాన్యత పెరిగింది వైదిక దేవతలు క్రమంగా మరుగునపడిపోయారు విష్ణువునే ప్రధానదైవంగా చిత్రించి అతడినే ఆతర్వాత అవతార మూర్తి కృష్ణుడన్నారు ఈ విధంగా మహాభారత కాలంలో గూడ కృష్ణ పాత్రను అనేక మార్పులకు గురిచేస్తూ చివరకు అతణ్ని అవతారమూర్తిగా చిత్రించి ముగించారు. అవతారపురుషుడుగా కృష్ణుడు చెప్పిన విషయాలు అందరికీశిరోధార్యాలు అని చెప్పడమే గీతాకారుని లక్ష్యం మిగతా కృష్ణుల మాట ఎలా ఉన్నా మహాభారత కృష్ణుణ్నే అసలు కృష్ణుడుగా ఆరాధ్యదైవంగా చూపించారు అందుక్కారణం భగవద్గీతకు ప్రామాణికతను కల్పించటమేనని స్పష్టమవుతుంది

4 క్రీ శ 5వ శతాబ్దంలో రాయబడిన విష్ణుపురాణంలో మరోరకం కృష్ణుడు కనిపిస్తాడు అందులో గోపికలతో ప్రణయ క్రీడలు సలిపే కృష్ణుడు ఒక వినూత్న మార్గంలో కనిపిస్తాడు ఈ పురాణంలోనే కృష్ణుడు తన అసలు రూపమైన విష్ణు రూపంలో నర్మదానదీ తీరంలో ఉన్న రాక్షసుల్ని జైనులు గాను బౌద్ధులుగాను మార్చినట్లుగా ఉన్నది ఈ ప్రయోజనం కోసం మహామోహం పేరుతో తన మిద్యా రూపాన్ని కృష్ణుడుపంపించి నట్లు చెప్పబడింది జైనుల మీద బౌద్ధుల మీద ద్వేషంతోనే ఈ సంఘటన రాసినట్లు తెలుస్తుంది ఇలాంటి ద్వేషపూరిత కల్పనలకు పురాణాలు పుట్టినిళ్ళు అంతెందుకు రామాయణం బౌద్ధమతా విర్భావానికి ఎంతో ముందే పుట్టిన గ్రంథం దానిలో రాముడు ఒకచోట బుద్ధుణ్ణి దొంగ అని అంటాడు ఇదెలా సంభవం అంటే అనంత కాలంలో బౌద్ధం మీద ద్వేషంతో ఇలాంటి జుగుప్సా కరమైన కల్పనలను చేసి వుంటారని భావించు కోవలసి వుంటుంది ఈ ద్వేషపూరిత రాతలన్నీ బౌద్ధాన్ని పడగొట్టడానికి ఉద్దేశించి కల్పించినవే

5 భాగవత పురాణంలో మరో కృష్ణుడు కనిపిస్తాడు దానిలో దశావతారాల్లో కృష్ణుణ్ని ఎనిమిదో అవతారంగా పేర్కొన్నారు అలాంటి అవతారపురుషుడే బాల్యంలో

ఎన్నో కుప్పిగంతులువేస్తాడు వయసొచ్చిం తర్వాత పచ్చి శృంగారపురుషుడుగా కనిపిస్తాడు ఆతర్వాత ఒక విలాసపురుషుడుగా జీవితాన్ని తేలిగ్గా తీసుకునే వాడిగా ఉంటాడు కృష్ణ పాత్ర చిత్రణలో యీ వైరుధ్యాలను శృంగార విలాసతత్వాన్ని, లీలామానుషుని లీలలుగా కొనియాడారు. విష్ణుపురాణంలో గోపికలతో సాగించే సరస సల్లాపాలు భాగవత పురాణంలో రాధామాధవుల ప్రణయక్రీడలు బృందావనంలో సలిపిన లైంగిక విన్యాసాలు, పచ్చిగావర్ణించిన తీరుని చూస్తే కృష్ణుణ్ని దేవుడిగా భావించాలా కామసూత్రాలను బోధించే గురువుగా భావించాలా అన్న సందేహం కలుగక మానదు క్రీ శ 9, 10వ శతాబ్దాలలో భాగవత కృష్ణుణ్ని రూపుదిద్దిన తీరుయిది రాధకృష్ణుడికి మేనత్త మేనత్త దగ్గర మేనల్లుడికి చనువు వుండటం మనకి తెలిసిన సంగతే అందుచేత రాధామాధవ ప్రణయం తెలుగువారికి బ్బెట్టు అనిపించలేదు ఆవిధంగా రాధాకృష్ణుల మద్యనడచిన అక్రమ సంబంధాన్ని సమర్ధించడానికి తాత్వికులు దీనికి మధురభక్తి అని పేరు పెట్టారు. పరమాత్మను చేరుకోడానికి ఆత్మలు పడే ఆవేదన అన్నారు భక్తి ముక్తి అని పేరు పెట్టినా, అందులో గల భక్తి ఎదో రక్తి ఏదో జయదేవుని గీత గోవిందంలో వర్ణించిన రసవత్తర కామక్రీడలు చదివిన వారికి తెలుస్తుంది

6 ఇందరి కృష్ణుల మాట అటుంచి అసలు, కృష్ణుడు అసలు సిసలైన ఆంధ్రుడనీ, తెలుగు మాట్లాడే ప్రజలకు చెందిన వాడేనన్నది మరో వాదం. ఈ విషయం, సోవియట్ యూనియన్ సీనియర్ విదుషీమణి జవహర్ లాల్ నెహ్రూ బహుమతి విజేత అయిన శ్రీమతి ఎన్ ఆర్ గునేవా, తాను జైనమతం మీద రాసిన శాస్త్రీయ పరిశోధనా గ్రంధంలో వెల్లడించారు

7. అవతారమూర్తి అయిన శ్రీకృష్ణుని యాదవ వంశాన్ని సూచిస్తూ ఎన్నో పేర్లు ఉన్నాయి అందులో సాత్వతుడు శౌరి వార్షిణేయుడు దశార్హుడు మాధవుడు అనేవి కొన్ని ఈ పేర్లలో సాత్వతుడు వార్షిణేయుడు అనే మాటలు, కృష్ణుని జాతిని సూచిస్తాయి యదువంశంలో సాత్వక శాఖ ముఖ్యమైనది. కృష్ణుడు అసలు పుట్టుక క్షత్రియ వంశంలో అయినా పెంపకం యదువంశంలో జరిగింది. ఆయాదవ కులంలోంచి పుట్టిన ముసలంతోనే కృష్ణుడు మరణించాడు ఆ ముసలం (ఇనపరోకలి) సాంబుడి కడుపులోంచి పుట్టింది కృష్ణుడికి జాంబవతి వలన కలిగిన సంతానమే సాంబుడు దేవాది దేవుడయిన కృష్ణభగవానుడు జరుడనే ఒక సామాన్య బోయవాని చేతిలో మరణించడం విడ్డూరం. ఆబోయవాని చేతి బాణపు ములుకు సాంబుని కడుపులోంచి పుట్టిన ముసలంలో ఒక భాగంతో

చేయబడ్డది యాదవ కులంలో ముసలం పుట్టడం ఆ ముసలమే చివరకు కృష్ణుని ప్రాణాలు తీయడం ఇదంతా ఒక పెద్ద కథ సాక్షాత్ కృష్ణపరమాత్ముడే ఒక సామాన్యుడి చేతిలో చనిపోవడమేమిటి? అని అనుకో కూడదు ముందే చెప్పుకున్నాం. నమ్మకానికి కావలసింది భక్తి శ్రద్ధలేగాని హేతువుకాదు దుష్టశిక్షణకు శిష్టరక్షణకు భూమి మీద అవతరించిన కృష్ణుడి అవతారం అక్కడితో పరిసమాప్తమయింది అన్నారు భారత యుద్ధంలో దుష్టులను శిక్షించిన వెంటనే యీ అవతారం పరిసమాప్తి అయివుండాలిసింది కాని ముప్పయి ఆరేళ్ళ తర్వాత గాని ఆపరిసమాప్తి సంభవించలేదు కృష్ణుని చరిత్ర యిన్నిరకాలుగా యింత గందర గోళంగా ఉంది అందుచేత ముందు కృష్ణుడు చారిత్రక వ్యక్తి అనడానికి తగినన్ని ఆధారాలులేవు ఈ నేపథ్యంలో కృష్ణుడు ఒక్కడా? పలువురా? భారత కృష్ణుడూ భాగవత కృష్ణుడూ ఒక్కరేనా? వేర్వేరు వ్యక్తులా? వేదకృష్ణుడికీ ఇతిహాస కృష్ణుడికీ సంబంధం ఉన్నదా? ఈవిషయాల మీద ఎందరో భారతీయ పాశ్చాత్య పండితులు కూడ పరిశోధనలు చేసారు

డి డి కోశాంబిం ప్రకారం కృష్ణుడు ఏ ఒక్క చారిత్రక వ్యక్తీ కాడు పలువురు ఇతి హాస నాయకులను మిళితం చేసి ఆలక్షణాలన్నీ ఒకవ్యక్తికి ఆపాదించి చేసిన రూపకల్పన ఫలితమే కృష్ణుడు. ఆతర్వాత కొన్ని వందల సంవత్సరాల్లో కృష్ణ చరిత్ర చేర్పులతో మార్పులతో విస్తరించింది. మనకి కనిపిస్తున్న ఇంతమంది కృష్ణుల్లో నిజమయిన కృష్ణుడు భారత కృష్ణుడే అంటారు అతడే గీతాకృష్ణుడంటారు సాంప్రదాయ వాదులు అయితే అప్పుడు మిగిలిన కృష్ణుల సంగతేమిటి? అన్నది ప్రశ్నగానే మిగిలిపోతుంది భారతకృష్ణుడే నిజమైన కృష్ణుడయితే గీతలో బోధించిన తాత్విక విషయాల నేపథ్యం ఎక్కడి నుండి వచ్చింది? వేదాసారాన్ని ఉపనిషత్ సారాన్ని గీతలో గుప్పించినా వేద కృష్ణుడూ ఉపనిషత్ కృష్ణుడూ అంటూ ప్రత్యేకంగా పేర్కొనలేదు ఎందుకంటే వేదాల్లోనూ ఉపనిషత్ కాలంలోనూ వేర్వేరు కృష్ణులున్నట్టు రాయడం జరిగింది కాబట్టి వీటికి భారతం సమాధానం చెప్పదు ఈ వైరు ధ్యాలను గుర్తించే శంకరాచార్యులు తెలివిగా కృష్ణుడు ఘోర అంగీరసుని శిష్యుడన్నారు

భగవద్గీతలో నిజానికి యిన్నివైరుధ్యాలున్నవి ఎందరో ఎన్నో రకాలభాష్యాలు రాసారు ఎందరో కృష్ణులున్నారనీ, గీత కాలాను గుణంగా ఎన్నో మార్పులకు చేర్పులకు గురి అయిందని రాశారు అయితే యీ విషయాలను గీతాభక్తులు గుర్తించకపోవచ్చు గుర్తించినా వాటిని వారు నమ్మే దశలో ఉండరు అందుచేత గీతమీద వారికి నిరాదరణకాని నిరసనకాని కలుగదు భక్తి శ్రద్ధలున్న చోట జ్ఞానంతోగాని హేతువుతో గాని పనిలేదు

అందుకే అన్నారు గీతాధ్యయనానికి భక్తి శ్రద్ధలు మాత్రమే ప్రధానమని. వేదాలలాగే, గీతకూడ అపౌరుషేయమే ప్రశ్నించ కూడనిదే గీతలోని అశాస్త్రీయభావాలను అసంగతాలను వైరుధ్యాలను కొందరు పండితులు, పరిశోధించి వెలికితీసినా అవి మేధావి వర్గానికి మాత్రమే పరిమితమైపోయాయి అలాంటి పరిశోధనలు ఎన్నయినా గీతయొక్క విశిష్టతను కించపరచనేరవని భక్తులభావం అయితే వాటిని వెల్లడించడం ఇపుడు అవసరమా అనే ప్రశ్నకు, ప్రజల ఆలోచనలను ప్రభావితం చేయడానికి వారి ఆలోచనా పరిధిని విస్తృతం చేయడానికీ అవసరమే అన్నది సమాధానం సత్యాన్ని సత్యంగాను, అసత్యాన్ని అసత్యంగాను గుర్తించడం జిజ్ఞాసుల విజ్ఞుల లక్షణం

ఈ నేపథ్యంలోనే డాక్టర్ అంబేడ్కర్ భగవద్గీతను, పరిశోధించి విశ్లేషించారు. ఆయన పరిశోధనలో చారిత్రక వాస్తవాలూ ఉన్నాయి శాస్త్రీయ దృక్పథమూ ఉంది. సామాజిక సంక్షేమ కాంక్షగూడ ఉంది గీతలో అంతర్గతంగా ఉన్న వర్గ, వర్ణ దృక్పథాన్ని వెలికి తీసి చూపించడం జరిగింది. వైదికులు చెప్పిందే వేదం. పురోహితులు పలికిందే పురాణం భగవానుడు గీసిందే గీత అని, మేధస్సుకు సంకెళ్ళు వేసే కాలం పోయింది. మతం పేరుతో జరిపిన మారణ హోమాల గత చరిత్రను త్రవ్వి నిజాల నిగ్గు తేల్చేకాలం వచ్చింది గీతపేరుతో శూద్రుల తలరాతలను మార్చిన, వైనాన్ని పరిశీలించే కాలం వచ్చింది. భగవద్గీత ఆధునిక సామాజిక తత్వానికీ, మనుషుల మధ్య వైరుద్యాలను, అంతస్థులనూ పరిష్కరించడానికి ఎంత వరకూ ఉపకరిస్తుంది అని పరిశీలించే కాలం వచ్చింది

ఆనాటి బ్రాహ్మణీయ వ్యవస్థలో భగవానుడి పేరుతో, గీతా కారులు, శూద్రులనూ స్త్రీలనూ పాపులుగా బానిసలుగా చిత్రించిన వైనం ఈక్రింది శ్లోకంలో చూడ గలం

''మాం హి పార్థ వ్యపాశ్రిత్యయేపిస్యుః పాపయోనయః
స్త్రీయో వైశ్యాస్తథాశూద్రాస్తే పియాన్తి పరాంగతిమ్''
(గీత 9-32)

' నన్ను శరణుజొచ్చిన వారెవరయినా సరే, వారు పాపజన్మము నొందిన స్త్రీలు, వైశ్యులు, శూద్రులు ఎవరయినా సరే నన్ను నమ్మకుంటే వారికి వచ్చే జన్మలో మోక్షం లభిస్తుంది. దీనిని బట్టి అంతకుముందు స్త్రీలు శూద్రులు మోక్షానికి అర్హులకారన్న సంగతి తెలుస్తుంది వారు గీతా పరిధిలోకి వచ్చి, కృష్ణుణ్ని శరణు వేడుకుంటే వారికి గూడ మోక్షం లభించే ఏర్పాటు చేసారు గీతాకారులు. శూద్రుల్ని స్త్రీలను యిక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించడానికి కారణం లేకపోలేదు. బౌద్ధ యుగంలో శూద్రులు స్త్రీలు సమానత్వాన్ని అనుభవించారు. ఆసాంఘిక సమానత్వాన్ని ఆనాటి సంఘం హర్షించింది. అదే విధంగా

వీరికి గూడ (శూద్రులు స్త్రీలు) దేవుని దృష్టిలో ఒకప్పుడు లేని సాంఘిక స్థాయిని కల్పించి గీత ద్వారా వారిని ఆకర్షించాలనే భావాన్ని గీతలో కూడ చొప్పించే, ప్రయత్నంలో భాగమేయిది. ఇంతచేసినా సరే, మనువు గీసిన గీతలో (మనుధర్మశాస్త్రం) మాత్రం, స్త్రీలనూ, శూద్రులనూ, బానిసలుగా చేసి సమాజానికి ఆమడ దూరంలోనే ఉంచడం జరిగింది.

బ్రాహ్మణ, క్షత్రియ వైశ్య శూద్రులు, యీనాలుగు వర్ణాలవారినీ, వారిగుణ కర్మల •ననుసరించి నేనే సృష్టించాను అంటాడు కృష్ణుడు.

''చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః
తస్యకర్తా రమపిమాం విధ్ధ్య కర్తా రమవ్యయమ్''
(గీత 4-13)

ఆ విధంగా సృష్టించబడ్డ వర్ణాలు, వేలాది కులాలుగా రూపొంది, మనుషుల మధ్య అడ్డుగోడలుగా నిలిచినయి. ఒక కులం క్రింద, మరొక కులాన్ని ఉంచి నిచ్చెన మెట్లకుల శ్రేణీ పద్ధతి (Graded Society) వ్యవస్థను కొనసాగించడమే యిక్కడ ప్రధాన లక్ష్యం. వైదిక ఆధిపత్యానికి వర్ణవ్యవస్థ పట్టుగొమ్మ. ఏకులానికి నిర్దేశించిన విధులు, ఆకులంవారే నిర్వహిస్తూ ఉంటేనేవారికి మోక్షం కలుగుతుందన్నారు. నేటి సమాజంలో సకల అనర్థాలకు సాంఘిక అసమానతలకూ అస్పృశ్యతా జాడ్యాలకీ యీ కులవ్యవస్థే గదా మూలం యీ వ్యవస్థలోనే కొందరిని, చూడ రానివారుగా, తాకరానివారిగా, మాట్లాడ రానివారుగా (అస్పృశ్యులు అని వారికి పేరు పెట్టి) సమాజం నుండి త్రివిధ బహిష్కారం చేసారు. బహిష్కృతులనీ తిరస్కృతులనీ అవర్ణులనీ అంటరానివారనీ, పంచములనీ, సృష్టించిన మతం మతామా? అందులోనున్నది మానవత్వమా? రాక్షసత్వమా? అలాంటి వ్యవస్థను సృష్టించిన భగవద్గీతకు దివ్యత్వాన్ని పవిత్రతను ఆపాదించి, పురోహిత వర్గం తమ ఆధిక్యతను కాపాడు కుంటూవస్తున్న మాట నిజంకాదా? కొన్ని వందల సంవత్సరాలు గడచినా, దేశానికి స్వతంత్రం వచ్చినా యీ వర్ణవ్యవస్థలో మార్పు రాలేదు. పైగా రోజురోజుకీ బలపడుతూంది. అస్పృశ్యతా నివారణకు ఎన్నో చట్టాలు చేసారు. అయినా సామాజిక పరిస్థితిలో ఎందుచేత మార్పురాలేదు? గీతలోని ఒక్క గీతమయినా మారిస్తే గదా పరిస్థితి మారడానికి. ప్రజలకు స్వాములవారి మీద పురాణాలమీద ఉన్న భక్తి శ్రద్ధలు చట్టాల అమలు చేయడంలో వుండవు. పైసాలేని సాధువులకు, స్వాముల వారికీ కోటీశ్వరులైనారు విధేయులై ఉంటున్నారు. సామాన్యమానవుడి మీద మెజిస్ట్రేటు కంటె కూడ మతాచార్యుడు (బాబాలు, స్వాములు) ఎక్కువ అధికారాన్ని చెలాయించగలుగు తున్నాడు. దేశ ప్రధాని, దేశాధ్యక్షుడు స్వాముల వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తూవారికి

పాదాక్రాంతమవుతున్న సంగతి మనం చూస్తున్నాం. చట్టానికి సంప్రదాయానికీ మధ్యగల అంతరాన్ని గూర్చి అంబేడ్కర్ చేసిన హెచ్చరిక యిక్కడ గమనార్హం.

Rights are protected not by law but by social and moral Conscience of society. If soc'al Conscience is such that it is prepared to recognise the rights, which law chooses to meet, rights will be safe and secure. But, if the fundamental rights are opposed by the Community, no law, no parliament, no judiciary, can guarantee them in the real sense of the word.

హక్కులకు నిజమైన రక్షణ సామాజిక అంతఃకరణ, సాంఘికతత్వంలోనే ఉంటుంది కాని చట్టంలో కాదు. చట్టం నిర్దేశించిన హక్కుల్ని సాంఘిక వివేచన గుర్తిస్తేనే ఆ హక్కులు సరిగా రక్షించబడతాయి. ప్రాధమిక (మానవ) హక్కుల్ని సమాజం వ్యతిరేకిస్తే చట్టంగాని నాయ్యవ్యవస్థగాని, పార్లమెంటుగాని ఆహక్కులను ఖచ్చితంగా అమలు చేయలేవు''.

మన సమాజంలో సంప్రదాయాలు, ఆచారాలు పౌరాణికవ్యవస్థతో ముడిపడి ఉన్నాయి. భారత రాజ్యాంగం నిర్దేశించిన సాంఘిక సమానత్వం సౌభ్రాతృత్వం, నెలకొనాలంటే కేవలం చట్టాలమీదనే ఆధారపడితే ప్రయోజనం లేదు అని అంబేడ్కర్ చేసిన హెచ్చరికలో ఎంతో వాస్తవంవుంది. పురాణవ్యవస్థ ప్రకారం శూద్రులకు స్త్రీలకు సమానస్థాయి లేక పోవడం చేతనే గదా యీనాడు ప్రభుత్వం వారి ఉద్ధరణకోసం ప్రత్యేకంగా కృషి చేయాలిసి వచ్చింది. ఈ కారణంగానే శూద్రులకోసం, దళితులకోసం చట్టాలు చేశారు. కాని వాటి అమలులో గల వైఫల్యాలను మనం అనుభవంలో చూస్తు నేవున్నాం. సమాజాన్ని మార్చేశక్తి చట్టం కంటె స్వాములవారికే ఎక్కువగా ఉంది మన సమాజంలో. ఆనాటి స్వాముల వారి చేతి రాతే యీనాడు గీతగా మారి సమాజాన్ని శాసిస్తోంది. దానిని ఎలా కావలిస్తే అలా మార్చేశక్తి గూడ వారి చేతుల్లోనే ఉంది.

యుద్ధంలో జయిస్తే రాజ్యభోగం లభిస్తుంది. అనే ఫలితాన్ని చెప్పి యుద్ధానికి పురిగొల్పిన కృష్ణుడే మరోచోట అర్జునా! ఫలితాన్ని ఆశించకుండా కర్మ చేయడమే నీవంతు అంటాడు.

''కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన
మా కర్మఫలహేతు ర్భూర్మాతే సజ్ఞోస్త్వ కర్మణి''
(గీత 2-47)

(అర్జునా!) నీకు కర్మ చేయడంలోనే అధికారం ఉంది. ఆ కర్మ ఫలితాన్ని ఆశించడంలో నీకు ఎప్పుడూ అధికారం లేదు. కర్మ ఫలమునకు నీవు కారణ భూతుడవు

కావద్దు. కర్మలు మానడంలో గూడ నీకు ఆశక్తి కలగ కూడదు.

ఇలాంటి పరస్పర విర్ధు భావాలు అనేకం చోటుచేసుకున్నాయి గీతలో. భగవద్గీతలో కృష్ణుడు బోధించిన నీతి ఏమిటి? యుద్ధ భూమిలో నీతులు బోధించి అర్జునికి జ్ఞానోపదేశం చేసిన కృష్ణుడే ఎన్నో కుయుక్తులతో యుద్ధాన్ని నడిపించాడు. కౌరవ వినాశనానికి కారకుడయ్యాడు. కృష్ణుని సైన్యాలు కౌరవుల పక్షాన తాను పాండవుల పక్షాన నిలిచియుద్ధాన్ని నడిపాడు. కౌరవుల పక్షాన న్యాయం లేదు కాబట్టి వారు యుద్ధంలో నాశనం, కావడం తప్పనిసరి అనిభావించిన కృష్ణుడు, తన సైన్యాలను మాత్రం, సుయోధనుడికెందుకివ్వాలి? దీనిని తౌఖ్యమనుకోవాలా? ద్వంద్వ నీతి అనుకోవాలా? ఆయన చేతలకు అర్థాలు వెదకలేం?

భారత కథలో భీష్ముడు పితామహుడు. నిజాయితీ పరుడు. బల పరాక్రమవంతుడు. ఆడమగ కానివారి మీద బాణాలు వేయనని శపథం చేసినవాడు. ఈ సంగతి కృష్ణుడికి తెలుసు. అందుకనే భీష్మణ్ణి ఆడామగాకాని శిఖండిని అడ్డం పెట్టుకొని చంపించాడు కృష్ణుడు. కౌరవ పాండవులకు గురువైన ద్రోణాచార్యునికి తనకొడుకు చనిపోయాడనే అబద్ధాన్ని వినిపించి, ఆగురువుచావుకు కారకుడయ్యాడు.

కర్ణుణ్ణి తమవైపు తిప్పుకోడానికి కుంతికి, (ద్రౌపదికి సలహాలిచ్చి), రాయబారానికి పంపాడు. ఆ సందర్భంలో, తన సోదరులలో అర్జునుడు తప్ప యుద్ధ భూమిలో ఇంకెవరు చిక్కినా చంపనని కర్ణుడు దగ్గర వాగ్దానం తీసుకుంది కుంతీదేవి. అలాంటి కర్ణుణ్ని యుద్ధభూమిలో రథ చక్రం కూరుకుపోయి, నిరాయుధుడైన తరుణంలో అతడి గుండెల్లో బాణాలు వేయించి చంపించాడు కృష్ణుడు.

గదా యుద్ధంలో ప్రవీణుడైన దుర్యోధనుణ్ణి గూడ తొడల మీద దొంగ దెబ్బ కొట్టించి చంపించాడు. ఇవన్నీ యుద్ధ నీతికి వ్యతిరేక చర్యలే ఈ విధంగా అక్రమ మార్గంలో యుద్ధాన్ని నడిపించిన కృష్ణుడుకి నైతికతను బోధించే అర్హత ఎక్కడిది? యుద్ధ భూమిలో, కృష్ణుడు చేయించిన కుతంత్రాలలో యివి కొన్ని ఉదాహరణలు మాత్రమే. అయితే ఇవి కుతంత్రాలు కావంటారు. కౌరవులనే దుష్టులను సంహరించి శిష్టులైన పాండవుల్ని రక్షించడం కోసం అవతరించిన కృష్ణుని లీలలు అని సమర్థించారు. కృష్ణుడు జన్మించడానికి రెండు కారణాలు, చెప్పారు.

''యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్యత దాత్మానం సృజామ్యహమ్''
(గీత 4-7)

ఎప్పుడెపుడు ధర్మం క్షీణించి అధర్మం పెరిగిపోతుందో అప్పుడు నేనే (కృష్ణుడు) అవతరిస్తాను (నన్ను నేనే సృష్టించు కుంటాను).

''పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే''
(గీత 4-8)

సజ్జనులను రక్షించడానికీ దుర్మార్గుల్ని నాశనం చేయడానికీ ధర్మాన్ని స్థాపించడానికీ ప్రతి యుగంలోనూ నేను అవతరిస్తూంటాను.

ఇక్కడ ధర్మం అంటే మతపరమైన ధర్మమే. నాటి శంకరాచార్యుని సందేశాన్నే నేడు ''ధర్మో, రక్షితి రక్షితః'' అనే నినాదంగా మార్చి ముందుకు దూసుకుపోతున్నారు వారి సంతతి. ప్రపంచం బ్రహ్మనుండి ఉద్భవించింది, అన్నభావానికి సంకేతంగా కృష్ణుడు నోటిలోనే విశ్వరూప ప్రదర్శ చేయించారు. ఇది ఎంతవరకూ సాధ్యం అన్నది ప్రజలకు పట్టలేదు. ఈ ఘట్టాన్ని కేవలం భక్తి భావంతోనే నమ్ముతూ వస్తున్నారు ఇంతకాలం నుండీ ప్రజలు. బూజుపట్టిన భావాలను కృష్ణుడి పేరుతో మనిషి మస్తిష్కంలోకి మత్తు మందులాగ ఎక్కించడమే ప్రధానం ఉద్దేశం. భగవద్గీతను అందుకు ఆధారంగా వాడుకున్నారు.

## బుద్ధుని సాంఘిక విప్లవం - శంకరాచార్యుని ప్రతి విప్లవం :

జంతుబలులతో, మౌఢ్య భావాలతో సాంఘిక అసమానతలతో అస్తవ్యస్తంగా ఉండేది ఆనాటి సమాజం అలాంటి సమాజంలో, విప్లవాత్మకమైన మార్పు తీసుకొచ్చాడు బుద్ధుడు. వేదాలనూ యజ్ఞాలనూ, దైవ భావాన్నీ పక్కను బెట్టి వాటిని సృష్టించిన బ్రాహ్మణీయ వ్యవస్థను ప్రశ్నించి, సామాజిక సమానత్వాన్ని నెలకొల్పాడు బుద్ధుడు. బుద్ధుని తదనంతరం గూడ బౌద్ధ భిక్షువులతో పాటు మౌర్యచక్రవర్తులు బౌద్ధ ప్రచారంలో భాగస్వాములైనారు. రాజాశ్రయంతో సంఘంలో సమానత్వం నెలకొని, బౌద్ధం వెల్లివిరిసింది. అది ఆనాడు బుద్ధుడు తెచ్చిన సాంఘిక విప్లవం. ఆ కారణంగా వైదిక తత్వం చావు దెబ్బతిన్నది. పౌరోహిత్యపు పెత్తనం దిగజారిపోయింది. బౌద్ధం ప్రజల మతంగా చలామణీ అవుతున్న కాలంలో బ్రాహ్మణమతం క్షీణదశలో ఉంది. కోల్పోయిన అధికారాన్నీ, రాజాశ్రయాన్నీ తిరిగి సాధించుకోడానికి చేయగలిగిన ప్రయత్నాలన్నీ చేస్తూనే వున్నారు. బౌద్ధం ఎంత ప్రగాఢముద్ర వేసిందంటే బౌద్ధాన్ని దాని తీవ్ర రూపంలో అనుసరిస్తేనే తప్ప మరో విధంగా అసాధ్యమయిపోయింది. బుద్ధుడు నిర్యాణం చెందిన తరువాత, ఆయన అనుయాయులు, బుద్ధుని విగ్రహాలు, స్థూపాలు, నెలకొల్పడం మొదలు పెట్టారు. బ్రాహ్మణులు ఆపద్ధతినే అనుసరించారు. ఆలయాలు నిర్మించి వాటిలో, శివుడు, విష్ణువు, రాముడు, కృష్ణుడు

మొదలైన దేవుళ్ళ విగ్రహాలు ప్రతిష్ఠించడం మొదలు పెట్టారు. ఇదంతా బుద్ధ విగ్రహారాధన వైపు ఆకర్షితులైన ప్రజానీకాన్ని, ఆవైపునుండి దృష్టి మరల్చడానికి చేసిన ఎత్తుగడ మాత్రమే! ఆ విధంగా, ఆదిలో బ్రాహ్మణమతంలో లేని, ఆలయాలు, దేవుడి విగ్రహాలు, తరువాత కాలంలో పుట్టుకొచ్చాయి. భారతదేశ చరిత్రను, పురావస్తు శాఖవారు భద్రపరచిన శిల్ప శిథిలాలను, చూస్తే బుద్ధుని విగ్రహాలు చాలపాతకాలం నాటివి. (సుమారు రెండువేల సంవత్సరాల క్రితంనాటివి.) రాముడు కృష్ణుడు విగ్రహాలు, ఆతరువాత వచ్చిన వేనని గమనించగలం.

రాముడు శివలింగాన్ని రామేశ్వరంలో స్వయంగా ప్రతిష్ఠించినట్టు చెబుతారు. కాని రామేశ్వరం క్రీస్తు తర్వాత పది పదమూడు శతాబ్దాల మధ్య ఆవిర్భవించిన క్షేత్రం. మహాభారతంలో ఉట్టంకించిన పుణ్యక్షేత్రాల పట్టికలో, రామేశ్వరం పేరు కనబడదు. కంచి, శ్రీరంగం, మధురై చిదంబరం, తిరుపతి మొదలైన నాటి ప్రసక్తి సయితం వాటిలో కనబడదు. భారతాన్ని అంచెల వారిగా పెంచుకుంటూ పోవడం జరిగింది క్రీ.శ. అయిదవ శతాబ్దం వరకూ. అందుచేత క్రీ.శ. అయిదవ శతాబ్దం వరకూ, రామేశ్వర క్షేత్రం ప్రస్తావన లేదు, కాబట్టి ఆనాటికి అది ఉద్భవించలేదనే తెలుస్తుంది. అంతేగాకుండా పది పదకొండవ శతాబ్దాలలో పుట్టిన పురాణాలలో సయితం రామేశ్వరం ప్రస్తావన లేదు. అందువల్ల పదకొండు, పదమూడు శతాబ్దాల మధ్యకాలంలో చోళరాజులు రామేశ్వర దేవాలయాన్ని నిర్మించారని ఒక చారిత్రక వాదన ఉంది. దీన్ని బట్టి మనకి అవగతమవుతున్న దేమంటే బౌద్ధం తర్వాత పదిహేను వందల సంవత్సరాల తర్వాతనే యీ దేవుళ్ళ విగ్రహాల సృష్టిజరిగిందని.

గోవధ విషయంలో గూడ యిలాగే జరిగింది. ఋగ్వేద కాలంలో ఇప్పటివలె గోవును పూజార్హంగా పరిగణించలేదు. దాన్ని చక్కగా పోషించేవారు. సుష్టుగా ఆరగించేవారు. బలులు క్రతువుల రూపంలో, ఛేలాది జంతువులను వధించేవారు నాటి బ్రాహ్మణులు. హింసాత్మకమైన పశువుల వధను బౌద్ధులు ఖండించడంలోని, ఔచిత్యాన్ని ప్రజలు గ్రహించారు. అందుచేత జంతుబలుల పట్ల వ్యతిరేకత ప్రజల మనస్సుల్లో గాఢంగా నాటుకు పోయింది. వ్యవసాయ వృత్తి మీద జీవించే కాలం కావడం మూలాన్న గోవులు, ఎద్దులు వారికి అత్యంత ఉపయోగ కరమైన జంతువులయినాయి. ప్రయోజన కరమైన జీవాలను వధించే వార్ని అసహ్యించుకుంటూ వారిని గోహంతకులుగా పరిగణించారు. ప్రేమను పెంచి మమతను పంచిన సౌజన్యమూర్తి ప్రవచించిన బౌద్ధాన్ని ఆదరించారు. అందుచేత బ్రాహ్మణ వర్గం, బౌద్ధుల కంటే మెరుగైన రీతిలో తమ పరపతి పెంచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. యజ్ఞాలు, చేయడం, గోవుల్ని వధించడం మానుకోవడం మినహా మరో గత్యంతరం లేక

పోయింది. ఈ పరిణామ దశలో బౌద్ధ బిక్షువుల మీద ఆదరణను తగ్గించడానికి బ్రాహ్మలు ఏకంగా గోవధనే కాకుండా గోమాంస భక్షణే మానివేసారు. ఆతర్వాత అసలు మాంసాహారాన్నే పూర్తిగా విసర్జించి శాఖాహారులుగా మారి పోయారు. ఈ విధంగా బౌద్ధ సంస్కృతికి దీటుగా బ్రాహ్మణత్వాన్ని పునరుద్ధరించే నేపథ్యంలోనే, శంకరాచార్యుడు భగవద్గీతకు తనదైన రీతిలో భాష్యం రాసాడు. బౌద్ధ సామాజిక విప్లవానికి, ప్రతివిప్లవంగా, వేద ప్రమాణాన్ని వర్ణవ్యవస్థను సమర్థించాడు. వైదికమత పునరుజ్జీవం కోసం బౌద్ధుల్ని హింసించి వధించడానికి బౌద్ధ శిల్పాలను నాశనం చేయడానికి గూడ వెనుకంజ వేయలేదు. భారతదేశంలో బౌద్ధ ధర్మ ఆవిర్భావం, ఒక విప్లవాత్మక ఘటన. ఆ విప్లవాన్ని అణచివేస్తూ బ్రాహ్మణీయ వ్యవస్థను పునః ప్రతిష్ఠించడమే శంకరుని ప్రతివిప్లవ ధ్యేయం. ఈ ప్రతివిప్లవాన్ని తాత్వికంగా సమర్పించు కోడానికి చేసిన ప్రయత్నాలలో భాగంగానే, భగవద్గీతకు భాష్యాలు రాసి, ప్రజానీకంలో ప్రచారం చేయడం జరిగింది.

ఈ చారిత్రక పరిణామంలో బ్రాహ్మణ్యం పునరుజ్జీవం పొందటానికి అవకాశం కోసం ఎదురు చూసింది. మౌర్యులలో చివరి రాజైన బృహద్ర దుడ్ని అతని బ్రాహ్మణ సేనాని అయిన పుష్య మిత్రుడు హత్యచేసి రాజ్యాన్ని హస్త గతం చేసుకొని బ్రాహ్మణ సామ్రాజ్యాన్ని పునరుద్ధరించాడు. ఈ నేపథ్యంలోనే, సమాజంలో, బ్రాహ్మణ ఆధిపత్యాన్ని సమర్థించిన మనుధర్మ శాస్త్రానికి, భగవద్గీతకూ, తిరుగులేని పవిత్రతను ఆపాదించి ప్రజాదరణను పెంచారు. గీతను, హిందువులకు ప్రామాణిక గ్రంథంగా మలిచారు. ముస్లిమ్‌లకు ఖురాను, క్రైస్తవులకు బైబిలు ఎలాంటివో హిందువులకు గీత కూడ అలాంటిదే. శూద్రులు, హిందువుల్లో భాగమే. అయినా సరే హైందవ వర్ణవ్యవస్థలో వారికి సమాన స్థాయి కల్పించలేదు కాని వారి మెదళ్ళలో చొప్పించిన దాస్యభావాలను వారు గుర్తించే స్థాయిలో లేరు.

ఆమధ్య శ్రీకాకుళం నుండి ''గీతా హరి జన, గిరిజన పేదప్రజా సంఘం'' అనే ఒక సంస్థ గీతా జయంతి శుభాకాంక్షలు అనే గ్రీటింగ్ కార్డుల రూపంలో కరపత్రాన్ని వేశారు. ''భారతావనిలో ప్రబలిన కులమత వర్గ వర్ణ విబేధాలు నరికట్టడానికి గీతను నిత్య పారాయణం చేస్తూ దైనందిన జీవితంలో, గీతలోని ధర్మాలు సూత్రాలు ఆచరించాలి''. ఇదీ ఆకర పత్రంలో సారాంశం. పై సంఘంవారు గీతలో మహోన్నత ధర్మ సూత్రాలు. సమతా ధర్మాలు, కులమత వర్గ విబేధాలకు అతీతమైన న్యాయ సూత్రాలు ఉన్నట్టు భావించారు. నిజంగా అలాగే వున్నాయా? అసలు ఆ గీతే ''గిరిజన, హరిజన సంఘుల'' వారి తలరాతలను గీసి, అధములుగా అణచివేసిందన్న విషయాన్ని గుర్తించలేని అజ్ఞానంలో ఉన్నారు. తరతరాలుగా, అంతరాలు సృష్టించిన గీతలోని ఆంతర్యాన్ని తెల్పు కోలేక

పోతున్నారు. ఆ గీతే, శ్రామిక శూద్రులను వర్ణ సిద్ధాంతం పేరుతో, శ్రమ జీవులుగానే స్థిరపరచిందన్న సంగతి గుర్తించలేక పోతున్నారు. ''హరిజనులు'' అని నామకరణం చేయడం లోని ఆంతర్యాన్ని చారిత్రక కారణాన్ని తెల్సుకోలేక పోయారు. హరిజన అనే పదాన్ని, అంబేడ్కర్ ఆనాడే ఖండించారు. ఈ రోజుల్లో గూడ జ్యోతిరావ్ పూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్‌లు అందించిన తాత్విక పునాదిని అధ్యయనం చేయకుండా భగవద్గీత పడగ నీడలో తమతలలు దాచుకుంటున్న అమాయకులు అసంఖ్యాకంగా ఉన్నారు. కేవలం ఆర్థిక ఫలితాల కోసం మాత్రమే. ఆరాటపడుతూ వారి సాంఘిక అసమానతకు మూలాలు ఎక్కడున్నాయో తెల్సుకోవల్సిన అవసరాన్ని అలక్ష్యం చేస్తున్నారు. ఆమూలాలకు కారణాలయిన సాహిత్యాన్ని దాన్ని సృష్టించిన స్వార్థ పరులు భావజాలాన్ని ఎండగట్టాలిసిన అవసరమూ ఉంది.

ఈ నేపధ్యంలోనే డ్యాక్టర్ అంబేడ్కర్ హిందూ ఫాసిజాన్ని అధ్యయనం చేసారు. అందులో భాగంగా భగవద్గీతను కూడ నిశితంగా పరిశీలించారు. ప్రజలలో పాతుకుపోయిన పాత భావాలు మారాలంటే, అంబేడ్కర్ రచనలు చదవాలి ముఖ్యంగా. శూద్రులు దళితులూ ఆపనిచేయాలి. ఆర్థిక ప్రగతి మీద మాత్రమే సారించిన వారి దృష్టి, సాంఘిక న్యాయం సామాజిక పరివర్తన వైపు గూడ మళ్లించాలి. ఆర్థిక ప్రగతి ఎంతముఖ్యమో, ఆత్మ గౌరవం సాంఘిక న్యాయం కూడ అంతే ముఖ్యం.

శూద్రులు, దళితుల దుస్థితికి కారణమైన, మతం, అందులోని మార్మికతను వెలికి తీసి చూపించాడు అంబేడ్కర్ . బ్రాహ్మణీయతను పెంచి పోషించడానికి దళితులు యాంత్రికంగా అలవాటు పడిపోయిన వైనాన్ని గుర్తించేలా చేసాడు. దైనందిన జీవితంలో దళితుల అలవాట్లకు ఆచార వ్యవహారాలకు, మూలాలు, నాటి పురాణ ఇతిహాసాల్లోనే ఉన్నాయి. అందులో భగవద్గీత కూడ ముఖ్య పాత్ర నిర్వహిస్తుంది. దళితుల శూద్రుల, దాస్య భావాలకు ఆధారం, పురాణాలమీద పెంచుకున్న ఆరాధనా భావమే. వారి సర్వతోముఖాభివృద్ధికి మనుస్మృతి పెద్ద అడ్డుగోడగా నిలిచింది. అందుకే, తన సాంఘిక విప్లవోద్యమంలో భాగంగా ''మనుస్మృతి''ని బహిరంగంగా దహనం చేసారు. మనుస్మృతిలో వెల్లడించిన బానిస భావాలకు నిరసనగానే గాకుండా, శూద్రుల దళితుల మెదళ్ళలో పేరుకున్న బూజును గూడవొదిలించి, చైతన్య వంతుల్ని చేయడానికే ఎంతో సాహసంతో మనుస్మృతి దహనం చేశారు. వర్ణవ్యవస్థకు కారణ భూతమైన భగవద్గీతను గూడ పరిశీలించి అందులోని నిజాలను వెల్లడి చేశారు అంబేడ్కర్. భక్తునివలె భగవద్గీతను పారాయణం చేయడం గాకుండా, సత్యాన్వేషిగా దానిని పఠించి పరిశీలించారు. గీతా

భక్తబృందానికి బాధ కలిగించినా సరే, సత్యాన్ని సత్యంగా చెప్పడానికి అంబేద్కర్ సంకోచించలేదు.

అంబేద్కర్ తన వ్యాసంలో భారతీయ, పాశ్చాత్య పండితులు పరిశోధకులు రచించిన గీతా భాష్యాలను, విమర్శలను తులనాత్మకంగా చర్చించారు. మాక్స్ ముల్లర్, డి.డి. కోశాంబి, హాప్‌కిన్స్ మొదలైన ఆధునిక పండితులను ఉదాహరిస్తూ తనవాదానికి బలం చేకూర్చుకున్నారు. వర్ణవ్యవస్థకు వ్యతిరేకంగా, మూసపోసిన మౌఢ్యభావాలకు భిన్నంగా, సనాతన సంప్రదాయాలకు అతీతంగా, ఆలోచించడానికి అంబేద్కర్ అందించిన పరిశోధనా సాహిత్యం ఎంతగానో దోహదం చేస్తుంది. పాత విషయాలను కొత్త దృష్టితో చూడ్డానికి అంబేద్కర్ పరిశోధన ఎంతయినా ఉపకరిస్తుంది. సనాతన సాంప్రదాయాలను, పాత విశ్వాసాలను, అంబేద్కర్ అందించిన తాత్విక భూమికతో, వ్యాఖ్యానించుకోవలసిన అవసరం ఏర్పడింది. శూద్రుల దళితుల మెదళ్ళకు పడ్డ సంకెళ్ళను గుర్తిస్తేనే గాని అందులో నుండి బైటపడలేరు. అపుడే వారికి యోగ్యమైన ప్రత్యామ్నాయ సంస్కృతిని వారు నిర్మించుకో గలుగుతారు. అలాంటి సంస్కృతి ప్రప్రథమంగా 2500 సంవత్సరాల క్రితమే బుద్ధుడు ఆవిష్కరించిన సాంఘిక విప్లవంలోనే ఉన్నది, అన్న చారిత్రక సత్యాన్ని గూడ గుర్తించగలరు. పురాణ గాథలలోని మంచి చెడ్డలను సహేతుకంగా, చారిత్రక ఆధారాలతో నిరూపించగలిగిననాడే, కట్టు కథ ఏదో, గట్టి చరిత్ర ఏదో బైటపడుతుంది.

ఎందరో హేతువాదులు, మానవతా వాదులు, చరిత్రకారులు ఆపని యిది వరకే చేసారు. అంబేద్కర్ గూడ తన దైన శైలిలో శాస్త్రీయ దృక్పథంతో తన సునిశిత మేధాశక్తితో పురాణ ఇతిహాసాల్ని సంస్కృతంలోనే చదివి, విమర్శలు రాసారు. అవి శూద్రదళిత వర్గాల్లో జిజ్ఞాసను రేకెత్తిస్తాయి. ఆలోచనలను రేపుతయి. భావవికాసాన్ని మానసిక చైతన్యాన్ని కలుగజేస్తాయి. ఈ నేపథ్యంలో అంబేద్కర్ చేసిన భగవద్గీత పరిశీలనను అర్థంచేసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. అంబేద్కర్ రాసిన వ్యాసం సంపూర్ణంగా లభ్యంకాకపోవడం మూలాన్న లభించినంత మేరకే యధాతథంగా (అసంపూర్తిగా నయినా సరే) విషయ గౌరవం దృష్ట్యా అనువదించి ప్రచురించడం జరిగింది. మూలవ్యాసంలోని విషయం అత్యంత క్లిష్టమయినది. అందువల్ల అంబేద్కర్ పరిశీలనను వివరిస్తూ పాఠక సౌలభ్యం కోసం తత్ సంబంధిత విషయాలు అనేకం సేకరించి యీ ఉపోద్ఘాతాన్ని కూర్చడం జరిగింది. ఇందుకు నేను సంప్రదించిన గ్రంథాలను చివరిలో పేర్కొన్నాను ఆయా గ్రంథాల రచయితలకు కృతజ్ఞతా పూర్వక నమస్కారాలు. ఈ నేపథ్యంలో అయితే అంబేద్కర్ వ్యాస వైశిష్ట్యం సమగ్రంగా అవగాహన చేసికోవటానికి అవకాశం కలుగుతుందని నా నమ్మకం.

ఈ చిన్న పుస్తకం రాయడానికి నాకు అన్ని విధాల సలహాలనిచ్చి తోడ్పడిన సహృదయులు ఆంధ్రోపన్యాసకులు డాక్టర్ కతెవరపు వెంకటరామయ్య గారికి, అన్ని వేళలా నాకు వెన్నుదన్నుగా ఉండే బాల్యమిత్రుడు ప్రజాసాహితీ బంధు శ్రీ నిర్మలానంద గారికీ నా కృతజ్ఞతాభివందనాలు. అతి తక్కువ కాలంలో అందంగా ముద్రించి యిచ్చిన మిత్రుడు వంశీ ఆర్ట్ ప్రింటర్స్ అధినేత శ్రీ జి.యన్. రావు గారికి ధన్యవాదాలు.

ఏప్రిల్ 14, 1996

విశాఖపట్టణం

మాటూరి వెంకట రమణ

# భగవద్గీత - ఒక పరిశీలన

(భగవద్గీత గురించి వ్యాసాలు తాలూకు మొదటి పేజీ అంబేద్కర్ సంతకంతో ఉంది. తరువాత. నలభై రెండు పేజీలలో విరాట, ఉద్యోగ పర్వాల మీద నోట్సూ, అందుకు సంబంధించిన విషయాల మీద పట్టికతో సహా వివరణలు ఉన్నాయి. విషయసూచిక కూడా ఈ ప్రణాళికలోనే ముద్రించడం జరిగింది. ''ప్రతి విప్లవానికి తాత్విక సమర్థన: కృష్ణుడు - ఆయన గీత అన్న వ్యాసం రెండు టైపు కాపీలు ఆ ఫైల్‌లోనే ఉన్నాయి. అయితే ఈ వ్యాసం ఆఖరి వాక్యం మాత్రం అసంపూర్తిగానే వదిలివేయటం జరిగింది. ఈ వ్యాసం నలభై టైపు చేసిన పేజీల్లో వుంది. విరాట, ఉద్యోగ పర్వాలకు సంబంధించి రాసిన నోట్సు తదుపరి అధ్యాయాల్లో ముద్రించడమైనది - సంపాదకులు.)

ప్రాచీన భారతీయ వాఙ్మయంలో భగవద్గీతకు ఉన్న స్థానం ఏమిటి ? క్రైస్తవ మతానికి బైబిలు ఎలా ప్రామాణిక గ్రంథమో హిందూ మతానికి భగవద్గీత కూడా అలాంటిదేనా ? హిందువులు భగవద్గీతను ఒక పవిత్ర ప్రమాణ గ్రంథంగా గౌరవిస్తున్నారు. అదే పరమ ప్రమాణ గ్రంథమయితే, అది వాస్తవంగా బోధిస్తున్నదేమిటి ? అది ఏ సిద్ధాంతానికి ప్రాతిపదికగా, ప్రమాణీకంగా నిలుస్తుంది ? ఈ ప్రశ్నలకు విషయ పరిజ్ఞానం గల మేధావుల నుండి లభించిన సమాధానాలను చూస్తుంటే, ఆశ్చర్యంగా ఉంటుంది.

**బోట్‌లింక్[1] ఇలా అంటాడు :**

''గీతలో ఎన్నో ఉన్నతమైన చక్కటి భావాలున్నాయి. వాటి పక్కనే కొన్ని బలహీనమైన విషయాలూ, పరస్పర వైరుధ్యాలూ, (అయినా వీటిని అంతగా పట్టించుకోనవసరం లేదంటూ కొట్టి పారేయడానికి ప్రయత్నించారు గీతా భాష్యకారులు.) చర్విత చర్వణాలూ, అతిశయోక్తులూ, అసంగతాలూ, జుగుప్సాకరమైన విషయాలు కూడా చోటు చేసుకున్నాయి.''

**భగవద్గీతను గూర్చి హాప్‌కిన్స్[2] ఉద్దేశం ఇలా ఉంది :**

''పవిత్రతలో, అదేవిధంగా అర్థరహితమైన విషయాల్లో, తార్కికతలో, తర్కరాహిత్యంలో, భగవద్గీతకు హైందవ వాఙ్మయంలో ఒక విశిష్టమైన ఉన్నత స్థానం ఉంది. ఇందులో ఆదిమ తాత్విక భావాల్ని అస్తవ్యస్తంగా కూర్చటం జరిగింది.''

**చివరగా హాప్‌కిన్స్ ఇలా నిర్ధారిస్తాడు :**

''అక్కడక్కడా బలమైన వ్యక్తీకరణా సంగీతపరమైన ఔన్నత్యమూ కనిపించినా - భగవద్గీత ఇప్పుడున్న స్థితిలో కవిత్వ గ్రంథంగా సంతృప్తికరంగా లేదు. ఒకే విషయాన్ని

పదే పదే చెప్పడం, పరిభాషా నిర్మాణంలోనూ, అర్థవివరణలోనూ వైరుధ్యాలు అసంఖ్యాకంగా వున్నాయి. అది 'అద్భుత గీతమనీ, రోమాంచ అనుభూతిని కలిగిస్తుందనీ కనిపించే అభివర్ణనలు ఎవరనీ ఆశ్చర్యపరచవు''.

హోల్జ్‌మన్[3] ఇలా అంటాడు :

''(భగవద్గీతలో) మన ముందున్నది సర్వేశ్వర భావనకు వైష్ణవరూపం''

గార్బ్[4] పరిశీలన ఇలా ఉంది :

''ఆ కావ్య స్వభావం, రచన, ప్రణాళికాపరంగానూ, రచనాపరంగానూ, ప్రధానంగా ఆస్తికత్వమే. కృష్ణుడనే దైవ వ్యక్తి మానవ నాయకుని రూపంలో సాక్షాత్కరించి తన సిద్ధాంతాన్ని శ్రోతకు వివరిస్తాడు, ఆదేశిస్తాడు. అతని విధులను, తనపై ప్రేమపూర్వక విశ్వాసం ప్రకటించి శరణువేడాల్సిన అవసరాన్ని నిర్దేశిస్తాడు ... గీతా కావ్యమంతా నిండిన ఆ దేవుడితో పాటు, సాధ్యమైనంతవరకు సాకారంగా గోచరించే ఆ దేవుడితో పాటు - పక్కనే నిర్వికార నిర్వికల్పమైన, ఏకైకమైన బ్రహ్మం కూడా అత్యున్నత సిద్ధాంతంగా కావ్యంగా తరచు సాక్షాత్కరిస్తుంటుంది తానే ఏకైక అత్యున్నత దైవాన్ననీ, ఈ ప్రపంచాన్నీ సకల జీవరాశులనూ సృష్టించి పాలిస్తున్నది తానేననీ కృష్ణుడు అంటాడు; మరోసారి వేదాంత సూత్రమైన బ్రహ్మంను, మాయను చెబుతాదు, ప్రాపంచిక భ్రమల నుంచి విముక్తమై బ్రహ్మంగా మారడమే మానవుడు సాధించవలసిన ఉన్నత లక్ష్యమని ప్రవచిస్తాడు. దైవ ఆస్తికత, సర్వేశ్వరవాద సిద్ధాంతాలైన ఈ రెండూ ఈ కావ్యంలో ఒకదానిలో ఒకటి కలిసిపోయి, ఒకదాన్ని ఒకటి అనుసరిస్తూ, ఒక్కోసారి పరస్పర సంబంధం లేకుండానో, పై పై సంబంధంతోనో కనిపిస్తాయి. అలాగని ఒకదాన్ని తక్కువ, సామాన్య సిద్ధాంతమని (గీత-పేజీ. 9), మరొకటి ఉన్నతమైన, జ్ఞాన సిద్ధాంతమనీ కావ్యంలో కూడా ఎక్కడా వ్యక్తం చేయలేదు. సత్యజ్ఞానానికి ఆస్తికత ప్రాథమిక దశ అని కానీ, దానికిది ప్రతీక అని గానీ, వేదాంతంలో చెప్పిన సర్వేశ్వరవాదమే (అంతిమ) సత్యమని కానీ ఎక్కడా లేదు; కానీ ఆ రెండు విశ్వాసాలకూ ఏ తేడా లేదన్నట్లుగా గీత వ్యవహరించింది.''

తెలంగ్[5] ఇలా అన్నారు :

''గీతలో ఒక దానితో ఒకటి సులువుగా పొంతన కుదరని భాగాలు అనేకం ఉన్నాయి; వాటికి పొత్తు కుదిర్చే ప్రయత్నమేదీ జరగలేదు. ఉదాహరణకు ఏడో అధ్యాయంలోని పదహారో శ్లోకం చూడండి. కృష్ణుడు తన భక్తులను నాలుగు తరగతులుగా విభజించాడు. అందులో ఒకటి ''జ్ఞానుల''ది. వారిని తానుగానే గుర్తించాడు. బహుశా ఇంతకన్నా ఎక్కువ గౌరవాన్ని అభివ్యక్తం చేయడం కష్టమేనేమో ! అయితే మరోచోట తద్విరుద్ధ భావ

ప్రకటన జరిగింది. ఆరవ అధ్యాయం 46వ శ్లోకంలో భక్తుడు అయినవాడు ముక్కు మూసుకొని తపస్సు చేసేవారి కంటే, జ్ఞానవంతుల కంటే కూడా శ్రేష్టమయిన వాడని చెప్పటం జరిగింది. పైన పేర్కొన్న జ్ఞానవంతులంటే శాస్త్రాదులలో పాండిత్యం సంపాదించిన వారని భాష్యం చెప్పి భాష్యకారులు తమ మార్మిక జ్ఞాన పక్షపాతాన్ని ప్రదర్శించారు. ఇది తప్పనిసరిగా నిరాకరించవలసిన భాష్యమేమీ కాదు. కానీ, ఇక్కడ ఈ సందర్భంలో చేసిన మాటల గారడీని నేను అంగీకరించలేను. పైగా 4వ అధ్యాయం 39వ శ్లోకం (పేజీలు 62, 63) పిండితార్థం జ్ఞానం అనేది భక్తికంటె ఉన్నతమైనదన్నట్లు, భక్తిసోపానంతో చేరుకోదగిన ఉన్నత స్థితి అన్నట్లు కనిపిస్తుంది. మళ్ళా మరోచోట (12వ అధ్యాయం 12వ శ్లోకం) జ్ఞానం కంటే ధ్యానమే శ్రేష్టమైనది అని చెప్పాడు. ఇది కూడా 17వ అధ్యాయం, 16వ శ్లోకంలో చెప్పినదానికి పూర్తి విరుద్ధంగా ఉంది. ఐదవ అధ్యాయం 15 వ శ్లోకంలో ''పరమాత్మ ఎవరి పాపముగాని, పుణ్యముగాని, స్వీకరించడు'' అని చెబుతూనే మరోచోట కృష్ణుడు తనని తాను 'ప్రభువుననీ, అన్ని యజ్ఞాలకు తపస్సులకు స్వీకర్త'నని చెప్పుకుంటాడు. 'ఇక్కడొక ప్రశ్న ఉదయిస్తుంది. తానుగా దేన్నీ అందిపుచ్చుకోని పరమాత్ముడు, వాటికి ఎలా కర్తకాగలడు?' అని. 10 వ అధ్యాయం 29వ శ్లోకంలో 'నాకెవరూ ఇష్టులు లేరు, అయిష్టులూ లేరు' అంటాడు కృష్ణుడు. ఈ ప్రకటనకు పూర్తి భిన్నమైనది పన్నెండో అధ్యాయం చివర్లో కనిపిస్తుంది. అక్కడ విస్తారంగా చెప్పిన శ్లోకాలలో కృష్ణుని బోధనల సారం 'ఫలానా వారు ఇష్టులని' ఆ సుశ్లోకాలలోనే, భగవద్గీతను ముగిస్తూ కృష్ణుడు అర్జునుడు తనకు 'ఇష్టుడ'ని చెబుతాడు. అదే విధంగా గీతా రహస్యాన్ని ప్రచారం చేసే భక్తుడు తనకు 'ఇష్టుడని' కృష్ణుడంటాడు.[6] తనకెవరూ ఇష్టులూ, అయిష్టులు లేరని-చెప్పే కృష్ణుని మాటలకీ, ఆయనే 16 వ అధ్యాయం, 18వ శ్లోకంలో చెప్పిన దానికి తరువాత చెప్పిన శ్లోకాలకీ మధ్య పొంతన ఎలా పొసగుతుంది? 'రాక్షసుల'ను వర్ణిస్తున్నప్పుడు వారి గురించి ఏమాత్రం వినసొంపైన మాటల్లో చెప్పడం జరగలేదు. ఒకవైపున ఖచ్చితంగా చెబుతున్నాడు - 'అలాంటి వారిని నేను నరకరూపంలోకి విసిరేస్తాను. అప్పుడు వారు కష్టాల్లోకి, కడగళ్ళలోకీ, నికృష్టమైన పరిస్థితుల్లోకి వెళ్ళిపోతారు' అని. ఈ వ్యక్తులు కృష్ణునికీ 'ప్రియులూ, అప్రియులూ కానివారి' కోవలోకి రాలేకపోయారు. నా దృష్టిలో ఇవన్నీ గీతలో ఉన్న వాస్తవమైన అసంగతాలూ, అసంబద్ధాలూ. అయితే, యివేవీ వివరించలేని అంశాలేమీ కావు. ప్రొఫెసర్ మాక్స్ ముల్లర్ చెప్పినట్లు, ఇవి ఒక సమగ్ర, సునిర్మిత తాత్విక వ్యవస్థను వివరించే మేధనుకాక, సత్యంపై ఊహాగానాలూ చేసే మానసిక స్థితిని వ్యక్తం చేస్తున్నాయి. అసలు ఇటువంటి అసంగతాలు చోటుచేసుకున్నట్టు గీతారచయితకు తెలిసినట్టే లేదు. వివిధ భాగాల సందర్భాలను గమనిస్తే, చర్చిస్తున్న ప్రత్యేకాంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ అక్కడో అర్ధసత్యం, ఇక్కడో అర్ధసత్యం వెల్లడిస్తున్నట్టు అనిపిస్తుంది; పొంతనలేనట్టు స్పష్టంగా తెలిసిపోతున్న ఈ అరకొర సత్యాలను

ఒక సమగ్ర సత్యంగా అనుసంధానం చేసి, తద్వారా అసంగతాలను తొలగించాలనే ప్రయత్నమే జరగలేదు''.

గీత మీద ఇంత దాకా చెప్పినని ఆధునిక పండితులనబడే వారి భావాలు. ఇక సనాతన పండితుల అభిప్రాయాలను పరికిస్తే, వారిలో కూడా వివిధ అభిప్రాయాలు కనిపిస్తాయి. 'భగవద్గీత ఒక ప్రత్యేక పక్షానికి చెందిన గ్రంథం కాద'న్నది ఒక అభిప్రాయం. అది (1) కర్మమార్గాన్నీ, (2) భక్తిమార్గాన్నీ, (3) జ్ఞానమార్గాన్నీ సమానంగా గౌరవిస్తుంది. మోక్ష సాధనకు ఈ మూడూ సమర్థమైనవని భావిస్తుందనీ చెప్పే పండితులు గీతలోని 18 అధ్యాయాలనూ నిదర్శనంగా చూపిస్తారు. మొదటి ఆరు అధ్యాయాల్లూ జ్ఞానమార్గాలన్నీ, ఏడు నుంచి పన్నెండు అధ్యాయాల దాకా కర్మమార్గన్నీ, పన్నెండు నుండి పద్దెనిమిది అధ్యాయాలు భక్తిమార్తన్నీ బోధిస్తాయని, మూడు మోక్ష పద్ధతులనూ ఉన్నతంగా చూపిస్తుందనడానికి ఇదే నిదర్శనమనీ వారు అంటారు.

పై పండితుల అభిప్రాయానికి భిన్నమైనది శంకరాచార్య, తిలక్‌ల అభిప్రాయం. ఈ ఇద్దరూ సాంప్రదాయ రచయితల కోవలోకి వచ్చేవారు. మోక్షానికి జ్ఞానమార్గమే ఏకైక సత్యమార్గమని శంకరాచార్యులు భావిస్తారు. తిలక్[7] ఇతర పండితుల ఏ అభిప్రాయాన్నీ ఆమోదించరు. గీత అనేక అసంగాల పుట్ట అనే అభిప్రాయాన్ని ఆయన తిరస్కరిస్తారు. భగవద్గీత మూడు మోక్ష మార్గాలనీ గుర్తిస్తుందన్న పండితుల అభిప్రాయాన్ని ఆయన ఒప్పుకోరు. శంకచార్యుని వలెనే ఆయన కూడా గీత ఒక ప్రత్యేక సిద్ధాంతాన్ని బోధిస్తుందని నొక్కి చెబుతాడు. అయితే తిలక్ దృష్టిలో గీత శంకరాచార్యుడు చెప్పినట్టు జ్ఞానమార్గన్ని కాక కర్మ మార్గాన్ని బోధిస్తుంది.

భగవద్గీత బోధించే సందేశం గురించిన వివిధ అభిప్రాయాలుండడం అత్యాశ్చర్యకరం. పండితుల మధ్య ఇంత భిన్నాభిప్రాయం ఎందుకుందని అడగవలసి వస్తుంది. ధమ్మ పదం వలె భగవత్‌గీత కూడా ఒక మత ప్రముఖ గ్రంథంగా భావించి వారు దానిలోని సందేశాన్ని అన్వేషించే ప్రయత్నం చేశారు. నా అభిప్రాయంలో దాన్ని ప్రమాణ గ్రంథంగా భావించడమే పొరపాటు.

భగవద్గీత పరమ ప్రామాణిక గ్రంథం కాదు కాబట్టి, అందులో గ్రహించాల్సిన సందేశమేమీ లేదు. సందేశం కోసం వెతుకులాట వృధా ప్రయాసే అవుతుంది. అయితే గీత పరమ ప్రామాణికం కానప్పుడు మరి దానిలో ఉన్నదేమిటి ? అనే ప్రశ్న పుట్టవచ్చు. దానికి సమాధానం - భగవద్గీత ఒక మత గ్రంథమూ కాదు. ఒక తాత్విక సిద్ధాంతాన్ని ప్రబోధించే చిన్న పుస్తకమూ కాదు. తాత్విక ఆధారాలతో అనుల్లంఘనీయమైన కొన్ని మత సూత్రాలను (Dogmas) సమర్థించుకోవడం మాత్రమే గీత చేస్తున్న పని. ఆ

కారణంగా ఎవరయినా దాన్ని మత గ్రంథమని గానీ, తత్వశాస్త్ర గ్రంథమని గాని పిలవదల్చుకుంటే, అలాగే పిల్చుకుంటూ నిరభ్యంతరంగా వారికి వారే సంతోషపడవచ్చు. నిజానికి గీత ఆ రెండింటిలో ఏదీ కాదు. మతాన్ని సమర్థించడానికి గీత తాత్వికతను ఆసరాగా తీసుకుంటుంది. ఇలా నేను అభిప్రాయ ప్రకటన చేసినంత మాత్రాన నా ప్రత్యర్థులు తృప్తిపడరు. నా పరిశోధనాంశాన్ని సహేతుకమైన దృష్టాంతాలతో రుజువు చేయమని వారు నన్ను కోరతారు. అయితే అదేమంత కష్టమైన పనికాదు. నిజానికి అది చాలా సులువైన పని.

మొట్టమొదటిసారి భగద్గీత చదవగానే కనిపించేది యుద్ధ సమర్ధన. ఆస్తుల కోసం మనుషుల్ని చంపడం, అందుకోసమే యుద్ధం చేయవలసి రావడం తనకు ఇష్టం లేనిపని అని అర్జునుడు తన వ్యతిరేకతను ప్రకటిస్తాడు కూడా. కానీ యుద్ధం చేయడాన్ని, అందుకోసం మనుషుల్ని చంపడాన్ని తన తాత్విక ధోరణిలో సమర్థిస్తాడు కృష్ణుడు. ఇలా యుద్ధాన్ని సమర్థించడం 2వ అధ్యాయంలో 11 నుండి 28వరకూ వున్న శ్లోకాల్లో కనిపిస్తుంది. గీతలో ఈ తాత్విక సమర్థన రెండు రకాలైన వాదనతో కొనసాగుతుంది. మొదటి వాదన ఏమిటంటే ప్రపంచంలో సర్వమూ నాశనమయ్యేదే; మనుష్యుడు కూడా మరణించేవాడేనని సర్వమూ అంతం కాక తప్పదు. జీవికి చావు తప్పదు. అందుచేత మనిషి సహజంగా మరణిస్తాడా ? లేక మరొకరి చేత చంపబడతాడా ? అన్న విచికిత్స ఎందుకు కలగాలి? జీవితం అశాశ్వతం. కన్నీరు కార్చడం దేనికి ? చావు తప్పనపుడు? అది ఎలా జరిగితే మాత్రం కలత దేనికి ? యుద్ధాన్ని సమర్థిస్తూ చెప్పిన రెండో వాదం - శరీరమూ ఆత్మ ఒకటేననుకోవడం పొరపాటు. అవి రెండూ వేరు. ఆ రెండూ వేర్వేరు మాత్రమే కాదు, శరీరం నశిస్తుంది, ఆత్మ శాశ్వతమూ, నాశనరహితమూ. మరణం సంభవించినప్పుడు మరణించేది శరీరమే, ఆత్మకు మరణం లేదు. ఈ ఆత్మను ఏ ఆయుధమూ ఛేదింపలేదు. అగ్ని దహించలేదు. గాలి ఎండబెట్టలేదు. మనిషి చనిపోయాడంటే అతని ఆత్మ మరణించిందనుకోవడం తప్పు. అతని శరీరమే చనిపోతుంది. చినిగిపోయిన పాత బట్టల్ని విడిచేసి మనిషి కొత్తబట్టలు వేసుకున్నట్టుగా ఆత్మ పాత శరీరాన్ని వదలి కొత్త శరీరాన్ని ఆశ్రయిస్తుంది. ఆత్మ ఎన్నటికీ చంపబడదు కాబట్టి మనిషిని చంపడం అనేది, ఆందోళన కలిగించే విషయం కానేకాదు. అందువల్ల యుద్ధాలూ, చంపడాలూ, అనేవి శోకాన్ని గానీ, సిగ్గునిగానీ, పశ్చాత్తాపాన్ని గానీ కలిగించేవి కాదు. ఇలా సాగింది భగవద్గీతలో వాదన.

భగవద్గీత తాత్విక సమర్ధన ఇవ్వజూపిన మరో మత సూత్రం చాతుర్వర్ణ్య సిద్ధాంతం. భగవంతుడే మనుషులను నాలుగు వర్ణాలుగా విభజించాడనీ, అందువల్ల ఆ విభజన పవిత్రమైనదనీ భగద్గీత నిస్సందేహంగా పేర్కొంటుంది. అయితే చాతుర్వర్ణ్యం చెల్లుబాటు

ఆ పవిత్రతపైనే ఆధారపడిలేదు. చాతుర్వర్ణ్య సిద్ధాంతాన్ని స్వాభావిక గుణాలతో అనుసంధించడం ద్వారా తాత్విక పునాదిని గీత కల్పిస్తుంది. మనిషి వర్ణ నిర్ధారణ విచక్షణారహితంగా జరిగేది కాదనీ, స్వాభావిక అంతర్గత గుణాలపై ఆధారపడి జరిగిందనీ భగవద్గీత చెబుతుంది.[8]

భగవద్గీత తాత్వికంగా సమర్థించే మూడో మతసూత్రం కర్మమార్గం. కర్మమార్గం అంటే భగవద్గీత అర్థం - యజ్ఞాల వంటి కర్మలను మోక్షమార్గంగా అనుసరించడం. గీత అంతటా కర్మమార్గాన్ని ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం, ఆకాశానికెత్తడం జరిగింది. కర్మయోగం చుట్టూ పేరుకుపోయిన వికృతాలను తొలగించడం ద్వారా దాన్ని సమర్థించే ప్రయత్నం గీత చేసింది. కర్మయోగంపైన చేరిన మొదటి వ్రణం గుడ్డి నమ్మకం. కర్మయోగానికి 'బుద్ధియోగాన్ని'[9] అత్యవసర షరతుగా చేయడం ద్వారా గీత అంధ విశ్వాసాన్ని తొలగించే ప్రయత్నం చేసింది. స్థిత ప్రజ్ఞత్వం అలవడితే కర్మకాండలను అనుసరించడంలో ఏదోషమూ వుండదని చెప్పింది. కర్మకాండలపై పెరిగిన మరో వికృతత్వం కర్మలనుభవించడానికి ప్రేరేపించే స్వార్థం. కర్మ[10] ఫలితాలపై అనాసక్తి స్థితప్రజ్ఞత్వం అలవడి, కర్మ ఫలితంపై అనాసక్తితో ఉన్నప్పుడు కర్మకాండలో తప్పేముంది ? గీత కర్మమార్గాన్ని సమర్థించే ధోరణి ఇది[11]. మరికొన్ని మత పవిత్ర సూత్రాలను తీసుకొని గీత వాటిని ఎలా తాత్వికంగా ఎలా తాత్వికంగా సమర్థించిందో చెప్పవచ్చుకానీ, భగవద్గీతపై ఓ గ్రంథం రాయదలచుకున్నవారు ఆ పని చేయాలి. ప్రాచీన భారత సాహిత్యంలో భగవద్గీత స్థానాన్ని నిర్ధారించే ప్రధాన ప్రయోజనంతో రాస్తున్న ఈ అధ్యాయం పరిధికి మించిన పని అది. అందువల్ల నేను నా ప్రతిపాదనను సోదాహరణం చేయడం కోసం కొన్ని ముఖ్య మత పవిత్ర సూత్రాలను మాత్రమే ఎంచుకున్నాను.

నా ప్రతిపాదనకు సంబంధించి రెండు ప్రశ్నలు ఖచ్చితంగా తలెత్తుతాయి. భగవద్గీత తాత్విక సమర్థన ఇవ్వజూపిన ఈ మత సూత్రాలు ఎవరివి? గీత వాటినెందుకు సమర్థించవలసి వచ్చింది ?

మొదటి ప్రశ్నకు సమాధానం - గీత సమర్థన ఇవ్వజూపిన ఈ మత సూత్రాలు ప్రతి విప్లవానివి. జైమిని పూర్వ మీమాంస అనబడే ప్రతివిప్లవ పవిత్ర గంథంలోనివి. దీన్ని అంగీకరించడానికి ఏ ఇబ్బందీ ఉండనక్కరలేదు. ఉంటే గింటే 'కర్మయోగం'కు ఆపాదించిన తప్పుడు అర్థం కారణంగానే చాలామంది గీతా భాష్యకారులు 'కర్మయోగ'ను క్రియగానూ, 'జ్ఞానయోగాన్ని' జ్ఞానంగానూ అనువదించుకుని, భగవద్గీత జ్ఞానానికి క్రియకీ సారూప్య వైరుధ్యాల సాధారణ వివేచన చేసిందన్నట్లు చర్చిస్తూ పోయారు.

ఇది శుద్ధ తప్పు. 'జ్ఞానమా? లేక కర్మా?' వంటి సాధారణ, తాత్విక చర్చతో

గీతకు సంబంధం లేదు. వాస్తవానికి గీత నిర్దిష్ట (Particular) అంశాలకు సంబంధించిందే తప్ప, సాధారణ (General) అంశాలకు కాదు. కర్మయోగం అంటే గీత చెప్పే అర్థం ఏమిటంటే - జైమిని కర్మకాండలలోని విశ్వాసాలూ; అలాగే జ్ఞానయోగం లేదా జ్ఞానం అంటే బాదరాయణ బ్రహ్మ సూత్రాలతో ఉన్న మత విశ్వాసాలు. గీత చెబుతున్న కర్మ సాధారణ పరిభాషలోని క్రియాశీలతో, నిష్క్రియాపరతో కాదని, శాంతివాదమో శక్తివాదమో (quieticism or energism) కాదని; అది మత కర్మను వాటి ఆచరణను పేర్కొంటున్నదని గీతను చదివిన వారెవరూ కాదనలేరు. అతి స్వల్ప విషయాల్లో తలెత్తిన వివాదం మీద తయారుచేసిన పార్టీ కరపత్రాన్ని, ఉన్నతమైన తాత్విక అంశాలతో కూడిన ఒక సిద్ధాంత గ్రంథంగా రూపొందించినట్లు; కర్మ, జ్ఞానం - అనే పదాలకు అర్థాలను ఉన్నతీకరించి తెచ్చారు. తొలుత సాధారణార్థంలోకి దేశభక్తుల ఈ పన్నుగడకి, తిలక్‌నే ఎక్కువగా నిందించాలి. ఫలితంగా - భగవద్గీత ఒక సర్వ స్వతంత్ర స్వయం సంపూర్ణ గ్రంథమని, అంతకు ముందున్న సాహిత్యంలో దానికెటువంటి సంబంధమూ లేదనీ నమ్మేటట్లు ఆ తప్పుడు అర్థాన్నే నమ్మాలనుకుంటే, గీతలోని కర్మయోగం జైమిని చెప్పిన కర్మకాండలోని మత సూత్ర సంపుటే తప్ప మరొకటి కాదని, జైమిని చెప్పినవాటినే మెరుగుపరచి దృఢపరచాలని గీత ప్రయత్నించిందని ఒప్పుకోవాలి.

ఇక రెండవ ప్రశ్నకు వద్దాం. ప్రతి విప్లవపు మత సూత్రసంపుటిని భగవద్గీత ఎందుకు సమర్థించవలసి వచ్చింది ? దీనికి సమాధానం నాకు స్పష్టంగానే ఉంది. బౌద్ధం దాడి నుండి వాటిని రక్షించడానికి భగవద్గీత అవతరించింది. బుద్ధుడు అహింసాతత్వాన్ని బోధించాడు. ఆయన బోధించడమే కాదు. బ్రాహ్మణులు తప్ప, జనావళి అంతా ఆయన బోధనను ఒక జీవిత విధానంగా అంగీకరించింది. వారు హింసాతత్వం మీద వైముఖ్యం ఏర్పరచుకున్నారు. బుద్ధుడు చాతుర్వర్ణ్యానికి వ్యతిరేకంగా ప్రబోధించాడు. చాతుర్వర్ణ్య సిద్ధాంతంపై దాడిచేస్తూ ఆయన కొన్ని తీవ్రాతి తీవ్రమైన ఉపమానాలను ప్రయోగించాడు. చాతుర్వర్ణ్యం చట్రం విరిగిపోయింది. చాతుర్వర్ణ్య వ్యవస్థ తలకిందులైంది. శూద్రులు, స్త్రీలు సన్యాసులు కాగలిగారు. ఆ హోదానే ప్రతివిప్లవం శూద్రులకు, స్త్రీలకు నిరాకరించింది. బుద్ధుడు కర్మకాండను, యజ్ఞాలను ఖండించాడు. హింసాత్మకమైనవన్న కారణంతో ఆయన వాటిని ఖండించాడు. స్వార్థ ప్రతిఫలాపేక్ష ఉన్నందున కూడా ఆయన యజ్ఞాన్ని కర్మలను వ్యతిరేకించాడు. ఈ దాడికి ప్రతి విప్లవకారుల జవాబు ఏమిటి? ఇదొక్కటే - ఇవన్నీ వేదశాసనాలు, వేదాలు అనుల్లంఘనీయమైనవి కాబట్టి మత సూత్రాలను ప్రశ్నించరాదు. భారత దేశ చరిత్రలో అత్యంత జ్ఞానవంతమైన, హేతువాదకాలమైన బౌద్ధయుగంలో ఇటువంటి నిరంకుశ, నిర్హేతుక, అవివేక పునాదులపై నిలబడిన మత సూత్రాలు నిలబడడం అసాధ్యం. అహింసా సిద్ధాంతాన్ని ప్రజలు నమ్మడమే కాకుండా,

దాన్ని జీవన సూత్రంగా తీర్చిదిద్దుకున్నారు. చంపడం క్షత్రియ విధి అని వేదం చెప్పింది కాబట్టి, ఏ పాపమూ అంటకుండా క్షత్రియుడు హత్య చేయవచ్చునన్న సూత్రాన్ని వారు ఎలా అంగీకరించగలరు ? సాంఘిక సమానత్వ ప్రభోధాన్ని ఆమోదించిన ప్రజలు, వ్యక్తి యోగ్యతల ఆధారంగా సమాజ పునర్ నిర్మాణం చేస్తున్న ప్రజలు - చాతుర్వర్ణ్య శ్రేణీయ సిద్ధాంతాన్ని పుట్టుక ఆధారంగా మనుషులను వేరుచేయడాన్ని వేదాలు చెప్పాయన్న మాత్రాన ఎలా అంగీకరించగలరు? సమాజంలోని దుఃఖానికంతటికీ తృష్ణ లేక లోభమే కారణమన్న బుద్ధుని సిద్ధాంతాన్ని, అంగీకరించిన ప్రజలు యజ్ఞాలు చేసి వరాలు పొందమని పనిగట్టుకుని పిలిచే మతాన్ని - దాని వెనుక వేదాధికారం ఉన్నంత మాత్రాన - వారెలా ఆమోదించలగలరు? బౌద్ధం చేసిన తీవ్రమైన దాడికి జైమిని ప్రతివిప్లవ సూత్రాలు వేళ్ళు కదిలిపోయావనడంలో భగవద్గీత నుంచి దొరికిన మద్దతు కనుక లభించకపోయి ఉంటే అవి కుప్పకూలి పోయేవనడంలో సందేహం లేదు. ప్రవివిప్లవ సూత్రాలకు భగవద్గీత అందించిన తాత్విక సమర్థన ఏరకంగానూ దృఢమైనది కాదు. క్షత్రియుని హసనవిధికి భగవద్గీత ఇచ్చిన తాత్విక సమర్థన ఎంత మర్యాదగా చెప్పినా కుర్రతనం వుంది. హతమయ్యేది శరీరమే కానీ ఆత్మ కాదని కాబట్టి హత్య హత్య కాదని చెప్పడం వంటి హత్యా సమర్థన మనమెక్కడా వినం. గీతలోని రోమాంచకారి అయిన సిద్ధాంతాలని కొందరు చెప్పేవాటిలో ఇది కూడా ఒకటి. హత్యానేరంలో ముద్దాయి పక్షాన కృష్ణుడు న్యాయవాదిగా వాదిస్తూ భగవద్గీతలోని వాదాన్ని డిఫెన్సుగా పెడితే అతన్ని పిచ్చాసుపత్రికి పంపడం ఖాయం. చాతుర్వర్ణ్యానికి భగవద్గీత ఇచ్చిన సమర్థన కూడా అంతే కుర్రతనంగా వుంటుంది. కృష్ణుడు దాన్ని సాంఖ్యలోని గుణ సిద్ధాంతం ఆధారంగా సమర్థిస్తాడు. కానీ, తద్వారా తానెంత అవివేకానికి లోనయ్యాడో కృష్ణుడు గుర్తించినట్టులేదు. చాతుర్వర్ణ్యంలో వర్ణాలు నాలుగు. సాంఖ్యం ప్రకారం గుణాలు మూడే. మూడు వర్ణాలకు మించి అంగీకరించని తత్వం ఆధారంగా చాతుర్వర్ణ్య వ్యవస్థను ఎలా సమర్థిస్తారు? ప్రతివిప్లవ సూత్రాలను సమర్థించడానికి భగవద్గీత చేసిన యావత్ ప్రయత్నమూ బాల్యచేష్ట. క్షణమైనా సీరియస్ వివేచనకు అది యోగ్యమైనది కాదు. పోతే, గీత సహాయం లేకపోతే ప్రతి విప్లవం దాని మూల సూత్రాలలోలని మూర్ఖత్వం కారణంగా అంతరించిపోయేదనడం కూడా నిస్సందేహమే. విప్లవకారులకు భగవద్గీత నిర్వహించిన పాత్ర కపటంగా కనిపించవచ్చుగానీ, ప్రతి విప్లవానికి అదే కొత్త ఊపిరిపోసింది. ప్రతి విప్లవం నేటికీ సజీవంగా ఉన్నదంటే కారణం, దానికి భగవద్గీత అందించిన తాత్విక సమర్థనలోని పట్టుమాత్రమే. అయితే, భగవద్గీత వేదానికీ, యజ్ఞానికీ వ్యతిరేకమైనదనుకుంటే పెద్దపొరపాటు అవుతుంది. వేదాలకీ, శాస్త్రాల అధికారానికి భగవద్గీత వ్యతిరేకం కాదని గీతలోని ఇతర భాగాల్లో మనకు స్పష్టమవుతుంది. (16వ అధ్యాయం 23, 24; 17వ అధ్యాయం 11, 13, 24). అలాగే యజ్ఞాల పవిత్రతకూ అది వ్యతిరేకం కాదు. (3వ

అధ్యాయం 9-15) ఆ రెంటి ఘనతనూ అది గుర్తిస్తుంది. కాబట్టి, జైమిని పూర్వ మీమాసంకూ, భగవద్గీతకూ తేదా ఏమీ లేదు. ఒకవేళ తేడా ఏమైనా వున్నదంటే-అది-జైమిని పూర్వమీమాంస కన్న భగవద్గీత దృఢమైన మద్దతు ఇవ్వడం. దృఢమైన దెందుకంటే ప్రతి విప్లవ సిద్ధాంతాలకు గతంలో లేని తాత్విక ప్రాతిపదికను, తద్వారా ఒక శాశ్వత ప్రాతిపదికను గీత ఇవ్వాలనుకుంది. జైమిని పూర్వమీమాంసకన్న దృఢమైన మద్దతు ప్రతివిప్లవ ప్రధాన సిద్ధాంతమైన చాతుర్వర్ణ్యానికి గీత ఇచ్చిన తాత్విక సమర్థనలో ఉంది. చాతుర్వర్ణ్యాన్ని రక్షించడం, దాని అమలును సాధించడం - ఇదే భగవద్గీత యొక్క అసలు స్వరూపం. చాతుర్వర్ణ్యం గుణకర్మ విభజన మీద ఆధారపడి ఉందని చెప్పిన కృష్ణుడు, అక్కడితో ఆగిపోలేదు. ఇంకా ముందుకెళ్ళి, రెండు ఆజ్ఞలు కూడా జారీ చేశాడు. మొదటి ఆజ్ఞ 3వ అధ్యాయం 26వ శ్లోకంలో ఉంది. జ్ఞాని అయినవాడు చాతుర్వర్ణ్య నియమానుసరణంతో సహా కర్మకాండను ఆచరించే అజ్ఞానుల మనసుల్లో సందేహ బీజాలను నాటకూడదు. దానినే ఇంకా కొంచెం వివరంగా చెప్పాలంటే-కర్మకాండ సిద్ధాంతం మీద, దానిలోని అంశాలమీద తిరుగుబాటు చేసే విధంగా వ్యక్తుల్ని ప్రోత్సహించకూడదు. రెండో ఆజ్ఞ 18వ అధ్యాయంలో 41-48 శ్లోకాలలో వుంది. ఎవరి వర్ణానికి నిర్దేశించిన విధులను వారు చేయాలి. ఇతర విధులు చేయరాదు మనిషి కేవలం తనని కొలచినంత మాత్రాన అతనికి ముక్తి లభించదు. భక్తితోపాటు, నిర్దేశించిన కర్మలకు సంబంధించిన విధులను భక్తుడు ఆచరించడం ద్వారా మాత్రమే అతనికి విముక్తి కలుగుతుంది. సూక్ష్మంగా చెప్పాలంటే, భక్తుడయిన శూద్రుడు ఎంత గొప్పవాడైనా, తన వర్ణానికి నిర్దేశించిన కర్మని అతిక్రమిస్తే అతనికి విముక్తి లభించదు. అంటే శూద్రుడు ఎంత గొప్పవాడైనా, తన వర్ణానికి నిర్దేశించిన కర్మని అతిక్రమిస్తే అతనికి విముక్తి లభించదు. అంటే శూద్రుడు ఉన్నత కులాల వారికి సేవలు చేస్తూనే బ్రతకాలి. ఆ సేవలోనే కన్ను మూయాలి. నా ప్రతిపాదనలోని రెండో అంశం ఏమిటంటే - జైమిని పూర్వమీమాంసలోని సిద్ధాంతాలకు కొత్త సమర్థనలు ఇవ్వడమే గీత ప్రధాన ఉద్దేశం. గీతలోని ఆ భాగాల మేరకైనా పూర్వమీమాంస ప్రకటితమైన తరవాత రాయబడినది. ఇక మూడో అంశం బౌద్ధంలోని విప్లవాత్మక, హేతువాద ఆలోచనల కారణంగానే ప్రతి విప్లవ సిద్ధాంతాలకు భగవద్గీత తాత్విక సమర్థన కల్పించడం అవసరమైంది.

ఇపుడు నా సిద్ధాంత వ్యాస సవ్యత మీద ఉత్పన్నం కాబోయే ఆక్షేపణలపై నా దృష్టిని సారిస్తాను. బౌద్ధమతం, జైమినీ పూర్వ మీమాంస. ఈ రెండింటి తర్వాతే భగవద్గీత అవిర్భవించిందన్న నా వూహకి ఆధారం లేదంటారు. ఎంతో మంది భారతీయ పండితులు వెలిబుచ్చిన అభిప్రాయాలకు నా సిద్ధాంతం వ్యతిరేకంగా ఉంటుందని నాకు తెలుసు. అయితే ఆ పండితులంతా బౌద్ధమతం, జైమిని పూర్వ మీమాంసల కంటే

కూడా ఎంతో ముందుగా భగవద్గీత పుట్టిందని చెప్పడానికి ప్రయత్నం చేస్తున్నారు. మానవ జీవితాన్ని తీర్చిదిద్దడానికి, భగవద్గీత అందించిన సందేశం ఏమిటి ? అన్నది వారికి అప్రస్తుతం. ప్రత్యేకించి తెలంగ్, తిలక్‌ల ఆలోచనా పరళిగూడా యిదే.

ప్రొఫెసర్ గార్బ్[12] యిలా వ్యాఖ్యానించారు : ''ఎంత జ్ఞాని అయినా సరే ప్రతి హిందువుకీ ఉన్నట్టే - తెలంగ్‌కు కూడా భగవద్గీత అత్యంత పౌరాతనత్వం మీద విశ్వాశం వున్నది. అటువంటివి బలంగా ఉన్నప్పుడు బలమైన విమర్శ అంతరిస్తుంది''.

గార్బ్ మాటల్లో :''గీతావిర్భావానికి ఒక తేదీ నిర్ణయించడం చాలా కష్టమని ఈ సమస్యను పరిష్కరించాలని ప్రయత్నించిన ప్రతివారూ గుర్తించారు. భగవద్గీత మూలప్రతి కాలాన్నీ, దాని సవరణల కాలాన్నీ రెంటినీ నిర్ణయించాలంటే సమస్య మరింత పెరుగుతుంది. ఈ విషయంలో ఖచ్చితమైన నిర్ధారణలకు మనం రాలేమని, చూచాయగా మాత్రమే చెప్పగలమనీ నేను భావిస్తున్నాను.''

ఏమిటా ఉజ్జాయింపు తేదీలు? అవి నా ప్రతిపాదనకు అనుకూలంగానే ఉన్నాయి. వ్యతిరేకంగా ఏమీ కనబడలేదు. బౌద్ధమతం, జైమిని పూర్వ మీమాంస తర్వాతనే, గీత వచ్చిందన్న నా వాదనకు గీతలోనుంచే ప్రత్యక్ష ఆధారాలు చూపగలను.

మూడో అధ్యాయం, 9-13 శ్లోకాలకు ఒక ప్రత్యేకత ఉంది. గీతలో జైమిని పేరుగాని, ఆయన మీమాంస గురించిగాని, ఎక్కడా ప్రస్తావన లేకపోవడం నిజమే. కానీ 3వ అధ్యాయం 9-18 శ్లోకాలను గమనిస్తే జైమిని పూర్వ మీ మాంసలో కూర్చిన సిద్ధాంతాలను గీతలో పరిశీలించడం జరిగిందని అంగీకరించక తప్పలేదు. ఈ వాదనని మరోరకంగా చెప్పవచ్చు. జైమిని స్వచ్ఛమైన సామాన్యమైన కర్మయోగాన్ని బోధించాడు. భగవద్గీత కూడా అనాశక్తి కర్మ గురించి బోధిస్తుంది. కర్మయోగాన్ని గీత సవరించడమే గాకుండా, స్వచ్ఛమైన సాధారణ కర్మయోగం మీద తీవ్రమైన పదజాలంతో దాడి చేసింది గూడ.[14] ఒకవేళ గీతే గనక జైమినికంటె ముందుపుట్టి ఉంటుందనుకుంటే గీతకారుడు చేసిన విమర్శకు జైమిని జవాబు చెప్పి ఉండేవాడు కదా! కానీ గీతలో చెప్పిన అనాసక్తియోగం గురించి జైమిని ఎక్కడా ప్రస్తావించలేదు. ఎందుచేత? దీనికి జవాబు గీతలో జరిగిన సవరణ జైమిని తర్వాతనే వచ్చిందిగాని ముందుగా మాత్రం కాదు అని అనిపిస్తుంది. అంటే జైమిని పూర్వ మీమాంస తరువాతే భగవద్గీత రూపొందింది.

జైమిని పూర్వమీమాంస గురించి గీత సూటిగా ప్రస్తావించకపోయినా బాదరాయణ బ్రహ్మ సూత్రాల గురించి [15] మాత్రం ప్రస్తావించింది. ఈ విధంగా గీతలో బ్రహ్మసూత్రాల ప్రస్తావన తేవడం చాలా ముఖ్యమైన అంశం. ఎందుకంటే బ్రహ్మసూత్రాల తర్వాతనే గీత వచ్చిందన్న విషయానికి అది ప్రత్యక్ష తార్కాణం

బ్రహ్మసూత్రాల పేరుతో మనకు లభ్యమవుతున్న వాటినే ప్రస్తావించడం జరిగిందని తిలక్[6] అంగీకరిస్తారు. కానీ, ఈ విషయంపై తెలంగ్[17] యథాలాపంగా చర్చిస్తూ భగవద్గీతలో చెప్పిన ''బ్రహ్మసూత్రాలు'', ప్రస్తుతం ఆ పేరుతో లభ్యమవుతున్నవి వేర్వేరు అన్నారు. ఆ అసాధారణ అభిప్రాయానికి ఆయన ఆధారాలనేమీ ఇవ్వలేదు. భారతీయ సాహిత్యంపై వెబర్ [18] రాసిన గ్రంథంలో ఇచ్చిన అథఃజ్ఞాపిక లోని ఊహాగానాన్ని మాత్రం తెలంగ్ పేర్కొన్నాడు. భగవద్గీతలో చెప్పిన బ్రహ్మసూత్రాలు ''ఒక నిర్దిష్ట గ్రంథ నామంగా కాక, స్థూల నామంగా ప్రస్తావితమైనవి కావచ్చు''ని వెబర్ ఆ అథోజ్ఞాపికలో అన్నారు. ఈ విషయంలో తెలంగ్ వైఖరికి ఆయనకు ఏదో ఉద్దేశ్యాలు అంటగట్టడం న్యాయం కాదు. బ్రహ్మసూత్రాల సంపుటీకరణ కాలాన్ని క్రీస్తు శకం 500గా వింటర్‌నిజ్ ఆధారంతో వెబర్ నిర్ధారించడం తెలిసి కూడా తెలంగ్[19] గీతలో బ్రహ్మసూత్రాల ప్రస్తావన గురించి అంగీకరించడానికి సిద్ధపడలేకపోయారని చెప్పడంలో అన్యాయం ఏమీలేదు. వెబర్ నిర్ధారణను గుర్తించితే తెలంగ్ భగవద్గీత పౌరతన్య సిద్ధాంతం నిలబడేది కాదు. కాబట్టి - జైమిని పూర్వ మీమాంస కంటె, బాదరాయణ బ్రహ్మసూత్రాల కంటె తరువాతి కాలంలో గీత రూపొందిందనడానికి తగిన అంతర్గత సాక్ష్యం వుంది.

భగవద్గీత బౌద్ధం కంటె ముందే వచ్చిందా? ఈ ప్రశ్నను తెలంగ్ వేశారు.

''మనమిప్పుడు మరో అంశాన్ని చూద్దాం. శాక్యముని మహత్తర సంస్కరణ విషయంలో గీత వైఖరి ఏమిటి ? ఈ ప్రశ్న అత్యంత ఆసక్తికరమైనది. మరీ ముఖ్యంగా - మా అనువాదంలోని అధోజ్ఞాపికలలో బౌద్ధ సిద్ధాంతాలకు, గీతా సిద్ధాంతాలకూ చూపించిన గమనార్హమైన పోలికల రీత్యా ఈ ప్రశ్న ఆసక్తిదాయకమైనది. అయితే, ఈ ప్రశ్నకు సమాధానమివ్వడానికి అవసరమైన సామాగ్రి దొరకకపోవడం విచారకరం. నిజానికి, ప్రొఫెసర్ విల్సన్ గీతలో బౌద్ధం ప్రస్తావన ఉందని భావించారు.[20] కానీ, ఆయన అభిప్రాయం బౌద్ధులకు, చార్వాకులకు, భౌతికవాదులకు మధ్య గందరగోళపడడం నుంచి ఏర్పడింది.[21] ఆ ప్రస్తావన లోపంవల్ల, గీతలో బౌద్ధం ప్రస్తావన లేకపోవడం పై ఆధారపడి అసంతృప్తికర ప్రతికూలవాదన తప్ప ఖచ్చితమైనదేదీ మనకు కనిపించదు. గీతలోని కొంత భాగానికీ ఉమ్మడి భూమిక ఉన్నదని నేను ఇతరత్రా సూచించాను.[22] అనేకమంది పూర్వీక సిద్ధాంతకర్తలు గీతలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రస్తావించబడ్డారు. అయినప్పటికీ ఆ వాదన నాకు సంతృప్తికరంగా లేదు. అయితే, ఈ సమస్యకు సంబంధించిన వాస్తవాలపైని ఒక దృక్పథంతో, ఇక్కడ ప్రస్తావిస్తున్న 'ప్రతికూల వాదన' ద్వారా సాధించే నిర్ధారణలు సరిపోల్చుతున్నట్లు నాకు తోస్తున్నది. బ్రాహ్మణమతంపై బుద్ధుని విరసన వేదాల వాస్తవాధికారం, కులభేదాల వాస్తవ దృష్టి అనే ప్రధానాంశాలపై ఆధారపడినట్లుంది. పురాతన బ్రాహ్మణ మతంలోని ఒక్క ముఖాన్ని మినహాయిస్తే సిద్ధాంత రూపకల్పనలోని

ప్రధానాంశాలలో బౌద్ధం భిన్నమైనదికాదు.[23] కావలిస్తే, మేము సూచించిన అనేక ఉమ్మడి అంశాలను చూడవచ్చు. సరే; ఈ రెండు అంశాల విషయంలోను బుద్ధుడు వెళ్ళినంత దూరం వెళ్ళకపోయినప్పటికీ గీత తన రూపకల్పన కాలం నాటి అభిప్రాయాలకు నిరసననే మూర్తీభవించింది. బౌద్ధంవలె గీత వేదాలను పూర్తిగా తిరస్కరించదు, వాటిని పక్కకు నెడుతుంది. అది కులానికి తక్కువ అసమర్థనీయ ప్రాతిపదికను కల్పించింది. ఈ వాస్తవాల సహేతుక సిద్ధాంతంగా ఈ రెండు ప్రతిపాదనలలో ఒకటి నిలబడింది. సమకాలీన మతం కేంద్రాన్ని కుదిపివేసిన ఆధ్యాత్మిక సంచలనం విషయంలో గీత, బౌద్ధం రెండూ బాహ్యంగా ఒకేరకంగా ఉన్నాయి. గీత ప్రారంభమైనది, సంచలనశీలం విషయంలో తక్కువ స్థాయిలో వుంది. రెండో ప్రతిపాదన : బ్రాహ్మణ మతంలోని బలహీన అంగాల విసర్జన జరుగుతుంది కాబట్టి, అత్యంత బలహీనమైన అంశాల ఆధారంగా బ్రాహ్మణమతాన్ని పునరుజ్జీవింపజేయడానికి గీత అవతరించిందని బౌద్ధం చెప్పనారంభించింది. రెండో ప్రత్యామ్నాయ ప్రతిపాదనను నేను ఆమోదించను, ఎందుకంటే ఛాందసవాదే అయినప్పటికీ; అవివేకంగా ఆరాధించబడ్డ దోద్ఘాటనల అధికారాన్ని గీతా రచయిత తగ్గించాడు. ప్రాచీన హైందవ వ్యవస్థపై బలమైన దాడి చేయడంలో రాజీపడిన సూచన గీతలో నాకెక్కడా కనిపించలేదు. అంతేకాదు, ఇలా చేయడం ద్వారా గీతా రచయిత తన పూర్వీకులు ఏంచేశారో, సమకాలీనులు ఏం చేస్తున్నారో దాన్నే చేశాడు. అదేమిటంటే - ముందుకు వచ్చిన ప్రతికూల వాదన ఫలితాలను బలపరిచే యత్నం చేయడం. అత్యున్నత ఆధ్యాత్మిక విషయాలపై జరిగిన ఆలోచనా నీడ ఫలితమే బౌద్ధంగా నాకు స్పష్టమవుతోంది. ఆ క్రీడలోనే తీవ్రతలేనితన ప్రతిఫలనమే ఉపనిషత్తులు, గీత.''[24]

ఈ భాగాన్ని నేను పూర్తిగా ఎందుకు ఉదహరించానంటే అది హిందూ పండితులందరూ చెప్పే మూసపద్ధతిలోనే వుంది కాబట్టి, భగవద్గీత ఏ మేరకయినా, బౌద్ధమతంతో ప్రభావితం అయిందన్న అంశాన్ని అంగీకరించడానికి హిందూ పండితులలో ప్రతివారు విముఖులే. అలాగే గీత బౌద్ధం నుండి ఏదైనా ఎరువు తెచ్చుకున్నదన్న విషయాన్ని ఖండించడానికి వారెప్పుడూ సిద్ధమే. ప్రొఫెసర్ రాధాకృష్ణన్, తిలక్‌ల వైఖరి గూడా ఇదే బౌద్ధ మతానికీ, భగవద్గీతకూ ఎక్కడైనా భావ సాదృశ్యాలున్నట్టయితే, వాటిని అంగీకరించ పోవటం, ప్రతి విప్లవకారుల కుటిల స్వభావం లక్షణం

ఈ అభిప్రాయాలలోని అసంబద్ధత్వం భగవద్గీతనూ, బౌద్ధసూత్రాలను తులనాత్మకంగా అధ్యయనం చేసిన వారికెవరికైనా దిగ్భ్రమ కలిగించకమానవు. గీత సాంఖ్య వేదాంతంతో నిండిదన్నమాటే నిజమయితే బౌద్ధభావాలపుట్ట అన్నది అంతకంటే పచ్చి నిజం.[24] రెండింటి మధ్య ఉన్న సారూప్యత భావాలలోనే కాకుండా, భాషలో గూడా ఉంది కొన్ని దృష్టాంతాల ద్వారా ఇదెంత నిజమో చూడగలం.[25]

భగవద్గీత బ్రహ్మ నిర్వాణం[26] గురించి చర్చిస్తుంది. మనిషి బ్రహ్మతో ఏకం కావడానికి అత్యవసరమైన చర్యలను నిర్దేశిస్తుంది. భగవద్గీత ప్రకారం నిర్వాణం అంటే 1) శ్రద్ధ (తనలో విశ్వాసం) 2) వ్యవసాయం (దృఢ సంకల్పం) 3) స్మృతి (అంతిమ లక్ష్యాన్ని స్మరించుకోవడం) 4) సమాధి (గాఢంగా ధ్యానించడం) 5) ప్రజ్ఞ (అంతర్దృష్టి లేక నిజమైన జ్ఞానం) గీతలోకి ఈ నిర్వాణ సిద్ధాంతం ఎక్కడ నుంచి వచ్చింది? ఉపనిషత్తు గూడా 'నిర్వాణ' అనే పదాన్ని ఎక్కడా ఉపయోగించలేదు. ఈ భావనంతా ప్రత్యేకించి బౌద్ధానికి చెందినది. బౌద్ధంలో నుండే, దీనిని ఎరువు తెచ్చుకోవడం జరిగింది. ఈ విషయంలో ఎవరికయినా ఏమైనా సందేహముంటే, భగవద్గీతలో ఉదహరించిన బ్రహ్మనిర్వాణాన్ని 'మహా పరి-నిబ్బాన సుత్త' (మహాపరి నిర్వాణ సూత్రం) లో గల నిర్వాణం గురించిన బౌద్ధ భావనతో సరిపోల్చి చూచుకోవచ్చు. ఈ భావన, గీతలో చొప్పించిన బ్రహ్మ-నిర్వాణ భావనా ఒకటేనన్న విషయం మనకు అర్థమవుతుంది. నిర్వాణ అన్న పదాన్ని బౌద్ధంలోంచి తస్కరించిన విషయాన్ని దాచిపెట్టడానికే 'నిర్వాణ'కు బదులుగా బ్రహ్మ నిర్వాణ అనే భావనను గీత ఎరువు తెచ్చుకోవడం వాస్తవం కాదా ?

మరో దృష్టాంతం ఇస్తున్నాను. 7వ అధ్యాయం 13-20 శ్లోకాల్లో కృష్ణుడికి ఎవరు ప్రియమైన వారన్న విషయంపై చర్చ ఉంది. '' ఎవరికైతే జ్ఞానముందో వారికీ లేదా, ఎవరైతే కర్మలనాచరిస్తారో వారికి, ఈ రెండూ కాకుంటే ఎవరైతే భక్తితో కొలుస్తారో వారికి?'' కృష్ణుడిలా అంటాడు: 'భక్తుడైతే తనకి ప్రియమైన వా'డని 'కానీ అతనికి భక్తులకుండాల్సిన లక్షణాలు ఉండాలం'టాడు. నిజమైన భక్తుడి శీలం ఎలా వుండాలి? భక్తుడి లక్షణాలను కృష్ణుడిలా చెబుతాడు: ఈ క్రింది అంశాలను అభ్యసించేవారే నిజమైన భక్తులు. 1. మైత్రి (ప్రేమపూర్వకమైన దయ) 2. కరుణ 3. ముదిత (సానుభూతితో కూడిన ఆనందం) 4. ఉపేక్ష అసలైన భక్తుడికి ఉండాల్సిన అర్హతల గురించిన విషయాలను భగవద్గీత ఎక్కడి నుండి సేకరించింది ? మళ్ళీ ఇక్కడ కూడా వాటికాధారం బౌద్ధమతమే. రుజువులు కావాలంటే మానసిక శిక్షణ పొందగోరేవారికి ఏ భావనలు (మనో వైఖరులు) ఉండాలో బుద్ధుడు చెప్పిన మహాపదసుత్త,[27] తెవిజ్జ సుత్త[28] లతో పోల్చి చూడవచ్చు. మొత్తం భావజాలమంతా బౌద్ధం నుంచి తెచ్చుకున్నదేననీ, అది కూడా ముక్కస్యముక్క ఎరువు తెచ్చుకున్నదని తెలుస్తుంది.

మూడవ దృష్టాంతం పరిశీలిద్దాం. భగవద్గీత 13వ అధ్యాయంలో క్షేత్రం - క్షేత్రజ్ఞుడు అనే విషయం చర్చిండటం జరిగింది. ఆ అధ్యాయంలోనే 7 నుండి 11 వరకూ వున్న శ్లోకాల్లో 'ఏది జ్ఞానం? ఏది అజ్ఞానం' అనే విషయాన్ని కృష్ణుడు నిర్దేశించిన విధానం అతని భాషలో ఇది : ''తన్నుతాను పొగడుకొనకుండటం, డంబము లేకుండటం,

పరప్రాణుల్ని హింసింపకపోవటం, లేదా నిరపాయకరతత్వం, క్షమాగుణం, రుజువర్తనం కలిగి ఉండటం, (నిజాయితీ కలిగి వుండటం), గురుసేవ చేయడం, నిర్మలత్వం కలిగి ఉండటం, స్థిరత్వం కలిగి ఉండటం, ఇంద్రియ నిగ్రహం, అహంకారం లేకుండటం, పుట్టుక, చావు, వృద్ధాప్యం, రోగం అనేవాటి వలన కలిగే దుఃఖాన్ని దోషాన్ని, మాటమాటకీ స్మరించడం, కొడుకు, భార్య, యిల్లు మున్నగు వానియందు ఆసక్తి లేకుండటం, అంగీకారయోగ్య అంశాలపై సమభావం, నా ఎడల తదేక ధ్యానంతో కూడిన తిరుగులేని అంకితభావం, ఏకాంత ప్రదేశగమనం (ఏకాంతంలో ధ్యానం, ఏకాగ్రత), ప్రాపంచిక వ్యక్తుల పట్ల విముఖత, ఆత్మజ్ఞానం గురించిన నిరంతర చింతన (సాంఖ్య) తత్వజ్ఞాన వాస్తవార్థాన్ని అవగతం చేసుకోవడం; ఇదీ ''జ్ఞానం''; దీనికి వ్యతిరేకమైనదంతా ''అజ్ఞానం''.

బౌద్ధ ప్రవచనాలు తెలిసిన వారెవరైనా గీతలోని పై శ్లోకాల్లో బౌద్ధమత ప్రధాన సిద్ధాంతాల్లోని ప్రతీ మాటా, ప్రతి పలుకూ, మక్కీకి మక్కీ కాపీ కాదనగలరా ?

పదమూడో అధ్యాయనం 5, 6, 18, 19 శ్లోకాల్లో భగవద్గీత వివిధ శీర్షికల కింద కర్మలకు సరికొత్త అలంకారిక వ్యాఖ్యానం ఇచ్చింది. ఆ శీర్షికలు 1. యజ్ఞాలు 2. దానాలు 3. ఆపస్సులు 4. ఆహారం 5. స్వాధ్యాయం (వేదాధ్యయనం). పాత భావాలను ఇచ్చిన ఈ కొత్త వ్యాఖ్యాలకు మూలమెక్కడ? మఝిన నికాయ, 1, 286 సుత్త 16 లో బుద్ధుడు చెప్పిన వాటితో సరిపోల్చండి. గీత పదమూడో అధ్యాయం 5, 6, 18, 19 శ్లోకాల్లో కృష్ణుడు చెప్పింది బుద్ధుని మాటలను యధాతథంగా దింపడం కాదా ?

నేను ఎంపిక చేసిన సైద్ధాంతిక ప్రాముఖ్యం కలిగిన దృష్టాంతాలలో ఇవి కొన్ని మాత్రమే. ఈ విషయంలో మరింత ఆసక్తి కలిగినవారు తెలాంగ్ తన భగవద్గీత ప్రచురణలో. ఇచ్చిన పాదసూచికల ఆధారంగా గీత, బౌద్ధంల మధ్య పోలికలను గమనించి తమ జిజ్ఞాసను తృప్తిపరచుకోవచ్చు. అయితే, భగవద్గీత బౌద్ధ భావాల వల్ల ఎంతగా ప్రభావితమైందో, బౌద్ధం నుంచి గీత ఎంతగా ఎరువు తెచ్చుకుందో చెప్పడానికి నేను ఇచ్చిన ఉదాహరణలు చాలును. సారాంశమేమిటంటే- బౌద్ధసూత్రాల నమూనాలో భగవద్గీతను ఉద్దేశ్యపూర్వకంగా రూపొందించారు. బౌద్ధ సూత్రాలు సంభాషణలు. భగవద్గీత కూడా అంతే. బుద్ధుని మతం స్త్రీలకు శూద్రులకు ముక్తిని ఇవ్వజూపింది. కృష్ణుడు కూడా స్త్రీలకు శూద్రులకు ముక్తినివ్వడానికి ముందుకు వస్తాడు. ''బుద్ధునికి, ధర్మానికి, సంఘానికి శరణం వేడుతాను'' అంటారు బౌద్ధులు. ''అన్ని ధర్మాలను పరిత్యజించి నన్నే శరణువేడు'' అంటాడు కృష్ణుడు. బౌద్ధానికీ, భగవద్గీతకూ మధ్య సంబంధం ఉన్నదనడానికి ఇంతకుమించిన దృష్టాంతం అక్కరలేదు.

# IV

పూర్వ మీమాంస, బౌద్ధమతాల తర్వాతనే గీత వెలువడిందని (దృష్టాంతాల ద్వారా) నేను నిరూపించాను. నేను ఇంతటితో ముగించవచ్చు. కాని అలా ముగించలేననిపిస్తుంది. నా ప్రతిపాదనకి వ్యతిరేకంగా మిగిలిపోయిన ఒకే ఒక్క వాదనకి కూడా జవాబు చెప్పాల్సి ఉంది. అదే తిలక్ వాదన. అదొక తెలివైన వాదన. భగవద్గీతకీ బౌద్ధ మతానికీ మధ్య భావాలలో పదప్రయోగంలో కూడా సారూప్యతలున్నాయని తిలక్ గుర్తిస్తాడు. బౌద్ధమతం భగవద్గీతకన్నా ముందుగానే వచ్చిన కారణంగా సారాంశంలో బౌద్ధమతం దాత అయితే, గీత గ్రహీత అని చెప్పవచ్చు. ఇంత స్పష్టమైన నిర్ధారణ తిలక్‌కు రుచించలేదు. ఆ మాటకొస్తే ప్రతి విప్లవ సమర్థకులకెవరికీ నచ్చలేదు. విప్లవానికి ప్రతి విప్లవం రుణపడి ఉన్నట్లు చూపడం వారికి ఇష్టం లేదు. అవి తమ ప్రతిష్టకి సంబంధించిన సమస్యగా భావిస్తున్నారు. ఈ సమస్య నుండి బయటపడడానికి తిలక్ ఒక మార్గాన్ని సూచించాడు. హీనయాన బౌద్ధానికీ, మహాయాన బౌద్ధానికీ మధ్య గల తేడాను ఆయన చూపిస్తాడు. మహాయాన బౌద్ధం, భగవద్గీత తర్వాతనే వచ్చిందంటాడు. ఒకవేళ గీతకూ, బౌద్ధ మతానికీ మధ్య సాదృశ్యాలుంటే అవి గీత నుండి మహాయానవాదం స్వీకరించినవేనంటాడు తిలక్. దీనివల్ల రెండు ప్రశ్నలుత్పన్నమవుతాయి. మహాయాన బౌద్ధం పుట్టుక ఏ కాలంలో జరిగింది? అలాగే భగవద్గీత రచనాకాలం ఏది? తిలక్ వాదన సూక్ష్మమయినదీ తెలివయిందీ గూడా. కానీ అందులో పసలేదు. అసలు ఆ వాదన అతని స్వంతం కాదు. వింటర్నిట్జ్ (W'nternitz)[29] కెర్న్ (Kern)[30] వారి గ్రంథాల్లో పాదసూచికల్లో చేసిన యధాలాప వ్యాఖ్యల మీద ఆధారపడ్డది. ఈ యిద్దరు కూడా మహాయాన బౌద్ధానికీ, భగవద్గీతకీ మధ్య కొన్ని సారూప్యతలున్నాయనీ, మహాయానబౌద్ధం గీత నుండే కొన్ని భావాలు ఎరువు తెచ్చుకున్నదనీ చెప్పారు. ఈ అభిప్రాయాల వెనుక వింటర్నిట్జ్‌గానీ, కెర్న్‌గానీ, తిలక్‌గానీ ప్రత్యేక పరిశోధనలు చేసినట్లు రుజువులు ఏమీలేవు. వీళ్ళందరూ భగవద్గీత మహాయాన బౌద్ధం ముందే వచ్చిందన్న ఊహలో కొట్టుకుపోయేవారే.

ఈ కారణంగా భగవద్గీత రచనా కాలాన్ని పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది ముఖ్యంగా తిలక్ [31] ప్రతిపాదించిన వాదం దృష్టిలో ఉంచుకొని, భగవద్గీత మహాభారతంలో ఒక భాగమేననీ, ఈ రెండింటినీ రచించింది వ్యాసుడనే రచయిత ఒక్కడేననీ, అందుచేత మహాభారత రచనాకాలమే భగవద్గీత రచనా కాలం గూడానని తిలక్ అభిప్రాయంగా కన్పిస్తుంది. మహాభారతంలోని కథలు చంద్రగుప్త మౌర్యుడి కాలంలో గ్రీకు రాయబారిగా వున్న మొగస్తనీసుకు బాగా తెలుసు గనుక; మొగస్తనీసు క్రీ.పూ. 300 సంవత్సరాల నాడు భారతదేశంలో ఉన్నవాడు గనుక, మహాభారతాన్ని శకయుగానికి 500 సంవత్సరాలకు ముందే రాసి ఉన్నట్లు తిలక్ వాదం. శకయుగం క్రీస్తు శకానికి 500 సంవత్సరాలకు ముందే

రాసి ఉన్నట్లు తిలక్ వాదం. శకయుగం క్రీస్తు శకానికి 78 సంవత్సరాల తర్వాత ప్రారంభమవుతుంది. ఈ ఆధారంతో భగవద్గీత క్రీ.పూ. 422 సంవత్సరానికి ముందే రచించి వుండాలి. ప్రస్తుత గీతారచనా కాలం విషయంలో యిదీ తిలక్ వాదం. మూల భగవద్గీత మహాభారతం కన్నా కొన్ని శతాబ్దాలకు ముందే రచింపబడి ఉంటుందని ఆయన అంటాడు. గీతలో చెప్పిన సంప్రదాయాన్ని మనం నమ్మితే భగవద్గీతలోని మతాన్ని అతి ప్రాచీన కాలంలోనే నారాయణుడు నరుడికి బోధించినాడు. మహాభారత రచనా కాలం గురించి తిలక్ సిద్ధాంతం నిలబడదు. గీత యావత్తు మహాభారతం యావత్తు ఒకేసారి, ఒకే వ్యక్తి చేతనే రాయబడినట్లుగా ఆ వాదం భావిస్తుంది. ఇలాంటి ఊహకు సంప్రదాయంలో గాని, ఆ రెండు గ్రంథాలలో అంతరంగికంగా గానీ రుజువులేమీ లేవు. ఈ చర్యను మహాభారతానికి పరిమితం చేస్తే తిలక్ భావన ప్రచారంలోనున్న భారతీయ సంప్రదాయాలకు విరుద్ధంగా ఉంది. ఈ సంప్రదాయం ప్రకారం మహాభారత రచన మూడు దశలుగా జరిగింది. (1) జయము (2) భారతము (3) మహాభారతము. ఒక్కో భాగాన్ని ఒక్కో రచయిత రాసినట్లు తెలుస్తోంది. ఈ సంప్రదాయాన్ననుసరించి, ప్రధమ భారతానికి వ్యాసుడు గ్రంథకర్త దాన్నే 'జయ'మని కూడా పిలుస్తారు. రెండోదయిన భారతం - దీన్ని వైశంపాయనుడు, మూడవదైన 'మహా భారతాన్ని' సౌతి రచించారు. ఈ సంప్రదాయాన్ని మహాభారతంలోని అంతరంగిక రుజువులతో ప్రొఫెసర్ హాప్‌కిన్స్ పరిశోధనలు నిరూపించాయి. ప్రొఫెసర్ హాప్‌కిన్స్ [32] ప్రకారం ఈ మహాభారత రచనలో చాలా దశలున్నాయి. ప్రొఫెసర్ హాప్‌కిన్స్ మొదటి దశలో అది మహాభారత యుద్ధంలో పాల్గొన్న యువకుల గాధలు, నాటకాలతో కూడిన 'పాండు ఇతిహాసం'.[33] అందులో ఉపదేశాల సుదీర్ఘ భాగాలు చేరలేదు.

ఈ మహాభారతం క్రీ.పూ. 400-200ల మధ్య కాలంలోదని హాప్‌కిన్స్ అభిప్రాయం. రెండవ దశలో ఉపదేశాల్ని పౌరాణిక విషయల్ని జోడించి ఇతిహాసాన్ని పునర్మించారు. ఇది క్రీస్తుపూర్వం 200 - క్రీ.శ. 200 సంవత్సరాల మధ్య కాలంలో జరిగింది. మూడవ దశలో (1) మొదటి గ్రంథం ఉపోద్ఘాతంతో కలిపి రెండవ దశ చివరి కాలంలో, చివరి రెండు పుస్తకాలు తొలి గ్రంథానికి చేర్చటం జరిగింది. (2) పెరిగిపోయిన అనుశాసన పర్వాన్ని, శాంతిపర్వం నుండి వేరు చేసి, దానినొక ప్రత్యేక గ్రంథంగా గుర్తించారు. ఇది క్రీ.శ. 200-400 మధ్య కాలంలో జరిగింది. ఈ మూడు దశలకూ క్రీ.శ. 400 సంవత్సరాల నుండి అప్పుడప్పుడూ విపులీకరణలు విస్తరణలు చేస్తుపోవడాన్ని నాలుగో దశగా లేక చివరిదశగా చెప్పాడు హాప్‌కిన్స్. పాణినీయంలో,[34] గృహ్యాసూత్రాలలో[35] మహాభారత ప్రస్తావన గురించి తిలక్ చేసిన వాదనలను ముందే ఊహించి హాప్‌కిన్స్ వాటి గురించి చర్చించాడు. హాప్‌కిన్స్ పరిశీలించని కొత్త ఆధారాలను రెండింటిని మాత్రమే తిలక్

చూపించగలిగారు. అందులో ఒకటి, చంద్రగుప్త మౌర్యుని కొలువులో గ్రీకు రాయబారిగా మెగ్తనీసు [36] నమోదు చేసిన వివరాలు, మరొకటి శ్రవణా రాశితో మొదలయ్యే ఉత్తరాయణం గురించి ఆది పర్వంలో ఉన్న ఖగోళశాస్త్ర ఆధారం.[37] తిలక్ వాదిస్తున్న; మెగస్తనీసు నుండి వచ్చినవంటూ చెబుతున్న వాస్తవాలను నిరాకరించాల్సిన అవసరం లేదు. దాని మూలంగా క్రీ.పూ. 300 సంవత్సరంలో 'కృష్ణ' ఉపాసన శౌరసేవ జాతి జనులలో ప్రారంభమయిందన్న విషయం ధృవపడుతుంది. అయితే అప్పటికే మహాభారతం వెలుగులోకి వచ్చిందన్న వాస్తవాన్ని ఇదెలా రుజువు చేస్తుంది ? అలా చేయలేదు. పైగా ఈ మొగస్తనీసు చెప్పిన కథలు, ఇతిహాసాలు, మహాభారతం నుండే గ్రహించటం జరిగిందని రుజువు కూడా చేయజాలదు. ఈ గాథలూ, ఇతిహాసాలూ, ఆనాటి ప్రజల నాలుకల మీద నానుతున్న వీరగాధలేనని అవే మహాభారత రచయితకీ, మొగస్తనీసుకీ కథల గనులుగా ఉపయోగపడ్డాయన్న అభిప్రాయాన్ని ఖండించజాలదు కూడా.

తిలక్ చెప్పిన ఖగోళ శాస్త్ర సంబంధమైన రుజువు కూడా సరియైనదే కావచ్చు. ''అనుగీత''లో విశ్వామిత్రుడు నక్షత్ర మండల పరిగణనలో శ్రావణ నక్షత్రము (మహాభారతం. అశ్వ 44.2, ఆది 71.34)తో ప్రారంభించాడనే విషయం ఆయన సరిగానే చెప్పాడు.38 అప్పుడు ఉత్తరాయనం శ్రవణ రాశి ప్రారంభమవుతోందన్న వ్యాఖ్యాతలు వివరించారు. మిగిలిన వ్యాఖ్యానాలు సరియైనవి కావు. వేదాంగ జ్యోతిష్య కాలంలో ఉత్తరాయణ సూర్యుడు ధనిష్ట రాశిలో ఉన్నపుడు శకయుగం 1500 సంవత్సరాలకు పూర్వం ఖగోళ శాస్త్ర సంబంధమైన పరిగణన ప్రకారం సూర్యుడు ధనిష్ట రాశిలో ఉన్నపుడు ఉత్తరాయణం ప్రారంభం కావాలి. ఖగోళ గణన ప్రకారం ఉత్తరాయణం ఒక రాశి ముందుగా ప్రారంభం కావాలంటే వెయ్యి సంవత్సరాలు పడుతుంది. ఆ లెక్కన శ్రవణరాశిలో ఉత్తరాయణ ఆరంభం శకయుగం పూర్వం 500 సంవత్సరాలకు జరిగి వుండాలి. మహాభారతం ఒకే రచయిత చేత, ఒకేసారి, ఒకే గ్రంథంగా రచింపబడి వుంటే ఈ నిర్ధారణ సరిఅయినది అయ్యేది. కానీ అందుకు ఆధారమేదీ లేదు దాన్ని దృష్టిలో పెట్టుకొని పరిశీలిస్తే తిలక్ ఖగోళ శాస్త్ర సంబంధమైన రుజువు మహాభారతకాల నిర్ణయానికి ఉపకరించే అవకాశం లేదు. అయితే ఖగోళ శాస్త్ర విషయం మహాభారతం మొత్తం రచనా కాలాన్ని కాక, దానిలో ఒక భాగమైన ఆదిపర్వం రచనాకాల నిర్ణయానికి మాత్రమే తోడ్పడుతుంది ఈ కారణాలవల్ల తిలక్ మహాభారతం కూర్పుకు సంబంధించని కాల నిర్ణయ సిద్ధాంతం కుప్పకూలిపోతుంది. వాస్తవానికి అనేక దీర్ఘ విరామాలతో కూర్చబడిన ధారావాహిక కథా రూపమైన మహాభారత రచనా కాలాన్ని నిర్ణయించడానికి పూనుకోవడమనేది ఓ వ్యర్థ ప్రయత్నం. మహాభారతాన్ని క్రీ.పూ. 400 క్రీ.శ. 400 సంవత్సరాల మధ్య కూర్చడం జరిగిందని ఎవరయినా ఒక నిర్ణయానికి రావచ్చు. కానీ ఇంత విశాల పరిధి

తిలక్ ఆశించిన ప్రయోజనానికి పనికిరాదు. ఈ కాల పరిమితి కూడా స్వల్పమైనదేనని కొందరి విద్వాంసుల అభిప్రాయం. మహాభారతం అరణ్య (వన) పర్వం 190వ అధ్యాయంలోని ఎడుకలు (Edukas) అనే పదానికి బౌద్ధ స్థూపాలు అని తప్పుడు అర్థం ఇచ్చారు39 కానీ వాస్తవానికి మహమ్మదీయు ముట్టడిదారులు మతాంతరీకరణ పొందిన ముస్లిముల కోసం కట్టిన ఇద్‌గహ్ (Idgahas) అను సూచిస్తాయని ఒక వాదముంది. ఈ వివరణమే గనక వాస్తవమైతే మహాభారతంలోని కొన్ని భాగాల్ని మహమ్మద్ ఘోరీ దండయాత్రల తరువాత కూర్చి ఉంటారని అవగతమవుతుంది

ఇక యిప్పుడు భగవద్గీత రచనా కాలానికి సంబంధించిన తిలక్ సిద్ధాంతాన్ని పరిశీలిస్తాము. వాస్తవంగా అతని సిద్ధాంతం వెనుక రెండు ప్రతిపాదనలున్నాయి. భగవద్గీత, మహాభారతంలో భాగమనేది ఏకకాలంలో ఒకే వ్యక్తి రచించాడనేది మొదటి ప్రతిపాదన చేయటం జరిగింది. గందరగోళం లేకుండా వుండడం కోసం ఈ రెండు ప్రలిపాదనలనూ విడివిడిగా పరిశీలిస్తాను.

రచనకి సంబంధించి మహాభారతంతో గీతను కలపడంలో తిలక్ ఉద్దేశం స్పష్టంగానే వుంది. తనకు తెలుసునుకున్న మహాభారత రచనా కాలం సహాయంతో తనకి తెలియని గీత రచనా కాలాన్ని నిర్ణయించాలనుకుంటున్నాడు తిలక్. మహాభారతంతో గీతకి ముఖ్యమైన సంబంధం ఉన్నట్టుగా తిలక్ చేసే ప్రతిపాదనకి మూలమైన ఆధారం దురదృష్టవశాత్తూ చాలా బలహీనమైన భాగం. తిలక్ ప్రకారం గీత మహాభారతంలో ఒక భాగం అని అంగీకరించడానికి గల కారణం ఆ రెండింటి రచయిత వ్యాసుడేనన్న అభిప్రాయం. దీన్ని ఆమోదించడమంటే, ఒక కాల్పనిక విషయాన్ని వాస్తవంగా ఆమోదించడమే అవుతుంది. అంటే వ్యాసుణ్ణే గుర్తించదగ్గ ఒక ఫలానా వ్యక్తిగా అనుకోవడం, మనకు మహాభారత రచయిత వ్యాసుడే. పురాణాల కర్తవ్యాసుడే, భగవద్గీతారచయిత వ్యాసుడే, బ్రహ్మసూత్ర కారుడూ వ్యాసుడే. పై రచనలన్నీ శతాబ్దాల దీర్ఘ విరామం కలిగిన కాలంలో రచించబడినవి కాబట్టి వాటి రచయిత ఒక్కడే అని ఒప్పుకోలేము. కొందరు సనాతన రచయితలు, తన ఉనికిని మరుగుపరచుకొంటూ మంచి ప్రాచుర్యం సంపాదించడం కోసమని వ్యాసుడు వంటి గౌరవనీయ వ్యక్తి పేరును తమ రచనలకు మారు పేరుగా, కలం పేరుగా తగిలించుకోవడం పరిపాటి. గీతా రచయిత వ్యాసుడే అయితే అతడు మరో వ్యాసుడై ఉండాలి. మహాభారతమూ, గీత గ్రంథ రచనా, ఏకకాలంలో జరిగాయని చెప్పే తిలక్ వాదాన్ని వ్యతిరేకించే వాదన మరొకటి కూడా వుంది మహాభారతం 18 పర్వాల గ్రంథం. పురాణాలు కూడా పద్దెనిమిదే, చిత్రమయిన విషయమేమిటంటే భగవద్గీతలో సైతం 18 అధ్యాయాలే ఉన్నాయి. అందుచేత సహజంగానే ఒక ప్రశ్న ఉదయిస్తుంది. ఈ రకమైన సాదృశ్యం ఎందుకొచ్చిందని, దానికి సమాధానం - ప్రాచీన భారతీయ రచయితలు

కొన్ని పేర్లకూ కొన్ని సంఖ్యలకూ గొప్ప పవిత్రత యిచ్చేవారు. అందుకు వ్యాసుని పేరూ, 18వ సంఖ్యా ఉదాహరణగా తీసుకోవచ్చు. కానీ భగవద్గీతకు 18 అధ్యాయాలు నిర్ణయించడం బయటికి కనిపించిన దానికంటే, కొంచెం ఎక్కువే గుర్తింపుని సంతరించుకుంది. 18 సంఖ్యను పవిత్రమైనదిగా, మహాభారతం నిర్ణయించిందా? లేక గీత నిర్ణయించిందా. మహాభారతం నిర్ణయించి వుంటే గీత తర్వాత రాసిన రచన అయి వుండాలి. అదే గీత అయి వుంటే దానితర్వాత మహాభారత రచన జరిగి ఉండాలి. రెండింటిలో ఏదైనా, ఈ రెండు రచనలు ఏక కాలంలో రాసినవి కావు.

ఈ పరిశీలనలు తిలక్ చేసిన తొలి ప్రతిపాదనను ఖండించడంలో కీలకమైనవి కావు. అయితే ఒకటి మాత్రం నా దృష్టిలో కీలకమైందే. మహాభారతంలోనూ, గీతలోనూ కృష్ణుని సాపేక్షమయిన పాత్ర గురించి చెపుతాను. మహాభారతంలో ఎక్కడా కృష్ణుణ్ని అందరూ ఆమోదించిన దేవునిగా చిత్రీకరించలేదు. ఆయనకి కనీసం ప్రముఖ స్థానం ఇవ్వడానికి సైతం మహాభారతంలో ప్రజలు సిద్ధంగా లేరు. రాజసూయయాగంలో, ధర్మరాజు అతిథులను గౌరవించే సందర్భంలో కృష్ణునికి ప్రాధాన్యం ఇవ్వదలచినపుడు కృష్ణునికి దగ్గర బంధువైన శిశుపాలుడు అందుకు వ్యతిరేకిస్తూ కృష్ణుణ్ని నిందిస్తాడు. శిశుపాలుడు కృష్ణుణ్ని తక్కువ జాతిలో పుట్టినవాడని గేలి చేయడమే కాకుండా, నైతికంగా పతనమయిన వాడనీ, యుద్ధంలో విజయం కోసం నియమాల నతిక్రమించిన కుట్రదారుడంటూ నిందిస్తాడు. ద్వేషపూరితంగా కనిపిస్తున్నప్పటికీ అవన్నీ కృష్ణుడి విషయంలో వాస్తవాలే. ఉదాహరణకు ఉద్యోగ పర్వంలో దుర్యోధనుడు కృష్ణుని మొహం మీదే ఆయన చేసిన తప్పుడు పనులన్నీ ఎత్తి చూపిస్తూ, నిందించడం జరిగింది. వీటన్నింటినీ స్వర్గంలోంచి వింటున్న దేవతలు దుర్యోధనుడన్న మాటలన్నీ నిజమేనని అంగీకారసూచకంగా పూలవాన కురిపిస్తారు. ఇదిలా ఉండగా మరోప్రక్క భగవద్గీత కృష్ణుణ్ని సర్వశక్తి సంపన్నునిగా సర్వవ్యాప్తమైన దేవునిగా స్వచ్ఛమైన ప్రీతిపాత్రమైన మూర్తీభవించిన సచ్ఛీలునిగా చిత్రీకరిస్తుంది. ఒకే వ్యక్తి వ్యక్తిత్వం గురించి ఒకే రచయిత రెండు రచనలలో ఏకకాలంలో రెండు పరస్పర విరుద్ధమయిన భిన్నమైన అంచనాలను రాయడం జరిగి ఉండదు. భగవద్గీత రచనా కాలాన్ని బౌద్ధమత ఆవిర్భావం కంటే ముందుంచాలనే ఆతృతతో అతి ముఖ్యమైన ఈ పరిశీలనాంశాలను తిలక్ గమనించలేదు.

ఇక తిలక్ రెండవ ప్రతిపాదనాంశం కూడా బలంగా లేదు. భగవద్గీత రచనా కాలాన్ని నిర్ణయించే ప్రయత్నం చేయడం ఎండమావుల వెంట పడడం కాక మరొకటి కాదు. ఆ ప్రయత్నం విఫలం కాక తప్పదు. ఎందుకంటే భగవద్గీత, ఒకే రచయిత రాసిన ఒకే పుస్తకం కాదు గనుక. అది వివిధ కాలాల్లో విభిన్న రచయితలు వ్రాసిన రచనల సమూహం.

ఈ మార్గాన్నే పయనించి ఈ దృక్పధంతోనే విషయాలను పరిశీలించాల్సిన ఆవశ్యకతను గుర్తించిన పండితుడు ప్రొఫెసర్ గార్బె ఒక్కడే. భగవద్గీత గురించి ప్రొఫెసర్ గార్బె వాదం ఏమిటంటే అది రెండు భాగాలు. ఒకటి మూలం. దానికి మరొకటి చేర్చబడింది. అదే ప్రక్షిప్తం. ఈ అభిప్రాయంతో నేను ఏకీభవించలేకపోతున్నాను. ఈ విషయంలో నా పరిశీలన ప్రకారం భగవద్గీత నాలుగు విడిభాగాలనేది. ఇదే నా అంతిమ నిర్ణయం. ఆ భాగాలు ఎంత విలక్షణమైనవంటే ఈనాటి గీతా గ్రంథాన్ని తీసుకుని చూసినా సరే వాటిని సులువుగా గుర్తించవచ్చు.

(1) అర్జునుడు యుద్ధం చేయడానికి ఎలా నిరాకరించిందీ, యుద్ధంలో పాల్గొనమని కృష్ణుడే తనని ఎలా బలవంతం చేసిందీ, చివరికి అర్జునుడు ఎలా ఒప్పుకున్నదీ - వగైరా - ఈ వీరుని కథా గీతాల రూపంలో కవి పాడడం జరిగింది. అది ఒక కాల్పనిక గాథే తప్ప. అందులో ఒక మత విషయం గాని తాత్విక విషయం గాని ఏమీలేదు

మూలగీతలో ఉన్న భాగాలు మొదటి రెండు అధ్యాయలలోని... శ్లోకాలు; 11 అధ్యాయంలోని 32-33 శ్లోకాలలో కృష్ణుడు తన వాదనను ముగిస్తాడు. నా చేతిలో పరికరంగా వుండు, నేను చెప్పింది ఆచరించు, యుద్ధం వల్ల పాపం చెడు అంటుతాయని భయపడకు. నేను చెప్పినట్టు చేయి, అవివేకుడివి కాకు...''

అర్జునుడి చేత యుద్ధం చేయించడానికి కృష్ణుడు చేసిన వాదం ఇది. బెదిరింపుతో కూడిన ఈ నిర్బంధవాదమే అర్జునుణ్ని తలవంచేలా చేసింది. అర్జునుడు కాదంటే తాను పశుబలం ఉపయోగించక తప్పదని, కృష్ణుడు బహుశా బెదిరించి ఉండవచ్చు కూడా. కృష్ణుని విశ్వరూప ప్రదర్శన ఒక విధంగా ఈ పశుబల ప్రదర్శనను మరో విధంగా చెప్పడమే. ఈ వాదాన్ని అనుసరిస్తే భగవద్గీతలో విశ్వరూప వ్యవహారం గూడా మూలగీతలో ఒక భాగమే.

(2) మూలగీతకు తొలి అతకు తనని తాను భగవత్ స్వరూపునిగా మత దేవునిగా కృష్ణుడు చెప్పుకునే భాగం. ఈ భాగం ప్రస్తుత గీతలో భక్తియోగం గురించి చెప్పే శ్లోకాల్లో భాగంగా వుంది

(3) పూర్వ మీమాంస సిద్ధాంతాలకు సమర్ధనగా సాంఖ్య, వేదాంత తత్వాలను పరిచయం చేసే భాగాలు మూల భగవద్గీతకు చేరిన రెండో అతుకు. ఈ భాగాలు మునుపు లేవు. కృష్ణ భక్తితత్వంతో కలగలిపిన చారిత్రక కథాగేయంగా మాత్రమే గీత మొదటి వుండేది. భగవద్గీతలోని తత్వశాస్త్ర భాగాలు తరువాత చేర్చినవి. మూల సంభాషణ, వాటి క్రమం ఆధారంగా ఈ చేర్పులను సులువుగా నిరూపించవచ్చు.

ఒకటవ అధ్యాయం 20-47 శ్లోకాలలో అర్జునుడు సమస్యల గురించీ, చెబుతాడు. రెండవ అధ్యాయంలో కృష్ణుడు, అర్జునుడు లేవనెత్తిన సమస్యలకు సమాధానం చెప్పే ప్రయత్నం చేస్తాడు. ఇవన్నీ వాద ప్రతిపాదనల రూపంలో ఉన్నాయి. కృష్ణుడు చేసిన తొలివాదం 2, 3 శ్లోకాల్లో ఉంది. అర్జునునితో అతని ప్రవర్తన గర్హనీయంగా ఉందని, ఆర్యునికి తగని విధంగా ఉందని, పౌరుషహీనంగా నీ స్థాయికి తగనిదిగా వుందని కృష్ణుడు అంటాడు. 4,5 శ్లోకాల్లో అర్జునుడు యిలా సమాధానమిస్తాడు. ''అత్యుత్తమ గౌరవాన్నందుకోవలసిన పూజ్యులు భీష్మున్నీ, ద్రోణున్ని ఎలా చంపేది? వీరిని చంపడానికి బదులు అడుక్కుతింటే నయం కదూ! నా పూర్వుల్ని పెద్దల్ని చంపగా లభించే రాజ్య సింహాసనం నాకెందుకు? నేననుభవించలేను''. మళ్ళీ 6 నుండి 8 శ్లోకాల్లో అర్జునుడిలా చెబుతాడు. మనం కౌరవులను జయించడం మంచిదా? లేక కౌరవులచేతిలో ఓడిపోవడమా? ఈ రెండింటిలోనూ ఏది ప్రశంస నీయమైనది'' అర్జునుని ప్రశ్నకు కృష్ణుడిచ్చిన సమాధానం 11 నుండి 39 వరకు వున్న శ్లోకాల్లో ఉంది. (i) దుఃఖం సహేతుకం కాదు. ఎందుకంటే అన్నీ నాశరహితమైనవి. చెడిపోనివి. (ii) ఆత్మ అశాశ్వతమైనప్పుడు మనిషి హతుడవుతాడన్నది తప్పుడు అభిప్రాయం. (iii) నువ్వు పోరాడాలి! ఎందుకంటే యుద్ధం చేయడం క్షత్రియ ధర్మం గనుక!

గీతలో ఈ సంభాషణ చదివిన వారెవరికైనా ఈ క్రింది అంశాలు, దృష్టిలోకి వస్తాయి.

1. అర్జునుడు లేవనెత్తిన ప్రశ్నలు తాత్వికమైనవి కావు. అవి ప్రాపంచిక మానవుడు వేసిన ప్రాపంచిక ప్రశ్నలు. సహజమైన ప్రశ్నలు.

2. కొంతమేరకు కృష్ణుడు వాటిని సహజమైన ప్రశ్నలుగా ఎంచి వాటికి అదేరీతిలో సమాధనం కూడా ఇస్తాడు.

3. ఆతరువాత సంభాషణ కొంత మలుపు తిరుగుతుంది. తాను యుద్ధం చేయనని ఖచ్చితంగా చెబుతూనే, అర్జునుడు ధోరణి మార్చి ''తాను కౌరవులను చంపడమా? కౌరవుల చేతిలో చనిపోవడమా? అంటూ తన అనుమానాన్ని వ్యక్తం చేశాడు. అర్జునుడు చెప్పిన దానికి పొంతన లేకుండా, ఉద్దేశపూర్వకంగా, తప్పుతోవ పట్టించి యుద్ధానికి తాత్విక సమర్ధన ఇవ్వటం కోసం కృష్ణునకు కల్పించిన అవకాశం.

4. 31 నుండి 38 శ్లోకాల్లో కృష్ణుడు ఆ ప్రశ్నకు స్వాభావికమైనదానిగా తీసుకుని, యుద్ధం క్షత్రియ ధర్మం గనుక యుద్ధం చేయడం నీ బాధ్యతఅని చెబుతాడు.

వేదాంతతత్వాన్ని గీతలో ప్రవేశపెట్టడం, అది తదనంతర కాలంనాటి ప్రక్షిప్తం అనీ అసహజమనీ, సాంఖ్య వేదాంతాన్ని దానిలో ప్రవేశపెట్టడం అనీ స్పష్టంగానే తెలుస్తుంది.

సాధారణంగా అర్జునుడు వెయ్యని ప్రశ్నకు కృష్ణుడు సమాధానమిస్తాడు. ఒకవేళ ఎప్పుడైనా ప్రశ్నకి సమాధానంగా చెప్పే విషయంలో ఆ ప్రశ్నకు ఆ యుద్ధంతో ఏ విధమైన సంబంధం కన్పించదు. ఈ విషయాలు భగవద్గీతలోని వేదాంత భాగాలు మూలగీతలోనివి కావని సూచిస్తాయి. కాలక్రమంలో అవి చేర్చబడినాయి. ఆ భాగాలకు సరియైన స్థానం కల్పించడానికి, ఏ ప్రశ్న వేస్తే అనుకున్న సమాధానం వస్తుందో ఆ ప్రశ్నను అర్జునుని నోట అడిగించారు. అంతేకాని అర్జునుడడిగిన ఆ ప్రశ్నలకు యుద్ధ సంబంధ లౌకిక సమస్యలకు సంబంధం ఏమాత్రం లేదు.

మూల భగవద్గీతకు వేసిన మూడవ మాసిక కృష్ణుణ్ని ఈశ్వర స్థాయి నుంచి, పరమేశ్వర స్థాయికి ఉద్ధరించిన శ్లోకాలున్న భాగం. ఈ అతుకు 10వ అధ్యాయంలో 15వ అధ్యాయంలో కృష్ణుడు చెప్పిన అంశాలను బట్టి తేలికగా గుర్తించవచ్చు.

(ఇక్కడ ఆ శ్లోకాలు ఉదహరించబడలేదు)

నేను ముందే చెప్పినట్లుగా భగవద్గీత రచనా కాలాన్ని ఖచ్చితంగా నిర్ణయించాలనుకోవడం మూర్ఖత్వం అవుతుంది. అలా చేయడంలో ఏమైనా విలువ వుందని భావిస్తే, అటువంటి ప్రయత్నం భగవద్గీతకు చేర్చిన ప్రతి అతుకునూ అది చేర్చబడిన కాలాన్ని వేరుగా నిర్ణయించవలసి వుంటుంది. ఈ మార్గంలో పయనిస్తే, నేను చెప్పిన 'జయ'మని పిలువబడ్డ మహాభారత ప్రథమ ప్రతిలో మూల భగవద్గీత భాగం అయి వుండవచ్చు. కృష్ణుడు కేవలం గిరిజన తెగల దేవుడిగా [40] అక్కడ కన్పిస్తాడు. మెగస్తనీసు కాలం తర్వాత మాత్రమే కృష్ణుడు ఈశ్వరునిగా చిత్రించబడిన మొదటి అతుకు చేరింది. అయితే అది ఎంతకాలం తర్వాత అనేది మాత్రం చెప్పటానికి సాధ్యం కానిది. ఏమైనా చాలాకాలం తర్వాతనే అని మాత్రం ఖచ్చితంగా చెప్పగలం. బ్రహ్మణులు, మొదటి కృష్ణతత్వానికి మిత్రులు కారన్నది ఇక్కడ తప్పకుండా గుర్తించుకోవలసిన అంశం. ఆస్తవానికి వారు దానికి ముందు మాత్రమే ఇది జరిగి వుంటుంది.[42]

ఇంతకు ముందే చెప్పిన కారణం వల్ల, సాంఖ్య, వేదాంత ప్రస్తావన ఉన్న భాగాలు జైమిని, బాదరాయణ సూత్రల తరువాతి కాలంలో మూల గీతకు రెండో అతుకుగా చేరి వుండాలి. ఈ సూత్రల కాలాన్ని ప్రొఫెసర్ జాకొబి[43] జాగ్రత్తగా పరిశీలించారు. క్రీస్తు శకం 200-450 సంవత్సరాల మధ్య కాలంలో వాటి రూపకల్పన జరిగి వుంటుందని ఆయన నిర్ధారణ.

గుప్తరాజుల పరిపాలన కాలంలో, కృష్ణుడు పరమేశ్వర స్థానానికి ఎదిగిన మూడవ అతుకు, మూలభగవద్గీతలో చేరి వుంటుంది. దానికి కారణం స్పష్టం. గుప్తుల శత్రువులైన శకులు ''మహాదేవుణ్ని'' తమ ఇలవేల్పుగా ఆరాధించారు. ఆ కారణం చేత గుప్తులు వారికి

వ్యతిరేకంగా ''వసుదేవ కృష్ణుణ్ణి'' తమ ఇలవేల్పుగా రూపొందించుకున్నారు. మతాన్ని వ్యాపారంగా మార్చుకున్న బ్రాహ్మణులు ఎన్నడూ ఒక దేవుడికి అంకితం కాలేదు. పాలక తెగ పూజించే దేవుడినే వారు ఇలవేల్పుగా కూడా కొలుస్తూ వారి ప్రభువుల్ని సంతోషపరచడానికి ఆ దేవుణ్ణి ఉన్నతమైన, శక్తివంతమైన పరమేశ్వరునిగా నిరూపించారు. ఇదే సరియైన వివరణ అయినట్టయితే - ఈ అతుకును మూల భగవద్గీతకు క్రీ.శ. 400-464 మధ్య కాలంలో తగిలించి వుండాలి.

భగవద్గీతను బౌద్ధమతానికన్నా ముందుగా నిలబెట్టే ఆలోచన, సఫలం కాలేదని రుజువయింది. అలాంటి ఆలోచన బుద్ధుడన్నా అతని విప్లవతత్వ బోధన అన్నా అంతరాల్లో ఒక విధమైన వ్యతిరేక భావాల్ని పెంచుకున్న వారి ఇచ్ఛాపూర్వక ఆలోచన మాత్రమే దీన్ని చరిత్ర ఆమోదించదు. ఏది ఏమయినా సైద్ధాంతిక విలువలు గల ఆ గీతాభావాలు, కాలానికి సంబంధించి బౌద్ధ సూత్రాలకు, జైమిని బాదరాయణ సూత్రాలకు చాలాతర్వాత వచ్చినవన్న విషయాన్ని చరిత్ర ఖచ్చితంగా చాలా అసాధారణంగా నిరూపిస్తుంది.

భగవద్గీత హీనయాన బౌద్ధం కన్నా తర్వాతదే కాదు. మహాయాన బౌద్ధం కన్నా కూడా తర్వాతదేనని, ఈ కాల చర్చ రుజువు చేస్తుంది. మహాయాన బౌద్ధం, తర్వాత పుట్టిందని ఒక అభిప్రాయం ఉంది. దానిప్రకారం బౌద్ధ సంఘాల్లో తలెత్తిన సమస్యలను పరిష్కరించడానికి కనిష్కుడు క్రీ.శ. 100వ సంవత్సరంలో ఏర్పాటుచేసిన మూడవ బౌద్ధ మహాసభ తర్వాత మహాయానం ఉనికిలోకి వచ్చిందని భావించబడుతుంది. ఇవి శుద్ధ తప్పు.[44] ఆ బౌద్ధ మహాసభ తర్వాత ఓ కొత్త బౌద్ధ తెగపుట్టుకొచ్చిందనడం సరికాదు. అతి ప్రాచీనమైన సమూహాలను దుయ్యబట్టడానికి కొత్త పేర్లు ఉనికిలోకి వచ్చాయి. మహాసాంఘిక అనే బౌద్ధ సమూహానికి కేవలం మరోపేరు మహాయానమని కిమూరా నిరూపిస్తాడు. ఈ మహా సాంఘికుల సమూహం పైన చెప్పినదానికన్నా చాలా ముందు నుంచే ఉంటున్నది. పరంపరను విశ్వసిస్తే ఈ సమూహం (మహా సంఘికులు) బుద్ధుని మహాపరినిర్వాణం అనంతరం 236 ఏళ్ళ తర్వాత పాటలీపుత్రంలో జరిగిన తొలి బౌద్ధ మహసభ కాలం నాటికే వున్నారు. అంటే క్రీ.పూ 307[45]లో బౌద్ధ సమూహాల సూత్రాలను పరిష్కరించడానికి తొలి మహాసభ జరిగింది. ఈ మహసభ బౌద్ధులలోని థేరవాద సమూహంపై ధ్వజమెత్తింది. థేరవాద తెగనే తదనంతర కాలంలో హీనయానంగా ముద్రవేశారు. (అంటే హీనమార్గాల్ని అనుసరిస్తున్న వారని అర్థం) మహా సాంఘికులు మహాయానులుగా పేరుమారుతున్న తరుణంలో భగవద్గీత ఆనవాలే లేదు.

ఇదిగాక అసలు భగవద్గీత నుండి మహాయాన బౌద్ధులు ఎరువు తీసుకున్నదేమిటి? వాస్తవానికి వారు భగవద్గీత నుండి ఎరువు తీసుకోడానికేముంది? కిమురా చెప్పినట్టుగా బౌద్ధ మతానికి చెందిన అన్ని శాఖల్లోని సిద్ధాంతాల్ని మూడు విధాలుగా విభజింపవచ్చు.

(1) విశం ఉనికిని గూర్చి చర్చించేది (2) బుద్ధతత్వం గురించి చర్చించేది (3) మానవ జీవిత భావన గూర్చి చర్చించేవి. మహాయానం వాటికి మినహాయింపు కాదు. బుద్ధతత్వం విషయంలో తప్ప మహాయానులు, భగవద్గీతను ఏ రకంగానూ ఉపయోగించుకునే అవకాశం లేదు. మిగిలిన సిద్ధాంతాల విషయంలో ఈ రెండింటి దృక్పధంలో ఎంతో భేదం వుంది. ఆ ఒక్క విషయంలో కూడా కాల అంతరం రీత్యా ఆ అవకాశం లేదు.

భగవద్గీత చాలా పురాతనమైనది, బౌద్ధం కంటె ముందు పుట్టింది. కాబట్టి దాన్ని జైమిని పూర్వ మీమాంసతో ముడిపెట్టకూడదని - ప్రతి విప్లవ సిద్ధాంతాలకు తాత్విక సమర్ధన ఇచ్చే ప్రయత్నంగా దాన్ని భావించకూడదన్న వాదం - నా ప్రతిపాదనకు వ్యతిరేకంగా నిలబెట్టే ఏకైక మార్గం. ఆ వాదాన్ని పైన జరిగిన చర్చ పూర్తిగా కూల్చివేసింది.

మొత్తం మీద నా ప్రతిపాదన త్రిముఖమైంది. మరో విధంగా చెప్పాలంటే ఇది మూడు భాగాలు కలది. మొదటిది మౌలికంగా భగవద్గీత ప్రతీఘాత విప్లవానికి ప్రామాణిక గ్రంథమైన జైమిని పూర్వ మీమాంస తరగతికి సంబంధించిన ప్రతీఘాత విప్లవ గ్రంథం. భగవద్గీత ద్వితియా ధ్యాయంలోని 40-46 వరకూ ఉన్న శ్లోకాలను బట్టి కొందరు రచయితలు ఒక అభిప్రాయాన్ని విశ్వసిస్తున్నారు. దాన్ని బట్టి భగవద్గీత.

(మాకు లభించిన అన్ని పత్రల్లో ఈ వ్యాసం ఇలాగే పైన పేర్కొన్న వాక్యంతోనే అసంపూర్తిగా ముగిసింది.)

# అథస్సూచికలు

1. భగవద్గీత (ఇండియన్ ఆంటీక్వరీ, 1918 సప్లిమెంట్) కు తన పరిచయ వాక్యాలలో గార్బ్ ఉటంకించారు.
2. రిలిజియన్ ఆఫ్ ఇండియా 390-400 పేజీలు.
3. గార్బ్ ఉటంకించారు.
4. భగవద్గీతకు ముందు మాట.
5. భగవద్గీత (ఎస్.ఇ.బి) ముందు మాట. పే.11
6. జ్ఞాని తనకు ''ఇష్టుడని'' కృష్ణుడు చెప్పిన 7 అధ్యాయం 17 శ్లోకం చూడండి.
7. గీతా రహస్యం (రెండో ఎడిషన్) సంపుటి () అధ్యాయం
8. భగవద్గీత 4-13.
9. భగవద్గీత 2-39-53.
10. భగవద్గీత 2-47.
11. భగవద్గీత 2-48లో ఇది చక్కగా క్రోడీకరించబడింది.
12. పరిచయం (ఇండియన్ ఆంటిక్వరీ సప్లిమెంట్) పే. 30.
13. గీతా రహస్యం 2 సం. 916-922.
14. భగవద్గీత 2-(42-46) - 17 - 66.
15. భగవద్గీత 13-4.
16. గీతారహస్య 2 - పే. 749.
17. భగవద్గీత (ఎస్.బి.ఇ) పరిచయం. పే.31.
18. హిస్టరీ ఆఫ్ ఇండియన్ లిటరేచర్. పే.242.
19. బ్రహ్మసూత్రాలు చాలా ప్రాచీన గ్రంథమని తన అభిప్రాయం కాబట్టి కూడా తిలక్ ఈ ప్రస్తావనను సులువుగా స్వీకరించి వుంటాడు. చూ. గీతా రహస్య - 2వ సం.
20. ఎస్సేస్ ఆఫ్ సాంస్క్రిట్ లిటరేచర్ సం.3 - పే. 150.
21. మా గీతా గేయ గ్రంథం పరిచయం వ్యాసంలో ఈ అంశంపై చేసిన మా వ్యాఖ్యలను చూడండి. పే. 2
22. ఆంగ్ల గేయాల్లోని గీతకు ముందు మాట.

23. మాక్స్ ముల్లంగ్ హిబ్బర్ట్ లెక్చర్స్ పే.137, వెబెట్స్ ఇండియన్ లిటరేచర్ పే 288-289, రైస్ డేవిడ్స్ బౌద్ధంపై రాసిన చిన్న గ్రంథం పే. 151. డేవిడ్ పుస్తకంలో 83 పేజీ కూడా చూడండి.
24. వెబ్ - హిస్టరీ ఆఫ ఇండియన్ లిటరేచర్ పే. 285. డేవిడ్-బుద్ధిజమ్ పే.74లో ఆత్మ ఉనికిని స్పృశించే ఓ ప్రమాణ బౌద్ధ గ్రంథం నుంచి ఉల్లేఖన వుంది. దాన్నీ, గీతలోని సంబంధిత సిద్ధాంతాన్నీ పోల్చి చూడండి. ఇంద్రియ జ్ఞానాన్నీ, ఆత్మనీ ఒకటిగా చూడడాన్ని రెండూ వ్యతిరేకిస్తాయి. ఇంద్రియాల కంటె ఆత్మ భిన్నమైనదని గీత అంటుంది. బౌద్ధం దాన్ని కూడ వ్యతిరేకించి ఇంద్రియ జ్ఞానం తప్ప మరేదీ లేదంటుంది. బౌద్ధం దాన్ని కూడా వ్యతిరేకించి ఇంద్రియ జ్ఞానం తప్ప మరేదీ లేదంటుంది.
25. భగవద్గీత (ఎస్.డి. బుధిరాజా, ఎం.ఎం.ఎల్.ఎల్.బి., చీఫ్ జడ్జి, కాశ్మీర్)లో ఈ విషయాన్ని చూడండి. గౌతమా, బౌద్ధానికి ఉన్న పాఠ సాదృశ్యాల గురించి రచయిత అడుగడుగునా సూచిస్తాడు.
26. మాక్స్ ముల్లర్ - మహాపరినిబ్బాణ సుత్త - పే.63.
27. మహాపదన సుత్త.
28. తెవిజ్జ సుత్త.
29. హిస్టరీ ఆఫ ఇండియన్ లిటరేచర్ (ఆంగ్లానువాదం) సం.2, పే. 229 పాదసూచిక.
30. మాన్యువల్ ఆఫ ఇండియన్ బుద్ధిజమ్ పే.122 - పాదసూచిక
31. గీతా రహస్య సం.2 - పే 791-800
32. ద గ్రేట్ ఎపిక్ ఆఫ ఇండియా పే 398
33. ద గ్రేట్ ఎపిక్ ఆఫ ఇండియా పే.398
34. ద గ్రేట్ ఎపిక్ ఆఫ ఇండియా 395
35. ద గ్రేట్ ఎపిక్ ఆఫ ఇండియా 395
36. గీతారహస్య 2 - పే. 79
37. గీతారహస్య 2 - పే. 798
38. గీతారహస్య 2 - పే. 798
39. ధర్మానంద్ కోశాంబి - హిందీ సంస్కృతి అని అహింసా (మారాఠీ) పే. 156.

40. ''శైవిజమ్ అండ్ వైష్ణవిజమ్''లో డాక్టర్ భండార్కార్ ఇలా అంటారు. ''ప్రథమ మౌర్య పాలకుని కాలం నాటికే వాసుదేవ కృష్ణ ఆరాధన ఉండి వుంటే గనుక మౌర్య వంశపాలన కంటె చాలా కాలం ముందే అది ఆవిర్భవించి వుండాలి''. ఇది తిరుగులేని ప్రకటన. అయితే, గిరిజన దేవుడైన కృష్ణుడికీ, విశ్వీకరించిన ఈశ్వర కృష్ణునికీ తేడా చూడాలని నా అభిప్రాయం. మొదటి రకం కృష్ణుని విషయంలో డాక్టర్ భండార్కార్ చెప్పే తేదీ సరైనది కావచ్చు కానీ రెండో కృష్ణుని విషయంలో కాదు. గీతలో మనం చూస్తున్నది రెండో కృష్ణుడిని.

41. శ్యామ్‌శాస్త్రి మెమోరియల్ వాల్యూమ్ చూడండి.

42. కృష్ణతత్వానికి వ్యతిరేకత శంచరాచార్యుని వంటి అనంతర కాలం వ్యక్తి కూడా ప్రకటించాడు.

43. బ్రహ్మ వేదాంత సూత్రాల కాలం - అమెరికన్ ఓరియంట్ సొసైటీ జర్నల్, సం - 31, 1911.

44. ఈ విషయంపై సంపూర్ణ వివరాల కోసం చూడండి : ఎ హిస్టారికల్ ఆఫ్ ది టర్మ్స్ హీనయాన్ అండ్ మహాయాన్ అండ్ ద ఆరిజన్ ఆఫ్ మహాయాన బుద్ధిజమ్ -0 ర్యుకన్ కిమురా, కలకత్తా యూనివర్సిటీ, 1927.

45. బుద్ధుని నిర్యాణ సంవత్సరం క్రీస్తు పూర్వం 543గా తీసుకుంటే ఇది వర్తిస్తుంది. క్రీ.పూ. 453ను తీసుకుంటే ఇది క్రీస్తుపూర్వం 217 అవుతుంది.

★★★

## అనువాదకుని ఉపోద్ఘాతానికి ఉపయుక్త గ్రంథాలు


1. The Truth about Gita : by Narla Venkateswara Rao Narla Institute New thought, Lumbini Road No-7, Banjara Hills, Hyderabad.

2. Myth and Reality : by D.D. Koshambi, Popular Prakasan, Bambay.

3. The culture and civilisation of Ancient India in Historical outline : by D.D. Kosambi Vikas Publising House : New Delihi.

4. History of Hindu Imperialision by Swamy Dharma Thertha, Dalit Educational Literature centre : Post Box 2296, Madras.

5. మార్క్సిజం - భగవద్గీత : శ్రీ ఎస్.జి. సర్దేశాయి; దిలీప్ బోసు, ఏటుకూరి బలరామమూర్తి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ : విజ్ఞానభవన్ 4-1-435 బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాదు.

6. వ్యాసపీఠం : ఆరుద్ర, న్యూస్టూడెంట్స్ బుక్‌సెంటర్, కార్ల్‌మార్క్స్ రోడ్, విజయవాడ.

7. అంబేడ్కర్ రచనలు - ప్రసంగాలు : మూడు, నాలుగు సంపుటాలు.

8. గీతామకరందము : శ్రీ విద్యా ప్రకాశనంద గిరిస్వాములవారు, శ్రీ శుక బ్రహ్మాశ్రమము, కాళహస్తి.

9. ఇదిగో ఇదీభాగవద్గీత : బోయి భీమన్న సాహితీ నిధి ప్రచురణ, ఐ.సి.85, ఇర్రంమంజిల్, హైదరాబాద్.


సుందరయ్య గ్రంథాలయ
A C No. 8.1198...
హైదరాబాద్-500 044.

# BHAGAVADGITA - VOKA PARISEELANA

"కులం అనేది కొన్ని మత విశ్వాసాల కారణంగా ఏర్పడిన వ్యవస్థ. ఆ మత విశ్వాసాలకు శాస్త్రాల మద్దతు ఉంది. ఆ శాస్త్రాలు దైవసమానులైన ఋషులచే ప్రతిపాదించ బడినట్టివనే ప్రతీతి ఉంది. ఆ ఋషులు మానవాతీత శక్తులుగలవారని, మహాజ్ఞానులనీ అట్టివారి ఆదేశాలను ధిక్కరించడం మహాపాపమనీ ప్రజలలో ఒక నమ్మకం ఉంది..................."

"ప్రజలు చేసే పనులు వారు నమ్ముతున్న శాస్త్రాల ఆదేశాలను బట్టి ఉంటాయనీ ప్రజల ప్రవర్తనను మార్చడానికి ముందు అట్టి ప్రవర్తనకు బాధ్యతవహిస్తున్న శాస్త్రాల పవిత్రతలో వారికిగల విశ్వాసాన్ని తొలగించవలసి వుంటుంది................"

"ఇది నా దృష్టిలో నిర్వివాదామైన సత్యం. విప్లవానికి ముందే కుల వ్యవస్థతో సోషలిష్టులు ఢీకొనకపోతే విప్లవం తర్వాత అయినా సరేవారు దానితో తలపడక తప్పదు. మరోవిధంగా చెప్పాలంటే నీవు ఏ దిక్కుకి తిరిగినా సరే, దారికడ్డంగా నిలబడే పెనుభూతం కులవ్యవస్థ. ఈ భూతాన్ని చంపిపారేస్తేతప్ప నీవు రాజకీయ సంస్కరణగాని ఆర్థిక సంస్కరణగాని సాధించలేవు .................."

**డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్**

(కుల నిర్మూలన గ్రంథం నుండి)